
ఆంధ్రపత్రిక
సచిత్ర వారపత్రిక




ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY



రాష్ట్రపతి భవనోద్యానం

ఫొటోలు : జి. సత్యారావు

(విజయవాడ.)



సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతి 4 అ.


ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 47
సంచిక 36
19-5-54

జయ వైశాఖ బహుళ ద్వితీయ బుధవారం



జూనియర్ చర్చిల్

ఫోటో : సాళం కామేశ్వరరావు—రాజమండ్రి.

విషయానుక్రమణిక

ముఖచిత్రం : "ధర్మపత్ని"
హిందీ చిత్రంలో
నిరూపారాయ్.

కాలక్షేపం

"జాతి దొలంగుగాత; - గుణ
 శక్తి రసాతల సీమకుం జనుం
గాత; - కులంబు భూది యగు
 గాత; - నగంబునుండి శిలమuం
బాతము చెందుగాత; - బహు
 భంగుల విత్తమె మాకు మేలు;- వి
ఖ్యాత గుణంబు లెల్ల దృణ
 కల్పము లొక్క ధనంబు లేవడిన్."

తా॥ వ్యజాతిలోనుండి వెలివేయబడి తొలగింపబడుగాక - సద్గుణ ప్రభావము అధః పాతాళము పాలగుగాక - కులములో గౌరవము భస్మముగుగాక - నీతి మార్గ ప్రవర్తనము కొండమీదనుండి క్రిందకు దొర్లినట్లుగా దొరలిపడుగాక - అనేక విధములుగా ధనమే మాకు శ్రేష్ఠము - ధనము లేకపోయినట్లయితే, పై చెప్పిన ప్రశస్త గుణములన్నియు గడ్డిపోచవంటివి.

ధనము పుష్కలంగా ఉన్నటువంటి వానిని చాలా ప్రయోజకుడని లోకం ప్రశంసిస్తుంది. కష్టపడి ధనం ఆర్జించడం గొప్ప విషయమే. యకరానికి 40 బస్తాల ధాన్యం పండించడంవల్ల అటువంటి కృషి చేసిన వ్యవసాయదారుని ప్రశంసించవలసిందే. ఎందుచేతనంటే, ఎక్కువ పంట పండించే మార్గమును చూపి, అనగా వ్యవసాయంలో ఉత్తమ ఫలసాయంకోసం తన బుద్ధిబలం అంతా వినియోగించి భూమిని బలంచేసి, తన మాలంవల్ల పొలంవల్ల అంత ఫలం పొందినాడంటే, ఒక విధమైన తపశ్శక్తిని దానికి ధారపోసినాడని చెప్పవచ్చు. అటువంటి కృషివల్ల దుర్భిక్షం పోతుంది. కృషివల్ల దుర్భిక్షం తొలగిపోయిన విధంగానే, తపస్సువల్ల పాతకం తొలగిపోతుంది.

ఏకదీక్షగా ఒక నిర్మాణ కార్య విధానమునకు నడుము కట్టుకొని అహోరాత్రాలు కృషిచేయడం కూడా తపస్సు అని చెప్పవలసిందే. గాంధిమహాత్ముడు నిత్యవిధిగా రాట్నంమీద నూలు వడికేవాడు. నిత్యవిధిగా ప్రాతఃకాలం భగవత్ప్రార్థన చేసేవాడు. రాత్రి తిరిగి భగవత్సంకీర్తన చేసేవాడు. ఆయన ప్రత్యేకంగా ఉదయమున్నూ, సాయంకాలమున్నూ చేసినటువంటి భగవధ్యానమువల్ల ఆయన ఆత్మ పరిపక్వమైన విధంగానే, ఆయన నిత్యవిధిగా రాట్నంమీద నూలు తీయడంవల్ల కూడా ఆయన ఆత్మ పరిపక్వమైంది. ఆయన జీవితంలో ఆయన చేసిన ప్రతి కార్యమున్నూ తన ఆత్మ పరిపక్వంకోసం చేశాడు. ఏపని చేసినప్పటికీ, ఆ కర్మవల్ల తన కర్మవిమోచన అయ్యేటట్లుగా చేశాడు. కర్మవిమోచన అయ్యేటట్లుగా తపస్సు చేసినవానికి ఏ విధంగా పాతకములన్నీ తొలగిపోతాయో, గాంధిమహాత్ముడు నిర్వర్తించిన చేతిపనుల మూలంగానే ఆయన యింద్రియములను వశపరచుకొని, ఆ కర్మ ప్రవృత్తివల్లనే మోక్షం సాధించాడు. చేతిపనులు చేజార నివ్వద్దని చెవినిల్లు కట్టుకొని బోధించాడు. ఈ చేతిపనులవల్ల ఇహం పరం రెండూ ఉన్నాయన్నాడు. ఆర్థికంగా అక్కరకు వచ్చే పనులుచేయండి అవే పారమార్థికంగా కూడా అక్కరకు వస్తాయన్నాడు.

చేతినిండా పనిలేని జీవితం, నీళ్లు తోడని బావివంటిది. బావిలోని నీళ్ళు కదల్చకుండా నిల్వఉంచితే ఏమవుతాయో, కడుపులో నీళ్లు కదలకుండా కాలుమీద కాలు వేసికొనేవాని జీవితంకూడా అంతే. చేతిపనులలోనే జీవితానికి సానపెట్టబడి వస్తాడు. అప్పుడాజీవితం వజ్రంలాగున ప్రకాశిస్తుంది. దుర్వ్యసనములనేవి, ఆ జీవితానికి దుర్భర దుర్వాసనలవుతాయి. రోజు కొక చిలపనూలు తీస్తే చిలిపిచేష్టలన్నీ వలిపి వేయబడినట్లుగా ఏకులై, ఆ సునిశితబుద్ధిఅంతా సున్నితమైన సన్నని దారంలాగున జీవితయాత్రా సౌఖ్యమార్గసూత్రం చూపిస్తుంది. పనిలేని మంగలివలె సినిమా "షో"కు(*Show* కు) వెళ్ళి కూర్చుండడం పోయి, సన్నని చేనూలు పోకు అలవాటవుతుంది.

మనస్సుకు అప్పుడు యిటువంటి ఆర్థికకర్మ పరతంత్రుడైనవానికి పోనుపోను ఆపని ఒక విధమైన యోగసమాధివంటి దవుతుంది. ఇటువంటి కర్మమార్గంలోనే కర్మవిమోచన మార్గం ఉన్నదని మొట్టమొదట బోధించిన దేశం యీ కర్మభూమియే గాని మరొకటి కాదు.

ఈనాడు కార్మికలోకానికి మోక్షం చూపిస్తానని శపథంపట్టి తన జెండామీద "సుత్తి, కొడవలి" బొమ్మలు చూపించి, కార్మికుల మోక్షంకోసం ధనికలోకంపై యీ ధ్వజమెత్తినానని రష్యా ప్రగల్భములు పల్కుతోంది.

కాని, ఆ దేశంలో నిజంగా పొలములలో కొడవలి చేతబట్టి పంటలు కోయుచున్నారా? లేదు. ట్రాక్టర్లు దున్నుతున్నాయి. ఆ మోటారు యంత్రాలే పొలాలలో పండిన పంటను కోతకోస్తున్నాయి మా దేశంలో కొడవలి చేతబట్టి పంట కోతలు కోస్తున్నారనే రష్యావారి మాటలన్నీ వట్టి కోతలు తప్ప మరేమీ కావు. సుత్తి చేతబట్టి ఇనుప ఫ్యాక్టరీలలోని పనివాళ్లు ఖడ్డీలను సాగదీయుటలేదు అక్కడ ఫ్యాక్టరీలలోని యంత్రాలే ఆ పనులు చేస్తున్నాయి ఆ మరలను గిరగిర త్రిప్పేదికూడా నరకరములు కావు. నరశక్తికి బదులు ఆవిరిశక్తి అంతకుమించిన అఖండ విద్యుచ్ఛక్తి ఈ విధంగా వేలకొలది మనుష్యులు కొడవళ్లు చేతబట్టి కోయవలసిన పంటను "పింగళి వారి పేకి"వలె ఒక్క బ్రహ్మరాక్షసివంటి మోటారు ట్రాక్టరు - కోత యంత్రం చేస్తోంది ఒక్క రోజులో వంద ఎకరాల పంటను కోతకోసి, నూర్చి, ధాన్యాన్ని రాల్చి, రాశిగా పేర్చి, బస్తాలలో కూర్చి, తన పనితీర్చి వెళ్ళిపోతుంది. వేలకొలది పనివాళ్లకు కోతలలో పని లేదు. రష్యావారు కొడవలి సుత్తి పేరెత్తవలసిన పనిలేదు.

నిజంగా కొడవలితో పనిచేసి తీరాలని బోధించిన కర్మయోధుడు గాంధిమహాత్ముడే. కొడవలి చేతబట్టినవాడే గొప్పవాడన్నాడు. సుత్తి చేతబట్టినవానిదే ఉత్తమజీవితం అన్నాడు. అటువంటి చేతిపనులలోనే లోకానికి సుశ్లోకశాంతి ఉంది గాని యంత్రాగారాలవల్ల కాదు అని వాదించాడు. యంత్రాగారాలవల్ల లోకాన్ని ఆవరించేవి పొగమబ్బులు. సంగ్రామ విభ్రమ మేఘాలు. మన చేతిపనులలోనే ఉంది మన మోక్షం అన్నాడు. మన అరచేతిలో వైకుంఠం చూపించాడు. అరిషడ్వర్గములను జయించవచ్చునన్నాడు. రాజ్యాలకూ ప్రభుత్వాలకూ దురాశలు వృద్ధికావు అన్నాడు. లోభ, క్రోధములు అంతరిస్తే ప్రపంచమంతా ప్రశాంతంగా ఉంటుందన్నాడు.

యంత్రబలంవల్ల ఫ్యాక్టరీలు వృద్ధియై లక్షాధికారులు, కోటీశ్వరులు ప్రభుత్వాన్ని ప్రపంచాన్ని నడిపించె యంత్రాలుగా అమెరికావంటి దేశాలలో తయారైనారు. రష్యాలో ప్రజాబాహుళ్యం అంతా ఒక్క పార్టీ చేతులలో తిరుగుతోంది ఆ పార్టీ ఎంత చెప్పితే అంత. యుద్ధానికి దిగమంటే దేశం అంతా సిద్ధం కావాలి. గోతిలో దూకమంటే గోతిలో దూకాలి. నూతిలో దూకమంటే నూతిలో దూకాలి. దేశ ప్రభుత్వంఅంతా ఒక ఫ్యాక్టరీలాగున తిరుగుతోంది. ఒక పెద్ద చక్రం తిరిగిన విధంగా చిన్న చక్రాలన్నీ తిరగాలి. ఆ చక్రాల మధ్య చేతులు పెడ్తే నలిగి నాశనమైపోతాయి ప్రభుత్వమునకు అనుకూలంగా చేతులెత్తాలి. చేతులు దించాలి. అదే ప్రజారాజ్యం. అదే రష్యావారు లోకానికి చూపించే ప్రజారాజ్యం మజా.

కేవలం ఆర్థిక సమస్యలను మాత్రమే సాధించి, ప్రజలందరికీ కూడు గుడ్డలు సమృద్ధిగా సమకూర్చి, యిళ్లు వాకిళ్ళు ఏర్పాటు చేసి, వినోదాలు, అనేక అందాలు చందాలు ఆనందాలు సమకూర్చినట్లయితే, అటువంటి వన్నీ సమకూర్చినటువంటి రష్యా రాజ్య ప్రజావిప్లవమునకు "జై!" అనవలసిందేనా? Long Live Revolution. (లాంగ్ లివ్-రివొల్యూషన్!-ఇంక్విలాబ్ జిందాబాద్) విప్లవము వర్ధిల్లుగాక, అని చేతులెత్తి "జయ్" అని చంకలు కొట్టుకొనవలసినదేనా?

ఆర్థికంగా అన్నీ సమృద్ధిగా పుష్కలంగా సమకూరినట్లయితే, అంతమాత్రం

ఒకవూళ్లో ఒక చెట్టుకి పెద్ద బోర్డు వేళ్లాడకట్టివుంది. ముందుగా వచ్చిన మతప్రచారకుడు ఆబోర్డువంక ఎగాదిగా చూసి "నేను అందరికొరకూ ప్రార్థిస్తాను" అని రాశాడు.

తరువాత ఒక ప్లీడరు ఆదారినేవస్తూ అది చూశాడు. తనూ రాశాడు—"నేను అందరితరఫునా వాదిస్తాను." అని.

తదనంతరం ఒక డాక్టరుగారు అటువచ్చి, ఆయనా రాశాడు—"నేను అందరికీ వైద్యం చేస్తాను" అని.

అందరికంటే ఆఖరునవచ్చిన సామాన్యమానవుడు బోర్డుమీద రాసిందంతా చదివి "వీరందరినీ నేనేభరిస్తున్నాను". అని రాసి చక్కాపోయాడు.

—రామారావు (మద్రాసు)

హెడ్‌గుమస్తా, ఆలస్యంగా వచ్చిన గుమాస్తాని చూస్తూ — "ఏమింత ఆలస్యం? రోజూ ఇదే వరసా?"

గుమస్తా: నావాచీలో సరిగ్గా టయిమయింది సార్! నాది రేడియో టైము!"

హెడ్‌గుమస్తా "పాత బాకీ రేడియోలు పెట్టుకొడమూను - కరెక్టు టైము, కరెక్టుటైమూ అనడమూనూ-"

—మంథా వెంకట రమణరావు

★ కాలక్షేపం ★

చేత అటువంటి రాజ్యానికి సాటియైన మేటి ఇంకోటి కోటి కొకటైనా నాటికీ నేటికీ లేదని ధాటిగా వాదించ గలమా? లోకానికి కావలసినది శాంతి. మనుష్యులకు కావలసింది మనశ్శాంతి.

అర్థబలం స్థిరంగా ఉండవలెనంటే, అర్థబలమును నాశనంచేసే అనర్థములు నాశనం కావాలి. లక్షరూపాయిల ఆస్తికూడా లాక్షాగృహం తగులబడినట్లుగా తగులబడిపోతుంది. స్థిరాస్తిగా ఉన్నప్పటికి, అస్థిరమే అవుతుంది. భూమి స్థిరమే. కదలదు. కాని హక్కులు హరించిపోతాయి పర్మనెంటు సెటిల్మెంటు (శాశ్వత ఫయిసలయితీ) ప్రకారంగా సంక్రమించిన జమీందారీలు కూడా, "మా దారి మాది మీదారి మీది" అన్నట్లుగా రైతులకు భూములను ఒప్పగించి తప్పుకోవలసి వచ్చింది. స్థిరాస్తులైతే మాత్రం స్థిరంగా ఉంటాయా? సీసన్ సీసన్కుగానే ఉంటాయి, లెక్కల తబిసీళ్లు మారిపోతాయి,-"కరిమింగిన వెలగపండు కరణిన్ దోపన్" - చేతిలోఉన్న రూపాయి పావురాయి వంటది. చెయ్యిలేరిస్తే పిట్ట ఎగిరిపోతుంది. తన చేతిలోని చిలుక ఎగిరిపోకుండా ఉండవలెనంటే, తనలో ఉన్న, తన గూటిలో ఉన్న, రామచిలుకను - పంజరంగుల రామచిలుకను భద్రంగా చూచుకోవాలి. ధనం జాగ్రత్త చేయవలెనంటే, ఆత్మసాధనం చాలా కావాలి. శరీరం బుద్బుదప్రాయం అంటారు కేవలం గాజుబుడ్డివంటిదంటారు, కాని, అంతకన్నా గాజుబుడ్డి మన బుద్ధి "గాజుకుప్పెలోన గడగుచు దీపంబదెట్టులుండు జ్ఞాన మట్టులుండు". అని వేమనయోగి వేమారు మననంచేసి మనకు చెప్పినమాట అది. మహాపండితుడుకూడా ఒక్క దుస్సాంగత్యంతో భ్రష్టుడైపోతాడు. ఒక్క దుర్వ్యసనంతో గుర్రపు పందెములలో అతి వేగంగా వెళ్లిన అశ్వం బోల్తా కొట్టినట్లుగా కుబేరుడు కుచేలుడవుతాడు. కేవలం ద్రవ్యంమీదనే లక్ష్యం ఉంచుకొని, అది గాజుబుడ్డివంటిదని తెలియక, దానిని ఘల్లుమని మ్రోగించి, చిట్టచివరకు గొల్లుమని తెల్లమొగము వేయవచ్చు.

అర్థబలమువల్ల అనేక విఖ్యాత గుణంబులు అర్థబలముతో అరణం వచ్చినట్లుగా వస్తాయనే మాట వాస్తవంకాదు. అర్థబలమును సార్థకం చేయగల విఖ్యాత గుణములు ఉన్నప్పుడే అర్థబలం వ్యర్థంకాకుండా స్థిరంగా ఉంటుంది.

రంగయ్య పెద్ద వర్తకుడు. లాంతర్లు, రకరకాల లాంతర్లు, బస్తీనుంచి తెచ్చి తన ఊళ్లో వ్యాపారం చేస్తాడు. ఆ వ్యాపారంలో అతడు సిద్ధహస్తుడనే ప్రసిద్ధి పొంది వృద్ధిలోకి వస్తున్నాడు. ఒకనాడు లాంతరుల చిమ్నీలతో పెద్ద గంపనింపి, పట్టి ఎత్తరాని పెద్ద బుట్ట యగునని ఎంచి, కొంచెం గడ్డితో కస్తురిగా బందోబస్తుచేసి తెస్తున్నాడు. రైలులో ఆబుట్టకు రైలుచార్జి లేకుండా తెచ్చాడు తన స్టేషనువద్ద రైలు దిగాడు చౌకగా ఎవరైనా కూలివాడు వస్తాడేమో అని నలువైపుల పరికించాడు. చివరకు అప్పలస్వామి అనే ముసలికూలి ఒకడు లభించాడు. రైలుస్టేషనులో ఓవర్ బ్రిడ్జి మీదుగా ఆవలకు పోయి జట్కాబండిలో. ఆ పెద్దబుట్ట పెట్టడానికి అప్పలస్వామితో

> ఒక శవవాహకుడు విచారసమయాన ఏడు అనడం ఇష్టంలేక - "కొమ్ముకి ఆరునొక్కటి చొప్పున ఇచ్చేయండి -"
>
> అవతలిమనిషి - "ఏడురూపాయలే!!"
>
> శవవాహకుడు కొద్దిగాతగ్గి: "ఇప్పటి కిచ్చేయండి - మరోసారి, తగ్గిస్తాను -"
>
> —మంథా వెంకటరమణరావు

'ఫుట్ బాల్ ఆటను గురించి ఒక వ్యాసము వ్రాయునది:' అని పరీక్షలో ఒక ప్రశ్న.

పరీక్ష రాస్తున్న పిల్లలందరూ బుర్రలు వంచి గబగబా రాసేస్తున్నారు. ఒక్క కుర్రాడికి మాత్రం ఏం రాయాలో ఎంతకీ తోచలేదు. గంటకూడా కొట్టేశారు. ఇంతలో అతనికో ఆలోచన వచ్చింది.

"అకస్మాత్తుగా వాన వచ్చినందువల్ల యీ వేళ ఆట ఆపివేయడమైనది." అని రాసి వూరుకొన్నాడు.

చేరవూడి అణాన్నరకు ఒప్పించాడు. ఆ ముసలికూలీ మాత్రం రెండణాలు యివ్వండని ఖండితంగా అడిగిచూచాడు కాని, విధిలేక రంగయ్యమాట శిరసావహించాడు. ఆ బుట్టనుకూడా శిరసావహించాడు కొంత దూరం నడిచి, "బాబూ! బరువుందిబాబూ! ఇంకో అర్ధణా చేర్చి రెండణాలు యివ్వండి బాబూ" అని ఆ ముసలి అప్పలస్వామి ఆలాపన చేస్తూ నడుస్తున్నాడు. ఈ ఆలాపనతో అతడు అడుగు వెనక్కి వేస్తున్నట్లుగా కన్పించింది రంగయ్యకు. ఈ ముసలి వానిని కొంచెం ముందడుగు వెయ్యవలసినదిగా కుందలిస్తేనేగాని యీ పనిగుడుసాలించడని యోచించాడు తన చేతికర్రను కొంచెంగా వాని వీపుమీద అనించి "హో! హో!" అన్నట్లుగా, "నడవరా! దెబ్బలా! అర్ధణా లేదు గిర్ధణా లేదు" అన్నాడు. ఆ కర్రతో పుస్తో అప్పలస్వామికి అర్ధణామీద ఆశ అంతర్ధానమై నిస్పృహా వచ్చినట్లుగా నిలువున నీరైన ఆ ఒడలు గ్రిడ్డి (స్టేషను వంతెన) మెట్లమీద ఆ ముసలికూలీ మనిషి వెనుకకు విరుగబడినట్లుగా పడిపోయినాడు. "ఏమి చెప్పుదు గురునాధ!" తలమీద బుట్ట క్రిందపడింది. అది ఆఖరుకు గాజుముక్కల గుట్ట అయింది. వంద రూపాయాల సరకు అలా చిందరవందర అయింది. అర్ధణాకోసం వ్యర్థమైంది. అర్ధణాను తృణప్రాయంగా రంగయ్య చూడలేదు. అర్ధణానూ, అర్ధమునూ పారమార్థికదృష్టితో చూడగల విఖ్యాత గుణానికి రంగయ్య రంగస్థలం కాడు.

"విఖ్యాత గుణంబులెల్ల తృణకల్పముగా" (విఖ్యాతగుణములనే గడ్డిపరకగా) చూచాడు రంగయ్య. గాజు సామానుతోపాటు దెబ్బతిన్న రంగయ్య, "ఏదీ గతి నాకు రంగా! రంగా!" అన్నాడు ఆఖరుకు.

విఖ్యాత గుణంబులు గడ్డిపరకలన్నాడు. గాజుసామాన్లుమాత్రం ప్రధానం అన్నాడు. వాటినిప్యాకింగుచేసే గడ్డిపరకలు ప్రధానం కాదన్నాడు. కాని, ఏ జాతికైనా అసలైన అయిశ్వర్యం గాజుబుడ్లు కావు వాటిని ప్యాకింగు చెయ్యడానికి మాత్రమే అక్కరకు వస్తాయని ఎంచబడి గడ్డిపరకలవలె గణింపబడుతున్న విఖ్యాత గుణంబులే పగులకుండా నిలిచేవి. మన గాజుబుడ్లను పగులకుండా భద్రం చేసేవి

మన ఆర్థికసంబంధమైన సంకల్పాభీష్టములు భగ్నముకాకుండా, మన జీవితం కూడా వాటిలోనే లగ్నమై భగ్నం కాకుండా, యీ ఆర్థిక సంకల్పాభీష్టములనేటటువంటి గాజుబుడ్లను భద్రంగా పారమార్థిక చింతతో కూడిన కొన్ని విఖ్యాత సద్గుణములనెడి గడ్డితో బందోబస్తుగా బంగీ చెయ్యాలి ఈజీవితసూత్రంలోని రహస్యం ఆమాత్రం గ్రహించినవారికి ఏది ప్రధానమో, ఏది అప్రధానమో విలువ తెలియగలదు. విఖ్యాత గుణములు తృణప్రాయములుగా కన్పిస్తాయి కాని, ఈ తృణము లేని ధనము తృణముకూడా చేయదు. ఆ గ్రహణ శక్తితో జీవితాన్ని నిగ్రహించాలి. ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః ★

సీతాకోక చిలుక

తండ్రి :

బెండకాయలు ముదరకూడదు
బ్రహ్మచారులు ముదరకూడదు
ఒంటరితనం అడవిలోపల
యౌవనం వెన్నెలలా వేస్టు కాకూడదు
పెళ్ళియీడు కొడుకున్న తండ్రికి
రావలసిన కట్నం పోకూడదు
బెండకాయలు ముదిరినా ఫరవాలేదు
ఎండిపోతే వీధిలో పారెయ్యవచ్చు
లేకపోతే కాయలు ఏరికోరి తెచ్చుకో
వచ్చు
బ్రహ్మచారి కొడుకు ముదిరితే నష్టం
పెళ్ళి చేసుకోరా అబ్బాయి పెళ్లి చేసుకో.

కొడుకు :

ఉదయించిన సూర్యుడు
పయనించ వలసిందెంతో ఉంది
హృదయంలో భావాలు
పదును తేరవలె నింకా
నాయొక్క గత కాలం గారూ
నాన్న గారూ, నన్ను బాధించకండి
వివాహం చేసుకోమని వేధించకండి.

తండ్రి :

విశేషణంలేని పదంలాగ
వివాహం కాని జీవితం అసుందరం
వెన్నెలలేని ఇసుక తిన్నెలాగ
ఎన్నాళ్ళిలా ఉంటావురా అబ్బాయి
నీ జీవితం ప్రవాహానికి
పెళ్ళామనే ఆనకట్ట అవసరం
నీ చీకటి బ్రతుకులోన
పెళ్ళామనే పెట్రోమాక్సుదీపం కావాలి
పెళ్లి చేసుకోరా అబ్బాయి - నా
కళ్లు పెట్టి నీ సమస్యలు చూసుకోరా.

కొడుకు :

ఎవరి కళ్లు వాళ్లకి చాలు
ఎవరి ముళ్ల మీద
వాళ్లే నడుచుకోడం మంచిది
పెళ్లి చేసుకొన్నాక కడగళ్ల వశ
గల్లెందుకు? ఎవరి గడియారం
ముళ్లని వాళ్లు నమ్ముకోడం మంచిది
నా జీవిత ప్రభాతంలో
పది గంటలైనా కాలేదింకా
అప్పుడే తొందరెందుకు నాన్న గారూ
ఇప్పుడే చిందర వందరెందుకు? చికా
కెందుకు?

తండ్రి :

ఆకాశాన్ని చూడు అందులోని
అనేకానేక నక్షత్రాలని చూడు
పుస్తకాలని చూడు, వాటిలోని
ఒక్కొక్క పలహాని పఠించు
ద్వంద్వ సమాసంలో ఎంత అందం
ఉందో ఆలోచించి పరికించు
బండికి రెండు చక్రాలుండాలి.

కొడుకు :

రెండే. అన్న మాటేమిటి?
రెండురెళ్లు నాలుగు చక్రాలుండొచ్చు
మూడు చక్రాలబండి ముచ్చటగా
చూడ చక్కగా ఉంటుంది.

తండ్రి :

వప్పుకొన్నావా, బండికి చక్రాలుముఖ్యం
తప్పు చెయ్యకు, ఆడవాళ్లతో చేయి సఖ్యం
నీకూ నాకూ ఎందుకురా వివాదం
ఏ కులీనుల పిల్లనో చేసుకో వివాహం.

కొడుకు :

వివాహం ఆహవం రెండూ ఒకటే

ఆరుద్ర

తండ్రి :

అదే, అదే - జీవితం
పదేపదే చెపుతున్నది
ఘర్షణలోనే ఉన్నది ఆకర్షణ
సంఘర్షణలోనే జనిస్తుంది సంతోషం
భిన్న ధ్రువాలు ఎంత విరుద్ధమైనా
ఉన్నవిధంగా ఉండడానికి అవి ఆవశ్యకం
ఆదినుంచి నేటిదాకా ఉపమానంగా
ఏదైనా తీసుకో జంటలు ముఖ్యం.

కొడుకు :

నిజమే నాన్న గారూ
జీవితం రేడియో సెట్టుకి
భర్త ఏరియల్ భార్య ఎర్తు
రెండూ ముఖ్యమే గాని
నాజీవితంలో అంత నిర్దుష్టమైన
ప్రసారం అక్కర్లేదు,
నాజీవితానికి ఎంత
వాల్యూము కావాలో నాకు తెలుసు
నాకు కావలసిన సఖురాంద్ర
స్టేషన్లు నేను వెతుక్కోగలను.
ఏ మీటర్ బాండులో
నేను కోరుకొనే ఏకైక సఖి
దొరుకుతుందో నాకు తెలుసు
నా ఆనందం నేను చూసుకోగలను.

తండ్రి :

నువ్వు కోరుకున్న సంగీతం
నీ ఒక్కడి చెవులకే ఆనందం
నువ్వు వేసుకొన్న చిత్రువు
నీ ఒక్కడి కళ్లకే అచ్చెరువు
నీ జన్మకి కారకుణ్ణి
నీ మెదడుకు మెకానిక్కుని
నీ ఊపిరికి పరబ్రహ్మని
నీ ఆనందానికి నేనే
వ్యాసకర్తనైతే బాగుంటుంది
నువ్వు ఆనందించడానికి
అప్పుడే కొంచం వీలుంటుంది
ఇప్పుడు ముగ్గురు విలాసిను లొస్తారు
ఇప్పుడు ముగ్గురు విలాసిను లొస్తారు.

కొడుకు :

ఒడ్డులేని నదికి
అడ్డం లేదు
ఎత్తుమీద ఉన్నవాడు
ఎటువైపైనా మూపు తిప్పవచ్చు
అవిటివాడు ఆకాశ గంగ దగ్గరికి
చెవిటివాడు నాదబ్రహ్మ స్వరాలు
వెళ్ళలేడు, వినలేడు.
నాందీ గీతం పాడకముందే
నాటకం తెర ఎత్తకూడదు,
గొంతుక సరిచేసుకోకుండా
శ్రుతిలో పాట పాడలేను. నా
అభిప్రాయాలకి ప్రాయం రాకముందే
వివాహం చేసుకోలేను.

తండ్రి :

నీయౌవన జీవన నాటకానికి
ఫస్టు బెల్లు కొట్టారు, నీకేది
బెస్టో నాకు బాగా తెలుసు
ఇప్పుడు ముగ్గురు విలాసినులొస్తారు
నీ జీవితంలోకి వింత కాంతులు తెస్తారు
నీకు నచ్చిన కిరణాన్ని ఎన్నుకో

కొడుకు :

రామాయణం పఠించాను నాన్న గారూ
రాముడికి సీత ఏమవుతుంది చెప్పండి
నా జీవిత ప్రభాతంలో ఇంకా
పదిగంటలైనా కాలేదు
అప్పుడే ఎందుకింత తొందర
అప్పుడే ఎందుకీ బాదరబందీ
అప్పుడే పెళ్లిపంజరంలో
నా మనఃకీరం ఎందుకు బందీ

తండ్రి :
బెండకాయలు ముదరకూడదు
బ్రహ్మచారులు ముదరకూడదు
ఒంటరితనం అడవిలోపల
యౌవనం వెన్నెల్లా వేస్టుకాకూడదు
పెళ్ళియీడు కొడుకున్న తండ్రికి
రావలసిన కట్నం పోకూడదు
ఇక్కడికి ముగ్గుగా విలాసినులొస్తారు
వాళ్ళు ఎంతెంతో కట్నం తీసుకొస్తారు.
నీ చేతిలో ఈ మలకా జాంపండు
పెడుతున్నాను
నీకు నచ్చిన కన్యకది బహూకరించు
నీకు నచ్చిన ఆనందాన్ని పెరుకో
నీ జీవిత భాగస్వామినిని ఎరుకో
నీవు మెచ్చిన కన్యకి ఫలప్రదానం చెయ్
ఆ అమ్మాయిని నీ కచ్చి .....

సేవకుడు :
ఎవరో వచ్చారండి...
కవటాకుల్లో ఈ నెల్లాంటి వాళ్ళు
రివటాల్లాంటి వాళ్ళు సీతాకోక సిలుకలు
అప్పా సెల్లెళ్ళు లాగున్నారు
అరతి కర్పూరం లాగున్నారు
ఆళ్ళతో ఆళ్ళయ్యగారొచ్చారండి
ఇద్దరూ రెండు ఇనప్పెట్లలాగున్నారండి.

తండ్రి
లోపలికి పంపించు, వారికి ఈ
గదిలోకి దారిచూపించు మధ్యనున్న
తెర తొలగించు,
ఒక్కొక్కర్ని తండ్రితో పంపించు.

కొడుకు
ఇప్పుడే ఎన్నుకోవాలా నావధువుని
నేను ఇప్పుడే పుచ్చుకోవాలా
కొలకూట మధువుని

తండ్రి :
జాగు చెయ్యకూడదు
ఆ ఇద్దరిలో ఎవరినో ఒకరిని ఎంచుకో
ఆలస్యంగా ఉదయించే తారకలాగ
లేటుగా వస్తుంది మూడవ అమ్మాయి
వీళ్ళిద్దరూ నచ్చకపోతే
ఆ మూడవ అమ్మాయినే వరించు
నీ చేతిలో పండుముక్కకు జాగ్రత్త.

కొడుకు :
ఇన్ని వసంతాలు భార్య లేకుండా
జీవించాను
ఇంకో ఇన్ని వసంతాలు బాధ లేకుండా
జీవించగలను.
కుమారుడు జన్మించినప్పుడే
తండ్రి వాడికి కరినశిక్ష విధిస్తాడు
పెళ్ళిచూపుల తతంగంతో
ప్రారంభమవుతుంది శిక్ష
తప్పించుకోడానికి చూస్తానుగాని
తప్పదంటే భరిస్తాను
ఎవరో ఒకర్ని వరిస్తాను

తండ్రి :
మంచిదిరా అబ్బాయి మంచిది
రండి, రండి, నమస్కారం.

శ్రీమంతుడు :
నమస్కారం ఈమె మా అమ్మాయి,
ప్రత్యూష పవనాలలో ఊగాడే
నిత్య మల్లిపూవులాంటిది

తండ్రి :
ఔనౌను, ఇతడు మా అబ్బాయి
తుఫాను వచ్చేటప్పుడు రేగే
సుడిగాలిలాంటివాడు
మచ్చిక చేసుకుంటేమట్టుకూ
మలయపవనంలాగ మారగలడు.

శ్రీమంతుడు :
ఔనౌను, నమస్కరించమ్మా
వీరికి నమస్కరించు,

1 వ అమ్మాయి :
నమస్తే.

తండ్రి :
విధాత సృష్టించేటప్పుడే
వివాహాలు నిర్ణయించడం కద్దు
మా అబ్బాయి జీవితం పజిల్ కి
మీ అమ్మాయికే సొల్యూషన్ కావచ్చు
మా అబ్బాయి పయనిస్తున్న మార్గానికి
మీ అమ్మాయి గమ్యస్థానం కావచ్చు,
మీ అమ్మాయి అడుగుతున్న ప్రశ్నకి
మా అబ్బాయి సమాధానం ఏమో బహుశా
మీ అమ్మాయి కల్యాణ విగ్యుద్దీపానికి
మా అబ్బాయి స్విచ్చి కాబోలు
ఇద్దర్నీ మాట్లాడుకోనియ్యండి
హృదయాలు వెతుక్కోనియ్యండి.

శ్రీమంతుడు :
అలాగే అలాగే
అమ్మాయి ఆస్తి వివరాలు చెప్పాక
అలాగే కానిద్దాము
మా ఐశ్వర్య ప్రవాహంలో
పదహారుమంది బంధువుల
చరాస్తులు ఉపనదులు
స్థిరాస్తులు సారవంతమైన లంకలు
మా అమ్మాయి తన తల్లియొక్క
పెదపెద్ద సొసైటీ భావాలకి వారసురాలు
లేడీస్ క్లబ్బు కార్యకలాపాలకి నాయకు
రాలు

తండ్రి :
చిత్తం, మాయింట్లో నేలమాళ్యంలో
మొత్తంమీద ప్రపంచంలో లేని
అత్యుత్కృష్టమైన మాటాడే
చచ్చిపోయిన చిలకఉంది.
తమరు ఇటు దయచేస్తారా
ఆ వింత గమనిస్తారా,
అబ్బాయి, అమ్మాయితో మాట్లాడుతూ
ఉంటాడు

రావుసాహెబ్ గారు జీవితంలో మొట్టమొదటిసారిగా విమానంలో ఎక్కి ప్రయాణం చేస్తున్నారు. విమానం ఆకాశంలో ఎత్తుకి ఎగురుతున్నకొద్దీ ఆయన గుండెలు అసలే పీచుపీచుమంటున్నాయి.

విమానచోదకుడు (పైలట్) వున్నట్లుండి ఒక్కసారిగా పగలబడి నవ్వటం మొదలుపెట్టాడు.

"ఎందుకూ?...ఎందుకలా నవ్వుతావు?" రావుసాహెబ్ గారు కంగారుగా అడిగారు.

"ఆహాఁ! అది కాదు. ఆ పిచ్చాసుపత్రిలో డాక్టర్లు, నర్సులూ నేను పారిపోయివచ్చానని తెలిశాక ఎంత కంగారు పడతారో తలుచుకొంటుంటే నవ్వొస్తోంది!"

ఆమెకు బహూకరించు మలాకా
జాంపడుం
ఇప్పుడే వస్తాను ఇప్పుడే వస్తాను.

కొడుకు :
[గొంతుక సవరించుకొంటాడు]

1 వ అమ్మాయి :
నిశ్శబ్దం భరించలేను నేను
నిశ్చలత్వాన్ని సహించలేను.

కొడుకు
ఇంకా ఏమేమిటి సహించలేరు
ఏతత్వాలను భరించలేరు?

1 అమ్మాయి :
స్వంత బంగళా స్వంత కారు
కొంత ఆస్తి వింత ఫర్నిచర్
సుంతైనా లేనివాళ్ళని క్షమించలేను
టెలిఫోను నెంబరులేని జీవితా
బాంకి అక్కౌంటు లేని బ్రదుకులని
తక్కువ జీతగాళ్ళని
ఎక్కువ శ్రమపడే వాళ్ళని
ఎన్నడూ సహించలేను
చిరిగిపోయిన బట్టలవాళ్ళని
మాసిపోయిన జుత్తులవాళ్ళని
రోడ్డుమీద బిచ్చగాళ్ళని
ఎలా సహించగలం చెప్పండి
ఏవంటారు ఏకీభవిస్తారా?

★ సీతాకోక చిలుక ★

కొడుకు :

పాపం. మీకేదంటే ఇష్టం
ఏదిచూస్తే ఇంతకన్నా కష్టం.

అ.

ఈతల చెరువుగట్టుమీద
ఇంద్రధనుస్సు రంగుల గొడుగుల కింద
కూల్ డ్రింకు తాగుతూ
కులాసా కబుర్లకన్న ఏంకావాలి.
ఖరీదైన విదేశీ పెంపుడు కుక్కలకి
ఖరీదైన విదేశీ బిస్కట్లు పెట్టి పెంచి
పెనక ప్రదర్శనలలో పాల్గొని
పోటీ పొందిన బహుమానాలు కరతాళ ధ్వనులలో
మొదటి బహుమానం పుచ్చుకొని
పెంపుడుకుక్క తోలు పటకా
సుతారంగా పట్టుకొని సున్నితంగా
నడవడంకన్నా ఆనందమేముంటుంది?

కొడుకు :

ఖరీదైన ఆడవాళ్ళ భర్తలు
ఖరీదైన పెంపుడు కుక్కలు
క్లబ్బులలో, కాఫీ హౌసులలో
కళ్ళు మూసీ మూయకుండా
తెరిచీ తెరవకుండా
సారాంశం లేని విషయాలు
నిష్ఫలితంగా చర్చిస్తూ
ధనాన్నీ క్షణాలనీ కాలుస్తూ
పనిపాటుల్ని నిరసిస్తూ
గోలగా డొల్లగా బతుకుతారు
ఆ సభ్యత నాకు తెలిసినా చేతకాదు.
మీభర్తగా ఉండే యోగ్యతలు నాకు లేవు.

అ. :

అందమైన ఆర్టు పేపరు మీద
అందమైన ఫోటోలు అందంగా ప్రచురించే
అందాల పత్రికలో పడదలచుకొన్న
అందాలరాశికి అనువైన భర్త కావాలి
శ్రీమతి శ్రీయుత ఫలానా దంపతులు
ఫలానా ఫలానా పెద్దపెద్దవాళ్లకి
ఫలానా ఫలానా గొప్పగొప్పవాళ్ళకి
చేసిన విందులో తీసిన ఫోటో
ఎడమనుంచి కుడికి
నవ్వుతున్న నవవిలాసిని గా
నా పేరు నాగరికతకి మారు పేరు
గుర్రప్పందాల రోజున
బ్రతికే సాటి ఆడవాళ్ళ వీపుమీద దెబ్బలాగ
రేసుకోర్సులో సరికొత్త ఫాషన్లు
ప్రవేశపెట్టే నవీన స్త్రీగా
నా రూపు సింగారానికి కనువిప్పు
చీకూ చింతా లేని జీవితం
టెన్నిస్ కోర్టులో తీరుబాటు [illegible]
విలాసం బంతి అలసిపోకుండా
అతి సున్నితంగా ఆడడం నా ఆదర్శం.

కొడుకు :

ఎవరెస్టు ఎక్కడం సులభం
అతి సామాన్యులకి అందరాని
ఆదర్శ పర్వత శిఖరాలమెట్టు
అర్థం లేని అర్థం కాని అభిప్రాయాలు
నీటి మేఘాలు అభిలాషల పొగమంచు
మీరు నోరు తెరవకముందు
మీకే మలాకా జాంపండు
ప్రెజెంటు చేద్దామనుకొన్నాను
సున్నితమైన బురదలో
సుతారంగా జారేవాళ్ళు
కాంక్రీటు రోడ్డుమీద
కాంక్రీటు భావాలతో నడవలేరు.
ఏబ్‌స్ట్రాక్టు ఆదర్శాలలో ఈదేవాళ్లు
ఏబ్సెంటీ లాండ్ లార్డులకన్న మంచివాళ్లు
మా నాన్న గారితో మీ నాన్న గారు
మా నేల మాన్యంలో నష్టం చేయబట్టి
నిత్యం తోసిరి పీలుస్తున్నా
అత్యద్భుతంగా చచ్చిపోయిన
మాట్లాడే చిలకతో మాట్లాడుతున్నారు,
మీరుకూడా వెళ్ళిచూడండి
దాని స్వరపేటికని తణిఖీ చేయండి.

అ :

పురాతన వస్తువులు ప్రదర్శించడం
అధునాతన స్త్రీల వ్యామోహం
నేల మాన్యంలోకి వెళ్లినా యీ
గాలీ వెలుగూ ఉంటాయా.

కొడుకు :

ఆధునిక రంగేళీ యువకుల
ఆధునిక ఆదర్శాలలో కన్నా
ఎక్కువ గాలి మిక్కిలి వెలుగు
నేలమాన్యంలో చాలా ఉంటుంది
దారి ఇటువైపు
నేరుగా వెళ్ళండి.

* * *

అమ్మయ్య.
బండికి రెండు చక్రాలు కావాలట
రేడియో సెట్టుకి ఏరియల్ ఎర్తూ ఉండాలట
సూర్యుడి రథానికి ఒకటే చక్రం
భార్యాభర్తల ఎర్తూ ఏరియల్సున్నా
ఏకాభిప్రాయం అనే విద్యుచ్ఛక్తి
లేకపోతే సెట్టు పలకడం సున్న
నిశ్శబ్దాన్ని సహించలేని
స్త్రీతో మాట్లాడ్డంకన్నా
నిరంతరం హోరెత్తి నీలికడలిని
చూస్తూ కూర్చుంటే దొరుకుతుంది సౌఖ్యం
ఆ పిల్లని పెళ్ళాడడంకన్నా
ఆ సముద్రంలో పడిపోడం శ్రేష్ఠం
ఒక అందమైన ఆడపిల్లయొక్క
అంచని కొంగమైన భావాలు నాకొద్దు.
బయట నాకోసం కాచుకొని నే గండుకోయిల
నేను జీవితంలో కాచుకొని ఎదురు
చూసే పిల్లేమో చూద్దాం
అయితే ఆపిల్లకి పండిద్దాం
గంట కొడితే సర్వెంటు పలుకుతాడు.
[గంట కొడతాడు.]

సీత :

బాబూ.

కొడుకు :

సేవకా, నా కల్యాణ రాణికి
నావికుడ వవుతావా
ప్రశాంతమైన ప్రకృతిలోకి
ప్రభాతాన్ని ప్రవేశపెట్టే
కోడిపుంజు లాంటివాడివా, ఆ
ఆడపిల్లని ప్రవేశపెట్టు.

సేవకుడు :

నాన్న గారు రావద్దా బాబూ
పెద్దోళ్ళు చెప్పండే
పెళ్లి సూపులు ఎట్టా బాబూ

కొడుకు :

ప్రజాస్వామిక సూత్రాల ప్రకారం
ప్రతియువకుడు తన పార్ట్‌నర్ని

ఎన్నుకోవచ్చు
ప్రవేశపెట్టు, ప్రవేశపెట్టు

సేవ.
సిత్తం.

కొడుకు :
నీళ్లు లేని నదిలో
మొసళ్లుంటాయా.
నీళ్లు లేని నదిలోని పడవకి
తెరచాప అనవసరం
ఆనందానికి వీలులేని జీవితంలో
అర్థం చేసుకోలేని భార్య దండుగ
నీళ్లు లేని నదిలో
తాబేళ్లు ఏమౌతాయి?

2. అమ్మాయి :
నమస్తే.
క్షమిస్తే చెప్తాను
మా నాన్న గారు అర్జెంటుపనిమీద
అర్జెంటుగా వెళ్లారు
అర్జంటుగా షేరు మార్కెట్టులో
ఎమర్జెంటుగా ఎవర్నో మోసం
చెయ్యాలట.

కొడుకు :
వ్యాపారానికి విశ్వాసం, వినియోగం
సహజంగా ఉండే చేతులు
యాంత్రిక నాగరికతలో
కుతంత్రాల చక్రాలలో
వ్యాపారపు సహజ హస్తాలు విరిగిపోతే
మోసం, స్వార్థం దానికి కొయ్య చేతులు
పుట్టుచేతులలాగ కనబడే పెట్టుడు చేతులు
మీ నాన్న గారు వ్యాపారస్థులైతే
మోసం చెయ్యడం వారి జన్మహక్కు.

2. అ :
టెలిఫోనుమీద ప్రపంచాన్ని బేరం
చెయ్యడం
టెలిగ్రాంమీద సమస్తాన్నీ అమ్మ
వేయడం
వస్తువులు లేకుండా వ్యాపారం
చెయ్యడం
చూస్తూఉండగా కోటీశ్వరుడు
విస్తుపోయేలోపున లేకి బికారి
ఆధునిక వ్యాపారం అంటే నాకిష్టం
అందులో నావాళ్ళకిమాత్రం రాకూడదు
నష్టం.

కొడుకు :
కొండమీదపడి విరిగినా
కొండంత ధైర్యంగల తరంగంలాగ
కనబడుతున్నారు మీరు
మీ మనస్సు ఎంత దృఢమైనది
మీ భావాలెంత గాఢమైనవి
మీ నాన్న గారు మోసగించడానికి
అర్జెంటుగా వెళ్ళారని
అతిప్లెయిన్‌గా చెప్పారు,
మీ పెదరెంత నిష్కల్మషమైనది.

మీకీ మలాకా జాంపండు
ఇవ్వాలని ఉంది.

2. అ. :
సమాన హోదాగల వాళ్ల మధ్య
ప్రమాద మేముంటుంది నిజం చెప్తే
మీరిస్తున్న యీ పండు బాగులేదనుకుం
టాను
మీరిస్తున్నారు గనుక తీసుకొంటాను.
మా నాన్న గారు వ్యాపారంలో
లోకాన్ని మోసం చేస్తున్నట్లు
తెచ్చిపెట్టుకున్న విశ్వాసాలతో
అరువు తెచ్చుకున్న భావాలతో
అతి మర్యాదగా జీవించడం నాకిష్టం

కొడుకు :
అంటే అర్థం చెప్పండి
అసలు అర్థం ఉంటే

2 అ :
ఎన్నడూ తలుపులు తెరవని బీరువాలలో
ఎన్నడూ తెరచి చూడని పుస్తకాలు
ఎప్పుడూ తెరచిచూడని ఇజాలు
మా యింట్లో మేజాలమీద మేలైన
కూజాలు
నాజూకైన చీరలు కట్టుకొనడం
నాజూకైతే అవే ధరిస్తాను
ముతక ఖద్దరు చీరలు కట్టుకొని
మీటింగ్‌కి వెళ్ళడం దేశభక్తి అయితే
అవశ్యం అదే చేశాను.
మనసులోని విషయాలు
మనసులోనే దాచుకోవడం మర్యాద
కానప్పుడు
మనసుపైకి తీసుకొస్తాను
నా ఊహలు కొరులో పోవాలంటే
పోతాయి
కాలినడకని సాగమంటే సాగుతాయి.

కొడుకు :
గాలికోడి గాలివాటాన్ని చూపెడుతుంది
గాని వేరువని తెలియచెయ్యదు
నీరు పల్లానికి పారుతుంది గాని
నిలువనీరు మంచిది కాదు
పొరపాటున మీకు మలాకా జాంపండు
ఇచ్చాను
అది నాకు ఇచ్చెయ్యండి ఈ
యాపిలు పండు తీసుకోండి.

2 అ :
మీరు ఏఫలం స్వీకరించమంటే
అదే స్వీకరిస్తాను,
మా నాన్న ఎవర్ని వరించమంటే
వారినే వరిస్తాను.

కొడుకు :
మా నేల మాన్యంలో
మా నాన్న గారున్నారు.
అతి పురాతనమైన వస్తువులు
అతిథులకు చూపిస్తున్నారు
వాటిని పరికించడమే
నేటికి ఫేషను.

2. అ :
అదే ఫేషనైతే
అవశ్యం చూస్తాను
దారి ఎటు?

కొడుకు :
ఇటు ఇటు.

* * *

(12-వ పేజీ చూడండి)

అభిమానం

వంగల వేణుగోపాలాచార్య

శారద చురుక్కున చూసింది శాస్త్రి మొహంలోకి. ఆ చూపుల తూపుల లోంచి, వేలకొలది ప్రశ్న పరంపరలు శాస్త్రి గుండెలు దూసికొని, భావాన్ని మెదడుకెక్కించాయి దాంతో పాపం! అమాయికుడయిన శాస్త్రి దిగాలు పడి పోయాడు. తన మాటలో అభావం లేదన్న సంగతి విన్నవించుకుందా మనుకున్నాడు. కాని శారద క్షణంకిందటి స్నిగ్ధమనోహర హాస విలాసిని కాదు ..బాణం గుచ్చుకున్న లేడిలా.. కుములుతూ... వేటగానిని చూసే జుగుప్సతో...శాస్త్రి నిరీక్షించే ఒక అపర శక్తి. కాదుకాదు. పరాశక్తి. యింతటి ప్రళయం ముంచుకురావటానికి అసలుసంగతేమిటో తెలిసికునేముందు వారి యితిహాసం కొద్దిగా చవిచూడటం అవసరం.

శాస్త్రి అయినా తెలివితక్కువవాడా... కాదు. కాదు...తాతగారి పాండిత్యమంతా పేపర్లలో వెళ్లబోసి, విశ్వవిద్యాలయంలో సంస్కృతపట్టభద్రుడయినాడు. కొంచెం కవిత్వధోరణి అబ్బిందేమో యిక బుద్ధికి హద్దు అంటూ లేకుండా పోయింది. యికపోతే శారదసంగతి.. భారతి, భాగవతాలు,అమ్మమ్మ అజమాయిషీకింద క్షుణ్ణంగా వల్లెవేసి.. వయసుతోపాటు వికసిత్రకా సహజలక్షణమయిన మొండితనం మూర్తీభవించిన మోహనాంగి అయినా శాస్త్రితో మాత్రం ఎన్నడూ తిరగబడలేదు. శాస్త్రిని చూడగానే శారద మొహం పద్మంలా వికసిస్తుంది. పగల్లా, అయఃపిండంలాంటి కుమార సంభవాన్ని, కవికుమారులకి మరింత 'పీట ముడులతో' అప్పగించి యిల్లుచేరే శాస్త్రికి, అనవరత దరహాస చంద్రికలతో వెలుగొందు శారద వదనారవిందం చూడగానే భావాలు గుర్రాలెక్కినట్టుండేది. వాటికి కళ్లెంవేసి కావలి చెప్పనక్కర్లే దనుకుంటాను. యీవిధంగా ముచ్చటకయినా కీచులాటెరుగని యీ దంపతుల మధ్య యీ తగవేమిటీ?...

నిద్రమంచం వదలగానే పనికట్టుకొని తనకి స్వాగత వచనాలు విన్పించిన నల్ల పిల్లిని రకరకాలుగా తిట్టుకొంది శారద మొహం కడుక్కుంటూ. ఎంతయినా జాగ్రత్తగా ఉండాలనుకొం దా నా డు. కాఫీ డికాషన్ గిన్నె పొయ్యిమీంచి దింపుతుంటే, దొడ్లోంచి శాస్త్రి...వీధిలోంచి పాలవాడు ఒక్కసారి పిలిచారు. మనస్సు శాస్త్రివద్దకి పంపి, తను గ్లాసు తీసికెళ్లి పాలు పోయించుకొంది. యీలోగా మొహం తుడుచుకుంటూ శాస్త్రి పొయ్యి ముందు కూర్చున్నాడు

'మీరు మీ గదిలో కూచోండి...కాఫీ పట్టుకొస్తాను' అంది శారద సమాధానం చెప్పకుండా శాస్త్రి లేచి వెళ్లిపొయ్యాడు.

అయిదునిమిషా లనంతరం, శుభ్రమయిన వెండిగ్లాసునిండా వేడి కాఫీపోసి, వయ్యారంగా పట్టుకొని, శాస్త్రి దగ్గరగా వచ్చింది శారద. అలా వచ్చే శారదని చూడగానే అతనిలోని కవికుమారుడు విజృంభించాడు. చేతిలోని పత్రిక బల్లమీదకి గిరవాటేసి, బిల్వమంగళుడి పోజులో నిలబడి, మోహన రాగంలో...

'బళిరా! స్వర్గమునుండి యీ భువికి ప్రాప్తంబైన దివ్యాప్సరో లలనా ముగ్ధ మనోహర ప్రణయలీలా...' అంటూ చెక్కిలి నొక్కాడు 'తెల్లవారిందీ' అంటూ శారద వెనక్కి వెళ్ళిపోయింది...మనసు ముందుకు లాగుతున్నా ... వెళ్లదన్న విషయం తెలిసినా ... దక్షిణ నాయకునిలా భయం తోపించాడు శాస్త్రి.

ఇద్దరూ కలిసి విలాసంగా నవ్వారు. మల్లెల జల్లులు కురిసినట్టు ... విరిజాజులు విరిసినట్టు...కలువలు వికసించినట్టు...సిరి కెంపులు మెరిసినట్టు.

శారదచేతిలో కాఫీగ్లాసు అల్లాగే ఉంది.

'యిదిగో...విన్నారా' అంది శారద.

'ఆ...' అన్నాడు శాస్త్రి

'ఏమిటి!' అంది శారద యింత మొహం చేసికొని.

'యిప్పుడు చెప్తావుగా'

'ఊహుఁ. మీరే చెప్పుకోవాలి' అంది శారద. మొహంలో ఒక నవ్వుకొంత వెలిగింది. వింతచూపులు తొంగిచూచాయి.

'బహుశా...కొంతగారు నిన్న ఒకపట్టు చీరకొని ఉంటారు' అన్నాడు కొంచెం సేపు ఆలోచించి.

'యిక బట్టలుతప్ప నాకు వేరే ఆలోచనే లేదనా' అంది శారద.

'మరయితే...రాధ మెడలో కాసులపేరు మహ చక్కగా ఉంది ఉండాలి మరి' అన్నాడు శ్రీరాములవారి ఫొటోకేసి చూస్తూ.

'నగలుతప్ప నాకు బతుకే లేదా' అంది శారద గొంతులో కొంచెం మార్పుంది

'అయితే విను.. యీరోజు రిలీజయ్యే కొత్తసినిమా లేవీ లేవన్నాడు,గెలిచానన్న ధీమాగా...కాని శారదమొహంచూసి ఆగిపోయ్యాడు శాస్త్రి

'పోనీ...నువ్వు చెప్పరాదూ' అన్నాడు నవ్వుతూ

'అంతేలెండి ..అయితే బటలూ, లేకపోతే నగలూ కాదంటే సినిమాలు ..యింతకంటే మా బతుకులేంనోచుకుంటాయి'

యింతకంటే యింకా ఏంనోచుకోవాలో శాస్త్రికి యింకా తోచలేదు పాపం !... సంస్కృతంలో తను చదువుకొన్న అన్ని శృంగార కావ్యాలూ మననం చేస్తున్నాడు మనుండీ. ఊహు అయినా తట్టలేదా కోరిక ఎందుకయినా మంచిదని చదువుకున్న 'కథలన్నీ' సింహావలోకనం చేసినా సమాధానం దొరకలేదు చలంగారి స్త్రీలో కొన్నంతా తిరగేసినా... శారద లాంటి విలాసవతి ఏం కోరుకుంటుందో దొరకలేదు

శారద దృష్టిలో శాస్త్రి కొయ్యబొమ్మలా నిలబడటం కనపడింది కాని అతని మనసులో జరిగే యీ సాహిత్య మథనం తెలియలేదు మగవాళ్ళెంతవాళ్లు!... ఆడవాళ్ళకి కావలసింది అయితే బట్టలూ .. లేదంటే నగలూ...కాదంటే సినిమాలూనా ...అంతకుమించి ఏం కావాలో తోచలేదట. మగజాతిమీద ఆడవాళ్ళు రాసిన సాహిత్యాన్ని కసిగా మననం చేస్తోంది శారద

'అయితే యింతకీ మీకు తోచలేదన్న మాట' అంది శారద ఇక నిశ్చయంగా.

'శారదా . చెప్పు...నిజంగా నాకు జ్ఞాపకం రావటంలేదు' అన్నాడు శాస్త్రి బతిమాలుతూ.

'ఏమీ లేదు...యివాళ నా పుట్టిన రోజు' అంది శారద

'అల్లాగా...' అన్నాడు శాస్త్రి

అయ్యో అమాయికుడా...ఎంత పనిచేశావయ్యా ... ఆమాట...కాదు కాదు . ఆ మహా వర్తమానం వినగానే.. వంద ఎకరాలు కల్సినంత హడావిడో.. ఆరు బంగారు పాతరలు దొరికిన ఆందోళనో . ప్రమోషను వచ్చినంత ఆనందమో చివరకి మొషి అయిదు రూపాయిలు యింక్రిమెంటు కల్సిన ఆనందమో...అబ్బినట్టుగా, మొహం చాటంత చేసికొని.. కళ్లు రెండూ తేలవేచి, అంతటి మహద్భాగ్యం.. మహదవకాశం కల్పించినందుకు, శల్లిసంగుకు మీ ఆవిడని ఎంతయినా అభినందిస్తూ.. తాను . భార్యా జన్మదినోత్సవ సందర్భం పురస్క

బ్రతుకు విలువ

కొంచం వాలుగనున్న సూర్యుడింకా తేజస్సును విడనాడకుండా, భూమినంతనూ ఎండచే మండేటట్టు చేస్తూనే యున్నాడు. వేడిగాడ్పు వీస్తూ, అప్పటప్పట, చెమటెక్కిన శరీరాలను ఆరబెడుతూ, మలయా నిలమా అన్నట్లు అనిపిస్తూవుంది. కళ్ళకు కాంతి తీవ్రంగా వున్నా, మళ్ళీమళ్ళీ వీచే గాలికి వినోదవంతంగా కనబడసాగింది.

నడిచేరోడ్డు తార్రోడ్డు. ఉత్తి పాదానికి భగ్గుమంటుంది. కాని టైరుగల బళ్ళు 'టంచన్'గా పోగలవు ఆ బళ్ళల్లో జనం కూడా అంత 'టంచన్'గాను కూచోగలరు. వొంటెద్దుబండీ గిత్తకు నాడాలు వేడెక్కినా, గిట్టల మూలంగా చుర్రుమనదు కాబోసు, ఇక బండి ఆలాంటిది పోతూవుంది. మరో మూట లబ్బి ఆగిఆగి, బరువు బుజంమార, నడుస్తూవున్నాడు, ఆ చెట్టు నీడ ఆ చెట్టునీడ అంచీలుగా జేసుకుంటూ.

కడచని రెండుమూడు మైళ్ళు ఆరోగ్యవ నడిస్తే, ప్రక్కనో కంపెనీ! గిర్రున తిరిగే "గాలిచక్రం", ధగధగ మెరిసే ఎలెక్ట్రిక్ స్తంభం, అతి శ్రద్ధగా అంటవేసిన ఆవురు గడ్డికప్పలు! ఆ ఆవరణలోగల కంజాయింపులు అన్నీ అందు పనిచేసేవాళ్లకు అనుకూలంగా అమర్చబడి వున్నాయి "కాంటీన్" నుండి "కిండర్ గార్డెన్" వరకు మొదళ్ళు లోపలనుండి కనబడక పోయినా, పూలతీగల చివళ్లు పైకెగబ్రాకి ఎఱ్ఱపూవులతోనో, పసుపుపచ్చని పూవులతోనో విరాజిల్లుతూ వెలువడి వికసించి వుండేని. ఎండైనా ఏ చెట్టూ ఇగురోస్తి, అంతో ఇంతో ఇంపు గొల్పుతూనేవుంది, పెరిగి పేదరిక మెడసినదానికిమల్లే, ఆ చుట్టుపట్లకంతకూ పెరగకూరుస్తూ.

అన్నీ అతి సుభ్రంగా సునాయాసమిచ్చేవిగా కానవస్తాయి రెండు చక్రాల 'ట్రాలీ'లమీద పెద్దపెద్ద 'పేకేజీ'లు లాగబడి క్రమక్రమంగా లారీల కెత్తబడుతూవున్నాయి. ఆచక్రాలు "షెడ్డు"లో గచ్చుమీద పోతూంటే డబడబా చప్పుడవుతూవున్నా కానటే మనుష్యులనిశ్శబ్దం!

అదంతా అలవాటుతో కూడుకొన్న పనిగా అగపిస్తుంది పనిఅంతా కాల పరిమితికిలొంగి, లాభదాయకంగా వుండడమనేది అక్కడే చూడగలము. ఆవరణలో మళ్లీ పొగవచ్చే యంత్రాలు లేవు బరువు అనిపించే 'గర్దర్సు' లేవు, గొడ్డళ్ళు లేవు.

ఒకషెడ్డులో ఒకగోడవద్ద ఒక మేజా బల్లమీద ఒక 'ట్రే' వుంది. ఆ 'ట్రే' ఎదుట నిలబడి ఒక నీరజాక్షి "ట్రేడింగు" కాబోలు నడుపుతూవుంది. చేసేపని కానరావడానికి ఆతట్టుకు చేతులు ముఖంపెట్టుకు పనిచేస్తూవుంది. ఈతట్టుకు కనిపించేవల్లా, సిగలో పువ్వులు, చెంగుచాటులు, చీరతెలుపు, వొయ్యారం, వొదుగూను.

ఒకదాన్ని మించి ఒకటి చిత్రంగా కనిపించునవున్నాయి ఆ కంపెనీ దైనిక కార్యకలాపంలో. వాని నన్నింటినీ చూడ్డానికప్పుడప్పుడు ప్రేక్షకులు వస్తూవుంటారు. ఆ ప్రేక్షకుల్లో ఆడవాళ్లు మగవాళ్ళు కూడా వుంటారుగాని, చూడవచ్చేవారు ముందుగా "కొనుగోలు ఉద్యోగస్థు"నకొక అనుజ్ఞాపత్ర మిమ్మని లేఖ వ్రాయాలి. ఆ అనుజ్ఞాపత్రమువచ్చినపిమ్మట ఆఆవరణలోకి ప్రవేశించి అందులోగల పరిశ్రమ ఫక్కీలన్నీ చూడవచ్చును. చాలా బందోబస్తుగా వుంటాయి అందలి 'రూల్సు' 'రిస్ట్రిక్షన్సు'. ఎప్పుడైనా ఎవరైనా మాచేరో లేదో "స్ట్రాంగ్ రూమ్" అని ఒకటివుంది. "గోడ్రెజ్" 'మేక్'ది దాని గోడకు అమర్చి ఒక పెద్ద 'చర్చి' గంటలాంటి గంట వుంది. తలుపుకు ఇనుప కటకటాలు 'డబుల్ లాక్' అవి అన్నీ అమార్! మరీన్నీ ఓ ప్రక్కను మరో గోడను అతి విడ్డూరపు చిహ్నాలు, "బంగాళా" అని ఓ పట్టె మంచం బొమ్మ, "ఆఫీస్" అని ఓ టేబిల్ బొమ్మ, "గారేజి" అని ఓ 'కారు' బొమ్మ- "ఎ" దాకా హెచ్చుతగ్గుల నమూనాలు, మరీన్నీ మంచినీళ్ళ సీసా, కలసిన కుర్చీలు, 'ట్రే'లు, బోర్డులు డెస్కులు


కంపెనీ చూడ్డానికివచ్చిన ఓమత్తకాశిని, కట్టడపు కాసులపేరు ఘల్లుమనేలా తన తెల్లని గాజులచేతులతోటి సవరించుకుంటూ ఆకార్మికయువతిని వెనకనుంచేపోల్చి "ఇలా చూడు! ఒసేవ్!" అంది అనేసరికి అది ముఖం ఇటు త్రిప్పుతూ శంఖాలతావళం సవరించుకుంటూ, "ఎందుకండీ!" అని "తంవరా!"అనిపోల్చి,"ఏం ఇలా వచ్చేరుకీ?" అని అడిగింది, పనిలో తిరుగ నిమగ్నఅయి. "నీవిక్కడున్నావుటే? నీవు మా యింట్లో అంట్లు తోమేదానవుకాదుటే మొన్నమొన్నటిదాకా? ఎక్కడకో పోయా వనుకున్నాను! ఈ బాగావు కంపెనీలో పనిక్కుదిరావా?"అని అడిగింది, అపయినుంచి వచ్చినయిల్లాలు. కార్మికాంగన "అంతా మరోనిమిషముండి చెప్తాను. తమరియింట్లో అంట్లు తోమినన్నాళ్లు తమరు నే తోమిన అంట్లే చూశారుకాని నా మొహం చూచినారేకాదు. ఇప్పుడు చూడ బుద్ధయిందా?" అని అడిగింది.

అంతలో అయిదు అయిన ఘంట సాయంత్రం కొట్టారు కార్మికులు ప్రేక్షకులు అంతాకూడా ఆవరణ ఖాళీచేయాలి!

"నేను కారులో వచ్చాను. నీవున్నూ నా

(54-వ పేజీ చూడండి)

రించుకుని ఆవిడకి కొనబోయే వస్తువాహన సామగ్రినంతా ఓ దండకం చదివి వినిపించి, అత్తవారింటికి శుభాకాంక్షలు పంపి, బావమరదులనో ళ్ళు తీపిచేయించి...ఎంత చెయ్యాలి . ఏంకథా ... జీవిత ప్రణయిని, వయ్యారంగా వచ్చి, వెండిగ్లాసులో కాఫీ, యివ్వబోతూ ... నువ్వు ఊహించుకోలేకపోయినా...తనే కొండదిగివచ్చి, 'యివాళ నా పుట్టిన రోజు' అంటే విని...ఏదో... యోగ వాలినట్టుగా.. 'అలాగా' అంటావుటయ్యా ... అర్భకుడా ... యిపుడయినా మించింది లేగు...మేలుకొని మహదానంద పడవయ్యా ... ఊహూ ... శాస్త్రి కదులు లేగా.. శారదమొహంలోని కోపాన్ని, చంద్రబింబంలోని మసకతోనూ, వినీలాకాశంలోని కారుమేఘాలతోనూ ... ఎగిరే ముంగురుల్ని తుమ్మెద రెక్కలతోనూ ...ఎగిరే పమిటను దేవకన్య చెరగుతోనూ ...అసలు వ్యక్తిని కోపంతో నిలబడిన శకుంతలతోనూ...చివరకి, చేతిలో గ్లాసుతో సహా, గిరుక్కున వెనక్కి తిరిగి వెళ్లేశారదని మత్తగజేంద్రగామినితోనూ...చిత్రిస్తూ... ఊహిస్తూ...అసలతను యీ లోకంలోనే ఉంటేగా...తప్పెవరిదో నాకుమాత్రం ఏం తెలుసూ ...యిదండీ జరిగినసంగతి! ★



సీరియల్

"శారద"

16

నెల రోజులు మాత్రమే గడిచాయి. ఈ ముప్ఫై రోజులలో ప్రకృతిలో పెద్దమార్పులేమీ సంభవించలేదు. మామూలుగా వైశాఖమాసపు వేడి దహిస్తున్నది; మనుషులు చల్లనిపదార్థాలకోసం, నీడకోసం, గాలికోసం తపించిపోతున్నారు. బెజవాడలో వడగాడ్పులు నిప్పులు చెరుగుతున్నాయి. ఈ నెలలోపున భద్రయ్యగారికి తుపానువంటి ఆర్థికసంక్షోభం వచ్చింది. సుదర్శనంగారు తుదిసారి హెచ్చరిక చేశాడు. తన కూతుర్ని మారుమాట్లాడకుండా భాస్కర్రావుకి చేసుకోమని. భాస్కర్రావు 'ససేమిరా' అన్నాడు అంతకన్న సన్యాసం పుచ్చుకుంటానన్నాడు. డబ్బొక్కటే జీవితానికి ప్రధానం కాదని అతనివాదన. సుదర్శనంగారు, "అట్లాగుటోయ్" అని గర్జించివెళ్ళాడు. ఆయన వెళ్లిన వారం రోజుల కల్లా భద్రయ్యగారి వ్యాపారంలో నష్టం వచ్చింది; పాతబాకీ కొత్తబాకీ అంతా కలిసి, భద్రయ్యగారి స్థిరాస్తికి సరిపోను తేల్చాడు సుదర్శనం. భాస్కర్రావు మొండిగా లెక్కలన్నీ ఒకటికి నాలుగు సార్లు తనిఖీ చూశాడు; ఎక్కడా పొరపాటులేదు. సుదర్శనం గారు భద్రయ్యగార్ని సాంతం ముంచేశాడు, అతి సున్నితంగా, పైకి తెలియకుండా.

భద్రయ్యగారి పది ఎకరాలపొలం, ముగ్రాజపురంలో మేడా తుడుచుకుపోయినాయి. కోర్టుకెక్కారు ఉభయులూ. తీర్పు సుదర్శనంగారి కనుకూలంగానే అయింది. పై కోర్టుకెళ్లినా లాభంలేదని తేలిపోయింది.

ఒకనాడు మధ్యాహ్నం భద్రయ్యగారు ప్రాణావశిష్టంగా భార్య, చెల్లెలు, కొడుకు వెంటరాగా, పాతబెజవాడలో రెండు గదుల భాగంలో ప్రవేశించాడు ఆయనకి మిగిలిందల్లా, భార్య తాలూకు నగలుమాత్రమే. అవన్నీ ఈరోజున తెగనమ్మితే నాలుగు వేలైనా రావు.

ఆయనకు పట్టుకొన్న దిగుల్తో గుండెజబ్బూ రెండూ సమానంగా రోజురోజుకీ పెరగసాగాయి. కుటుంబపు రోజువారీ ఖర్చుకూ ఆయన వైద్యానికీ రోజుకో నగ వెళ్లిపోతున్నది.

ఆవేళ భాస్కర్రావు వంచిన తలెత్తకుండా, పిన్ని గాజులు అమ్మటానికి వెళ్లాడు. బజారులో ఆ షరాబు దగ్గీ ఈ షరాబు దగ్గీ, చిన్నం బంగారం పోరిపిడిరాళ్లకే సరిపోయింది చివరికింకో ఆయనగూడా అట్లాగే గట్టిగా గాజును గరుకురాయిమీద రుద్దడం చూస్తుంటే భాస్కర్రావుకి మండింది "అయ్యా, బాబుగారు, మరి నేను దాన్ని అమ్ముకోడానికి కొంతైనామిగల్చరా ఏం?" అన్నాడు. ఆయన అతనికేసి ఎగా దిగా చూశాడు. బేరం కుదిరింది; కొన్నప్పటి ధరలో సగం వొచ్చింది. భాస్కర్రావు తండ్రికి మందులు రొట్టెలూ అవీ కొనుక్కుని ఇంటికొచ్చేసరికి దీపాలు పెట్టారు. భాస్కర్రావు ఆ యింటినీ, ఆయింటి విస్తీర్ణాన్నీ దాని అద్దెతో పోల్చిచూసి వెగటుగా నవ్వాడు చుట్టూ పూరిండ్లమధ్య వున్న పెంకుటికొంప అది. ఆ యింటిలో మూడు కుటుంబాలు నివసిస్తున్నాయి.

భాస్కర్రావుతో అతని మేనత్త "బజారువెళ్లి మీ పిన్నికి తలనొప్పిమందు పట్టుకురా బాబు మధ్యాహ్నంనించీ పడుకుని మూలుగుతోంది" అంది. భాస్కర్రావు "పాపం!" అంటూ బయల్దేరాడు. అతను సామారంగం చౌకువచ్చి మందుకొంటున్నప్పుడు పాండురంగ కలిశాడు పాండు, "అదేమిటోయ్, మీరిప్పుడు ఎక్కడ వుంటున్నారో కూడా బొత్తిగా తెలియటం లేదు" అన్నాడు.

భాస్కర్రావు దుర్గకొండ వేపు చూపించి, "ఆ దిగువన వుందోయ్ మాయిల్లు" అన్నాడు.

"అద్దె ఎంత?"

"పదహారు రూపాయలు."

"పెద్ద ఇల్లేనా? ఎన్ని గదులు?"

భాస్కర్రావు సీరియస్‌గా, 'మూడుగర్భాల చదరంలో ఒక కలుగూ, దానో సగం ఇంకో కలుగున్నూ! దాన్ని ఇల్లు అనటమే అసహజం మిత్రమా! ఇదివరకు నేను ఉన్న ఇంటికీ ఇప్పుడున్న ఇంటికీ వ్యత్యాసం ఒక్కటే, అది ఇల్లూ, ఇది కలుగు! అంతే" అన్నాడు.

పాండు విషాదభావంతో నవ్వాడు. ఇద్దరూ కలిసి మెల్లగా ఇంటివైపు నడవసాగారు మాట్లాడుకుంటూ దారిలో సిమెంట్ మీద కొట్లలో కాంతివంతమైన [illegible] పక్క

మీద వంటలు చేసుకుంటున్నారు పొయ్యిల్లో గడ్డి, కట్టెముక్కల మంటల ఎఱ్ఱని వెలుగులు వంటచేసే ఆడవాళ్ల మొహాలమీద మెరుస్తూ వాళ్ల ఆకలిని ఆశలనీ ప్రతిఫలిస్తున్నాయి.

భాస్కరరావు ఆ పొయ్యిల చుట్టూ ఆడుకుంటున్న పిల్లల-చింకిరి జుట్టును, పైనకోట్లల్లో కుర్చీల్లో కూర్చున్న సంపన్నులపిల్లల అందమైన అలంకారాల్నీ, నున్నగా దువ్విన క్రాపులనీ గురించి ఆలోచిస్తున్నాడు. "పాండూ! చూశావా! నేనిందాక, మా ఇంటినిగురించి ఏదో వర్ణించాను వీళ్లకంటే నేనెంతో నయం ఇప్పుడే తెలుస్తోంది" అన్నాడు.

పాండు "అట్లా ఆలోచిస్తే ఎట్లా? ఈ హెచ్చు తగ్గూ అట్లా వుండేవే!" అన్నాడు వాళ్లు మైలుదూరం నడిచారు. దారిలో రకరకాల ఇళ్లు చిన్నచిన్నవి, ఎత్తు తక్కువవీ చూసుకుంటూ వెళ్లారు. కొండమీద ఇళ్లున్నాయి. కిరసనాయిలు దీపాలమసక కాంతి కిందనించి మినుకు మినుకుమని కనిపిస్తోంది. ఆ పేటలో రోడ్లు దక్షిణంనించి వుత్తరానికి ఎత్తుగా కొండమీదికిపోతాయి.



"పిన్నీ! నువ్వు నాకన్న చిన్నదానివి. ఐనా నీకు నమస్కారం చేస్తున్నాను. నన్నూ, నాన్ననీ క్షమించు...నీకు తీరని అపచారం చేశాం"

భాస్కరరావు వాటిని మిత్రునికి చూపిస్తూ, "అబ్బాయి వీట్ని చూడు. మానవులు ఎంత దుర్భరంగా జీవించగలరో తెలుసుకోవటానికి ఇదొక ఉదాహరణ; నాకూ మొన్నటిదాకా ఈ బాధలు తెలిసేవికావు మా ఆస్తి అంతాపోయి బికారులై ఇక్కడికి చేరుకున్నప్పణ్ణించి ఈ ప్రజల్ని చూస్తున్నాను వాళ్ల బతుకు ఎంతదారుణమో, ఎంతదుర్భరమో వాళ్లు అంత మంచివాళ్లు. మున్సిపాలిటి, ప్రభుత్వం, ఏదీకూడా వాళ్లవంక చూడదు నాకు అనిపిస్తుందీ - ఈ దరిద్రమంతా మానవుడి సృష్టేనని" అన్నాడు బాధగా నిట్టూర్పు విడుస్తూ.

భాస్కరరావు నివసిస్తున్న ఇంట్లోకివెళ్తూనే పాండు, తల గుమ్మానికి కొట్టుకున్నాడు. లోపలికి వెళ్లేప్పుడు తలవంచుకు నడవాలి. అసలు కొన్ని ఇళ్లల్లోకి బోర్లాపడుక్కొని కానీ వెళ్లటానికి వీలుండదు. ముందు గదిలో మంచంమీద శల్యావశిష్టుడైన భద్రయ్యగారు పడుకొనివున్నారు. మేనత్త, పద్మ లోపల చిన్న గుహలాంటి గదిలో, బుడ్డిదీపంముందు కూర్చున్నారు. ఇల్లంతా సామాన్లతోనిండి కాలుకదపటానికి వీల్లేకండా వుంది. ముసలాయన మంచంమీద కూర్చుని పాండు ఆయన్ని పలకరించాడు. భద్రయ్యగారెందుకో విచారంగానూ కోపంగానూ వుండి చిటపటలాడుతున్నారు. భాస్కరరావు తలనొప్పి బిళ్లలు పిన్నికిచ్చాడు. పద్మ వాట్ని విరక్తిగా కిందపెట్టి, "ఇప్పుడిదిలేకపోతే ఏమీ? చచ్చిపోతానా ఏం?" అంది విసురుగా.

భాస్కరరావు దిమ్మరపోయాడు. "అదేమిటి పిన్నీ! అట్లా అంటున్నావు మందేసుకోకపోతే తలనొప్పి తగ్గుతుందా?" అన్నాడు.

బైటనించి భద్రయ్యగారు హీనస్వరంతో "దాన్ని పలకరించకురా బాబూ! అదేదో ఇవ్వాళంతా కొత్తగా మాట్లాడుతోంది" అన్నాడు భాస్కరరావు "ఎందుకనీ?" అని అడిగాడు ఎవర్నీ ఉద్దేశించకుండా. పద్మ ఇదివరదాకా ఎట్లాగో ఓర్చుకుని ఉన్నదల్లా, "ఉన్నమాటంటే అందరికీ ఉలుకేమరి! నన్ను పెళ్లి చేసుకుని ఏం సుఖపెట్టారు? నగలు పెట్టినట్టుపెట్టారు, ఒక్కొక్కటే వొలుస్తున్నారు. గాలి ఆడక ఈ ఇంట్లో వూపిరిబిగపట్టుకునిచస్తున్నాను నీళ్లుపోసుకుందామంటే మరుగులేదు. పైగా చుట్టూ అంతా వాసన. అబ్బబ్బ" అంది. ఆమెకళ్లల్లో నీళ్ళు తిరిగినాయి.

భాస్కరరావు ఆమెని ఎగాదిగా చూశాడు. ఆమెవంటిమీద సగం నగలు అయిపోయాయి. భద్రకాళిలా ఉంది ఆమె ప్రస్తుతరూపం. అతను నిదానంగా "తప్పే పిన్నీ! కాని ఏం చెయ్యటం? నువ్వు అన్నమాటలన్నీ నిజమే. ఈ క్షణాన్నించి ప్రమాణంచేస్తున్నాను, నీవు నీ నగలేవీ మాకోసం ఇయ్యవద్దు. మా బాధ మేం పడతాం. సరేనా?—ఆ మందేసుకో, కొప్పడకు." అన్నాడు. పాండు ఇదంతా వింటున్నాడు. లోలోపల బాధపడుతున్నాడు. ఎటువంటి సంసారం ఏ గతికి వచ్చింది!

భద్రయ్యగారు పాండు భుజంమీద చెయ్యివేసి, "ఇదంతా

నా బుద్ధి తక్కువ నాయనా! ఏభైఏళ్లు వచ్చాక నాకు పెళ్ళెందుకు చెప్పు! అందుకే అనుభవిస్తున్నాను" అన్నాడు, ఏడ్చినంత పనై.

భాస్కర్రావు చప్పున మేనత్త పెట్టిన మెతుకులు రెండూ నోట్లో వేసుకుని బైటికివచ్చి పాండురంగతో కొంతదూరం నడిచాడు. "పాండూ, డబ్బు కొన్ని దుర్గుణాల్ని కప్పేస్తుంది. ఆ డబ్బు పోయేసరికల్లా, చెరువు ఎండితే, చేపలు బైటబడ్డట్టు ఆ దుర్గుణాలన్నీ బైటబడతాయి. మా పిన్ని చూశావా! ఆమెకి మనుషులకన్నా నగలంటేనే ప్రేమ ఎక్కువ!" అన్నాడు.

"అబ్బో! మొగాడివి! ఇప్పుడు కనిపెట్టావా ఈ గొప్ప సంగతి! ఏ కాలంలోనూ, నూటికి ఏనలుగురో తప్ప మిగతా నారీమణులందరికీ నగలంటేనూ చీరలంటేనూ ప్రాణంకంటే ఎక్కువ అని ఇదివరకే కనిపెట్టారోయ్" అన్నాడు పాండు.

"పాండు! నేను త్రికరణశుద్ధిగా చెబుతున్నాను. నాకు మా పిన్ని అంటే చాలా గౌరవం; ఆమె మనస్సు నొప్పించటం నా కెంతమాత్రం ఇష్టంవుండదు. ఆమె అంత పెద్దవయస్సు గలదికూడా కాదు; ఆమె ఈడేవున్న నేనుఇంతవరకూ ఏ సంసారతాపత్రయమూ లేకండా తిరగటంలేదూ?—పాపం! ఆమె నిక బాధ పెట్టకూడదురా" అన్నాడు జాలిగా.

కొంత సేపు గడిచాక మిత్రులిద్దరూ విడిపోయారు.

17

వైశాఖ మాసం రెండవ పక్షంలో ఒకరోజు ఎండ అతితీవ్రంగా కాసింది. ఇళ్ళూ దళ్లూ కూడా ఎండకి కాలి పెళ పెళలాడుతున్నాయి. భూమి అంతా ఎండి బీటలువారిపోయింది. వెచ్చని వడగాలి రాత్రి పది దాటేకకూడా వీస్తోంది. జనం ఇళ్ళల్లో పడుకోలేక బైట మంచాలూ చాపలూ వేసుకుని పడుకొన్నారు. చమట వెల్లువలాగా పోస్తోంది; భద్రయ్యగారూ, భాస్కర్రావూ బైట రోడ్డుఅంచుదగ్గిర పడుకున్నారు. పద్మ, ముసలమ్మ చూరుకింద పక్క వేసుకున్నారు. పగలల్లా ఎండ తీవ్రతకి నిద్రపట్టక బాధపడి పడుకోగానే అందరూ గాఢంగా నిద్రపోయారు. రాత్రి సగం దాటింది. "నిప్పు నిప్పు" అని పెద్ద కేకలు విని ఆ చుట్టుపక్కల బైట పడుకున్న వాళ్లంతా లేచారు. భాస్కర్రావు గభీమని లేచాడు తత్తరపాటుతో. లేచి చూస్తే ఏముంది! తమ ఇల్లే!! వడికప్పు చుట్టూ అంతా కాలిపోతోంది. మంటలు అంత ఎత్తున లేస్తున్నాయి. అతను కంగారైపోయాడు. తండ్రి మంచం రోడ్డుమీదికి లాగి పిన్నినీ, అత్తనీ లేపాడు. ఇద్దర్నీ చెయ్యి పట్టుకుని బైటికి లాక్కొచ్చాడు. ఇంట్లోకి పోయి సామాన్లు బైటికి చేరేద్దామని చూసాడు. నిష్ఫలమై పోయింది. చుట్టూ పూరిండ్లు అంటుకుని సాంతం మండిపోతున్నాయి. అగ్ని నాలుకలు చాచి ఎర్రగా ఆకాశంవేపు లేస్తోంది భీకరంగా. నల్లని పొగ దట్టంగా కమ్మేసింది. పెంకుటిళ్లేమో—వాసాలు పెళీ పెళీమని పగిలి నిప్పురవ్వలు ఫర్లాంగు దూరానికి ఎగిరిపడుతున్నాయి.

రోడ్డంతా జనంతో నిండిపోయింది; కొందరు మంటలార్పడానికి వ్యర్థప్రయత్నం చేస్తున్నారు. భాస్కర్రావు దగ్గిరలో ఎవరింటిలోనూ ఫోను లేకపోవడంతో సామారంగం చౌకు వెళ్ళి 'ఫైర్ సర్వీస్' వాళ్లకు ఫోన్ చేశాడు; అగ్ని విలయతాండవం చేస్తోంది. అక్కడి కక్కడికి వ్యాపిస్తోంది భాస్కరరావూ వాళ్ళూ కాపురంవున్న పెద్ద పెంకుటిల్లు చిటికెలో భస్మమైపోయింది; అందరూ బైటే పడుకొనివుండటంవల్ల, యింట్లోనుంచి పూచికపుల్లకూడా బైటికి తెచ్చుకోలేకపోయారు.

ఫైర్ ఇంజన్లు వచ్చేసరికి ఆరు ఇళ్ళు భస్మమైపోయాయి. వాళ్లు మిగతా ఇళ్ళకు మంటలు వ్యాపించకుండా బ్రహ్మప్రయత్నం చేస్తున్నారు. ఎటు చూసినా ఏడ్పులూ, ఆక్రందనాలు. పద్మ, మేనత్త గోడుగోడున ఏడుస్తున్నారు. వాళ్ల చీరెలూ, మిగతా ఇంటి సామానూ సమస్తం బూడిద అయిపోయాయి.

భద్రయ్యగారు ఆ బీభత్సాన్నంతటినీ అట్లాగే నిలువుగుడ్లు పడి చూస్తూ కూర్చున్నారు. భాస్కర్రావు ఫైర్ సర్వీస్‌తోపాటు అటూ ఇటూ పరిగెత్తుతూ, వాళ్ళకు సహాయం చేస్తున్నాడు. ఇళ్లు కోల్పోయిన దౌర్భాగ్యులు ఇరవైమందికి పైగా రోడ్డుమీద కూర్చుని ఒకరి కొకరు చెప్పుకుని ఏడుస్తున్నారు.

ఫైర్ ఇంజన్లు తీవ్రంగా పనిచేస్తున్నాయి. భస్మావశేషాల నుంచి ముద్దలైపోయిన పెట్టెల్ని, ఇతర వస్తువుల్ని కొందరు వెతికి తీసి నిరాశచెంది, మరింతగా ఏడుస్తున్నారు. భాస్కర్రావు, పిన్ని దగ్గిర కొచ్చాడు. ఆమె వొంటిమీద మంగళసూత్రం ముక్కుపుడక తప్ప ఇంకేమీ లేవు. "పిన్నీ!"అనిఅరిచాడు భాస్కర్రావు. "నగలన్నీ ఏవీ? కొంప తీసి!..." వాక్యాన్ని అసంపూర్తిగా వొదిలేశాడు. పద్మ, "రాత్రి అన్నీ పెట్టెలో పెట్టా—నా ఖర్మ కాలింది" అంటూ భోరున ఏడవసాగింది. ఆపక్కనే పడుకునివున్న భద్రయ్యగారు, ఈ దృశ్యం చూడలేక అటుపక్కకి తిరిగి పడుకున్నాడు కళ్ళు గట్టిగా మూసుకుని.

భాస్కర్రావు పిన్ని తల నిమురుతూ, "పోనీ పిన్నీ, దరిద్రపు నగలు! వాటికోసం దిగులుపడకు చెంబూ తప్పాలా పోయాయి గదా, వాడుకోడానికేనా లేకండా! అదీ నా విచారం" అంటున్నాడు. భయంకరమైన రాత్రి పశ్చిమాన అంతమౌతోంది మామూలుగా ప్రతి రోజులాగే కృష్ణమీదినించీ తెల్లారుఝామున చల్లని గాలి వీస్తోంది; సూర్యోదయపు చక్కని ఛాయలు తూర్పున అగుపిస్తున్నాయి. పిట్టలు కిచకచ మంటూ ఎగిరిపోతున్నాయి. బెజవాడ నగరపు రొద యథావిధిగా ఆరంభమైంది. అగ్నినిర్వాపక దళం వారు తమ పని పూర్తిచేసి వెళ్ళిపోయారు నిరాశ్రయులు అక్కడక్కడ తలదాచుకుంటున్నారు. దయగలవారు కొందరు వారికి తమ పంచలలో తలదాచుకోడానికి స్థలం ఇస్తున్నారు. ఇళ్లు కాలి వాళ్లు ఏడుస్తున్న సమయాన, బైట జేరవేసిన కొద్దిపాటి సామాన్లను, కక్కుర్తి కొద్దీ తస్కరించారు కొందరు వాళ్ళను తిట్టిపోస్తున్నారు మరికొందరు. పిల్లా పాపా, గీ-బా-మంటున్నారు.

భాస్కర్రావు, పిన్నినీ, మేనత్తనూ, తండ్రినీ—ఎదురుగావున్న ఒక పూరింటి పంచన కూర్చోబెట్టి, బయల్దేరాడు—ఇక ముందు ఏం చెయ్యాలో కూడా ఆలోచించకుండానే ఏదైనా పని వెతుక్కోవాలి—లేకపోతే జరిగే వుపాయం ఏముంది? ఆస్కారం కూడా లేకుండాపోయింది. పూచికల చీపురు మొదలు తాగేగ్లాసువరకూ ఏదీ మిగలలేదు. తలదాచుకోవటానికి ఇల్లు లేదు. పేవ్‌మెంట్లమీద మూడురాళ్ళ పొయ్యిల మీద వండుకుతింటూ, పోలీసులు ఒకచోటినుంచి తరిమితే, ఇంకో చోటికి చేరుతూ కాపరాలుచేసేఅనాథలు జ్ఞాపకానికి వచ్చారు అతనికి. వాళ్లుకనీసం అట్లాంటి జీవితానికి అలవాటు పడివున్నారు. తామో? తాము ఊసరవల్లి మనస్తత్వానికి పేరుపొందిన మధ్యతరగతి వాళ్లు! తాగేది గంజయినా, పింగాణీ సాసరులో పోసుకుని ఊదుకుంటూ చప్పరిస్తేకాని ఆత్మసంతృప్తి పొందని ప్రకృతి.

'బతికి చెడ్డవాళ్లు' అని ఊరికే అన్నారా! వీళ్లల్లో బతికిననాటి లక్షణాలు పూర్తిగా నశించవు చెడిపోయిన నేటి పరిస్థితి పూర్తిగా అవగాహన కానూకాదు — వీళ్ళు జీవించటం దుర్గంధపూరితమైన నరకకూపంలోనే కాని స్వప్నాలూ, ఊహాలూ మాత్రం లక్షాధికారుల ఖరీదైన స్వర్గసీమల్లో

భాస్కర్రావు మెల్లగా నడిచి గవర్నర్ పేటకు వచ్చాడు. ఇంకా కొట్లు తియ్యలేదు హోటళ్ళు మాత్రమే జనంతో నిండి కిటకిటలాడుతున్నాయి అప్పుడప్పుడే జనసంకీర్ణ మౌతున్న బజార్ల గుండా నడిచి, మొగల్రాజపురం వచ్చాడు ఎవరితోనైనా ఇదంతా చెప్పుకుని ఏడవాలనిపిస్తున్నది అతనికి ! ఎవరున్నారు

మంచీ చెడూ

పాండురంగ తప్పు! పాండురంగ బైట అరుగుమీదే కూర్చుని, మొహం కడుక్కుంటున్నవాడల్లా, ఇంజన్‌లో బొగ్గేసేవాడిమల్లే వున్న భాస్కర్రావు అవతారం చూసి, "ఇదేమిటిరా, ఈ వేషం! పొద్దున్నే ఎక్కడికి బైల్దేరావు?" అని ప్రశ్నించాడు చాలా ఆదుర్దాగా. రాత్రి జరిగిన అగ్నిప్రమాదం సంగతి యింకా వ్యాపించలేదు. భాస్కర్రావుకి మిత్రుని ఆప్యాయమైన ఆహ్వానం, జాలిగొల్పే మాటలు కలసి, ఆపుకోలేని దుఃఖాన్ని తెచ్చిపెట్టాయి; అతను పాండును గట్టిగా కౌగలించుకుని గొల్లుమని ఏడవసాగాడు పరిసరాలను మరచిపోయి. "ఏమిటి? ఏమైంది?.. చెప్పు" అని చాలాసేపు సముదాయించాక గాని భాస్కర్రావు జరిగిన సంగతి చెప్పలేకపోయాడు.

"అవునురా! రాత్రి మా నాన్న అన్నాడు, దుర్గకొండవేపు ఎక్కడో తగలడుతున్నది అని. ఇది బస్తీ! ఏ మూల ఏం ప్రళయం వచ్చినా, ఇంకో పేటవాడికి పట్టదు చూడు! ఫైర్ సర్వీసువాళ్ళు వొచ్చారా?" అని అడిగాడు పాండు, భాస్కర్రావును అరుగు మీద కూర్చోబెట్టి.

"ఆ—వొచ్చారు మా సర్వస్వం బూడిద అయినాక! వాళ్ళ తప్పేమిటిలే! చుట్టూ అన్నీ పూరికొంపలాయె. చురచుర మండిపోయినాయి." భాస్కర్రావు పొడారిపోయిన గొంతుకతో అన్నాడు.

"అది సరే, నాన్నా పిన్నీ వాళ్ళూ ఎక్కడ ఉన్నారిప్పుడు? వాళ్ళ నేం చేసి వచ్చావు?"

"ఎదురుగుండా వున్నాడొక కిళ్ళీ కొట్టాయన; ఆయన పూరింటి పంచన కూర్చోబెట్టి వచ్చాను. ఆ పుణ్యాత్ముడే చెంబూ తప్పాలా బియ్యం ఈపూటకి సర్దుకుంటానన్నాడు. రాత్రికి ఎట్లాగా అని ఆలోచిస్తున్నాను. సుదర్శనం మా స్థిరాస్తి తేటవరం చేశాడు; తోటి మానవుడికే అంత దయ వున్నప్పుడు, పంచభూతాలకి మాత్రం దయ ఎందుకుంటుంది? అగ్నీ, వాయువూ, మాకు చరాస్తికూడా లేకుండా చేశాయి; కట్టుబట్టలతో బైటపడ్డాం."

"మీ పిన్ని వొంటిమీద నగలుండాలి! అవేనా దక్కాయా?" ఆదుర్దాగా ప్రశ్నించాడు మిత్రుడు.

"నగలా? చట్టుబండలా?? ఆవిడ అన్నీ వొలిచి భద్రంగా పెట్టెలో పెట్టిందట. అంతా స్వాహా అయింది. వొకటే ఏడుపు ఇప్పుడు..." భాస్కర్రావుకి ఏదో జ్ఞాపకానికి వచ్చింది అకస్మాత్తుగా. "పదరా పాండు; ఆ బూడిదలో వెతికితే, నగలు కరిగిన బంగారం ఏమైనా దొరుకుతుందేమో చూద్దాం పద" అన్నాడు లేస్తూ.

"తప్పకుండా. అదైనా దొరికితే, చెంబూ తప్పాలైనా కొనుక్కోవచ్చు, ఆ తర్వాత సంగతి తర్వాత ఆలోచించుకోవచ్చు."

ఇద్దరు మిత్రులూ గబగబా నడిచి, అరగంటకల్లా భాస్కర్రావు యిదివరకున్న అద్దె ఇంటిదగ్గిరికి చేరుకున్నారు. రాత్రి చీకట్లో భాస్కర్రావుకి అక్కడి బీభత్సం అట్టే కనిపించలేదు. ఏడెనిమిది పూరికొంపలు, ఒక పెంకుటిల్లూ, కాలంహరించగా, శ్మశానంలో మిగిలిన అస్థిపంజరంలా నిలచి వున్నాయి; నల్లగా పొగబారిన మట్టిగోడలు, జూదంలో సర్వస్వం గోల్పోయిన జూదరి ముఖంలాగా కనబడుతున్నాయి. ఎటుచూసినా కాలిపోయిన బొంగుముక్కలు తాటాకు మొదళ్లు, నల్లగా తడిసి—పడి వున్నాయి. పెంకుటింటి కిటికీలూ, దరవాజాలు కాలి, అకాల వైధవ్యం ప్రాప్తించిన యువతులలాగా దారుణంగా అగుపిస్తున్నాయి అగ్నిప్రమాదంలో ఆశ్రయం కోల్పోయిన అభాగ్యులు ఆ బూడిదలో భగ్నావశేషాలకోసం వెతుక్కుంటున్నారు,—ఏమైనా దొరుకుతుందేమోనని.

వీళ్ళిద్దరూ అక్కడ చేరేసరికే, పద్మ, ముసలమ్మ తమభాగం బూడిదలో వెతుకుతున్నారు, నగల బంగారుకోసం. ఆ అవశేషాల అడుగున, మూడు ట్రంకుపెట్టెలు, గుర్తుపట్టటానికేనా వీల్లేని ఘోరరూపంలో లత్తు వంకరలు తిరిగి, చప్పబడి, ఒకదానికొకటి అంటుకుపోయి, పట్టుకుంటే రాలిపోతున్నాయి. పద్మ వాట్ని ఆశగా వెతుకుతోంది. అడుగుపెట్టెలో పెట్టింది ఆమె నగలు. భాస్కర్రావు, పాండుగూడా—ఆ బూడిదలోకి వచ్చి, వెతుకుతున్నారు. అడుగురేకుల కంటుకుని బంగారం మెరిసిపోతోంది. వేడికి కరిగి, అలా అయిపోయింది భాస్కర్రావు ఆరేకును, బైటికి తెచ్చి కడిగాడు. బంగారం, ఇనపరేకూ, అవినాభావంగా కలిసిపోయాయి. బాగుచేస్తే, కొంతైనా దక్కవచ్చునన్న ఆశ కలిగింది వాళ్లకు.

18

కరిగిపోయిన బంగారాన్నంతా పోగుచేసి అమ్మితే వందరూపాయలు వచ్చింది. దాంతో చెంబూ తప్పాలా కొన్నాడు భాస్కర్రావు. అదే పేటలో, ఇంకో చిన్న పూరింటిలోకి చేరారు ఆ కుటుంబం; భద్రయ్యగారిస్థితి చాలా ప్రమాదంగా తయారైంది. వైద్యం జరగడమూ లేదు. ఆయన మతి చెడిపోయి, ఏవో పిచ్చిమాటలుకూడా మాట్లాడుతున్నాడు. పద్మ కొత్త ఇంటికి వెళ్ళి స్థిమితపడ్డాక తీరికగా ఆలోచించసాగింది; ఆమెకిప్పుడు మిగిలిందల్లా కట్టుకున్న 'ఆ ఒక్క చీరేమాత్రమే. రేపటిరోజు తిండి ఎట్లా అనేది, ప్రమాదమైన సమస్యగా వుంది ఆమెకు. రెండుపూటలా టిఫినూ, కాఫీ . మూడుపూటలా సుష్టుగా భోజనం చేసే ఆమె ఇప్పుడు, కొరం మెతుకులకే, అల్లాడిపోవల్సి వస్తున్నది. ఈబాధ పడలేక ఆమె పుట్టింటికి వెళ్ళిపోదామని తీర్మానించుకుంది; భర్తకేమో మతి చెడిపోయింది. తనకి ఎటూ, ఏ సుఖమూ దక్కలేదు; దక్కుతుందన్న ఆశా కనపడలేదు. కనీసం తిండి గూడా కరువైపోతోంది. వీళ్ళంతా ఎవరు తనకు? వీ ళ్ళేట్లాపోతే ఏం? తనను నిర్దయగా గొంతుకోసిన వీళ్లతో తనకేంపని?

ఆవేళ భాస్కర్రావు పదకొండు గంటలకు ఎక్కణ్ణించో బియ్యం తెచ్చాడు, ఊసూరుమనుకుంటూ. అతనిలో ఏనకటి మిసమిస తగ్గిపోయి, మొహం మొరటు తేలింది. వొంటిఛాయ తగ్గింది; సదా, ఏదో ఆలోచిస్తూ, దిగులుగా వుంటున్నాడు. వారం పదిరోజుల్నించి, అహర్నిశలూ వుద్యోగంకోసం వెతుకుతున్నా ఏమీ దొరకలేదు. అతను ఇంట్లోకి రాగానే, పద్మ, "అబ్బాయి!" అంది. "ఏమిటి?" అన్నట్లు ఆమె ముఖంలోకి చూశాడు భాస్కర్రావు. ముసలమ్మ ఒకమూల అతను తెచ్చిన బియ్యం వుడకేసేపనిలో నిమగ్నమై వుంది. భద్రయ్యగారు మంచం మీద పడివుండిపరధ్యానంగా వింటున్నట్టున్నాడు.

పద్మ, విరక్తిగానూ, విసురుగానూ, "నేను లంకపల్లి వెళ్తా"నన్నది.

"ఏమిటీ!" అన్నాడు భాస్కర్రావు ఆశ్చర్యంగా.

"ఎందుకట్లా ఆశ్చర్యపడతావు? నేను లంకపల్లిలో మా అమ్మగారింటికి వెళ్తానూ అంటున్నాను." అంది పద్మ ఒక్కొక్క మాట నొక్కి నొక్కి పలుకుతూ.

"నాన్నకి ఇంత సుస్తీగావుంటే..." వాక్యం పూర్తిచెయ్యక

ముందే పద్మ అడ్డం వచ్చింది. "ఏం వుంటే? నన్ను ఇట్లా పస్తులుండి చావమన్నవారేం? పొద్దుణ్ణించి ఇంతవరకూ, పచ్చి మంచినీళ్లు తాగలేదు. ఆకలికి ప్రాణం శోష కొస్తోంది. నువ్వేమో దేశం మీద బలాదూర్ తిరిగి పన్నెండింటికి కొంపకొస్తుంటివి. ఈ ముసలమ్మ ఊరికే శోకాలు పెట్టి చంపుతోంది. ఆయనేమో, ఏవో నానా మాటలూ మాట్లాడుతున్నాడాయె. నేను బతకలేను ఈ కొంపలో. వెళ్తా." అంది పద్మ తారస్థాయిలో. ఆమెలో లోగడ వుండిన మృదుత్వం, జాలి, దయ, భాస్కర్రావుపట్ల ప్రేమ, నిరాశవల్లా, అపజయంవల్లా, అకస్మాత్తుగా దాపురించిన దరిద్రంవల్ల హరించిపోయి, వాటిస్థానంలో కోపం, పగ తీర్చుకోవాలనే ప్రబలమైన వాంఛ రగుల్కొని మండుతున్నాయి.

"పిన్నీ! -" బతిమాలే స్వరంలో అన్నాడు భాస్కర్రావు. "మెల్లిగా మాట్లాడు పిన్నీ - నీకు పుణ్యం వుంటుంది. నలుగురూ విని నవ్వుతారు!"

"ఓ యబ్బో! మరేం ఫర్వాలేదులే నిజం మాట్లాడితే అట్లాగే వుంటుంది. నా నోరుమూస్తే సరా? ఊళ్ళోవాళ్ళ నోరు మూయ్యగలవా ఏం? నే పోతానయ్యా! మీ సొమ్మేం తీసుకుపోవటంలేదులే. వొచ్చేప్పుడూ కట్టుచీరతోనూ ముక్కుపుడకతోనూ వచ్చాను; పొయ్యేప్పుడు అదేవిధంగా పోతున్నాను చూడు." ఆమె కున్న చివరి ఆయుధం ఏడ్పు. గొల్లున ఏడవసాగింది.

భాస్కర్రావు నెత్తిన పిడుగు పడినట్టయింది. ఏమిటిది ఈమె ఇట్లా మారిపోయింది! రామరామ! ఈమెని ఈ పరిస్థితిలో పుట్టింటికి పంపిస్తే అందరూ ఏమనుకుంటారు? తిండి పెట్టలేక వెళ్ళగొట్టారు అనరా? నాలికకు నరముందా! ఎట్లాగైనా ఈమెని ఆపాలి! అనుకున్నాడతను గబుక్కున వెళ్ళి పిన్ని రెండుచేతులూ పట్టుకున్నాడు. అతని కళ్ళల్లో నీటిచుక్కలు మెరుస్తున్నాయి.

"పిన్నీ! నువ్వు నాకన్న చిన్నదానివి. అయినా, నీకు నమస్కారం చేస్తున్నాను. నన్ను నాన్ననీ క్షమించు. నీకు తీరని అపచారం చేశాం; దానికి పరిహారం లేదు. కాని, పిన్నీ! నాన్నని ఈ పరిస్థితిలో వొదిలేసి వెళ్ళటం భావ్యం కాదు! నేను మానేసి ఐనా నీకు అన్నం పెడతాను ఏదో పనిచేసి సంపాయించి నిన్ను పోషిస్తాను పిన్నీ! అది ఎంత కష్టమైన పనైనాసరే. దానికోసమే తిరుగుతున్నాను పదిరోజుల్నించి! పస్తులున్నావు! నువ్వేనా పిన్నీ! అత్తయ్యని చూడు! నాన్నని చూడు! నాన్న పుట్టిందిలగాయతు ఈ ఏభైఏళ్ళల్లో ఏనాడూ ఒక్కపూటకూడా కాఫీ మానేసి ఎరగడు. ఈరోజున అన్నం లేక అట్లా పడివున్నాడు; కాస్త దయదల్చు పిన్నీ! సౌఖ్యమైనంతవరకు నీకు ఏ లోటూ లేకండా చేస్తాను." అన్నాడు ఉద్రేకంతో.

పద్మ అతని చేతుల మృదుత్వాన్ని, అతని స్పర్శసుఖాన్ని అనుభవించే స్థిమితం కోల్పోయిందిప్పుడు. ఒకప్పుడు ఆమె అతనికోసం తపించిపోయిన మాట నిజమే. ఆమెలోని ప్రతి అణువూ అతని సాంగత్యం కోసం అల్లాడిపోయిన మాట వాస్తవమే. కాని ఇప్పుడామెకు ఆకలితో కళ్ళుతిరిగిపోతున్నాయి ఆమెలోని హరించుకుపోతున్న ప్రతి రక్తబిందువూ, 'ఆకలి'— 'తిండి'—అని అరుస్తున్నాయి. ఆ యువతి భాస్కర్రావు చేతుల్ని విదిలించుకుని, "నేను పోతానో దేవుడో అంటే—పోనియ్యవు ఇదేం ఖర్మం అంటా! నేను ఈ పస్తులు సహించలేను బాబూ" అంటూ నేలమీద పడి ఏడవసాగింది. యథార్థంగా ఆమె కానిమిషాన ఆకలితో ప్రాణం కడపట్టివుంది.

భాస్కర్రావు అత్తయ్యవంక తిరిగి, "తొందరగా అన్నం పెట్టు అత్తయ్యా పిన్నికి ఆకలిమీద కోపం మరీ ఎక్కువవుతోంది" అన్నాడు. ఓ గంటకల్లా అందరూ అన్నం తిని లేచారు. అక్కణ్ణించి ప్రతిపూట పద్మ ఇదే ధోరణిలో పోట్లాడుతూనే వుంది. ఆమె వూహాలన్నీ ఇప్పుడు మంచి తిండిమీద, తినుబండారాలమీదా వుంది. ఎప్పుడూ ఏదో తినాలనిపిస్తుంది చేతిలో కానీలేదు—ఏంచేస్తుంది? ఆ మంటనంతా, మొగుడిమీద, ఆడబిడ్డమీద, భాస్కర్రావుమీద చూపిస్తోంది. ప్రతితడవా, నేను పుట్టింటికి పోతానంటుంది. కాని ఆమెకీ లోలోపల తెలుసు. పుట్టింట్లో ఏమీలేదని; నాలుగురోజులు అక్కడ మర్యాదగానే వుంటుంది; ఐదోరోజు ఇదే దరిద్రదేవత అక్కడా ప్రత్యక్షం ఔతుంది. అయితే బెట్టుగా వుండాలనో, లేక పుట్టింటి మర్యాద పోతుందనో, అహర్నిశలూ తన వూరుగురించి పొగుడుతోంది; భాస్కర్రావు ఆమెమాటల్ని లక్ష్యపెట్టటం మానేశాడు. అదొక రకం చాదస్తం అనుకున్నాడు. అతనిప్పటికి పదిహేను రోజుల్నించి, తెలిసిన వాళ్ళదగ్గిర బదులు తెచ్చి కాపరం నెట్టుకొస్తున్నాడు. ఒక బట్టలకొట్లో గుమాస్తాపని ఇస్తామన్నారు. జీతం నలభైరూపాయలు. ప్రస్తుతానికి అంతే చాలనుకున్నాడు. తండ్రికి చెప్పాడు ఆ శుభవార్త. మేనత్త సంతోషించింది. తండ్రి 'ఏదో గంజినీళ్లు' అని కొంచెం ఆనందం ప్రకటించాడు పద్మ వుద్యోగం సంగతివిని, "ఎవరి ముక్కున పెడతావు ఈ సంపాదన? ఓ పూటకూటికా—ఈ కొంప అద్దెకా? చాల్లే—" అంది—మూతి విరుచుకుంటూ.

భాస్కర్రావు మనస్సు చివుక్కుమంది. భద్రయ్యగారు, "దాంతో ఏమిటి లేరా అబ్బాయి!" అన్నారు, ఉభయుల్నీ సర్దుతూ.

"మహా చెప్పొచ్చారులే! ఇంటర్ మీడియేటు పాసై, చాకలిపని చేసినట్టు కొడుకు నలభై తెస్తాట్ట......" అంటోంది ఆమె కచ్చగా తండ్రి అడ్డంవచ్చి "ఛీ మాట్లాడకు! సుఖాల్లో తప్ప కష్టాల్లో మనుషుల్ని అర్థం చేసుకోలేవా?" అన్నాడు కోపంగా. పద్మ వాదనమానేసి మూతి ముడుచుకుని ఒకమూల కూర్చుంది. భాస్కర్రావుకి ఉద్యోగం దొరికిన సంబరం హారతి కర్పూరంలాగా హరించిపోయింది.

మరునాడు ఉదయం కొట్లో కెళ్ళాడు పరగడుపుతో. కొట్లోకి వచ్చే రకరకాలవాళ్ళు—వాళ్ళ అభిరుచులూ, అతనికి వింతగా వుంటున్నాయి. బిల్లులకి లెక్కలు రాస్తున్నాడు ఆ లెక్కలు అతనికి కాలేజీల్లో చెప్పనవి కావు. కొట్లో పెద్దగుమాస్తా మంచివాడు; ఆయన ఆ లెక్కలు ఎట్లా రాయాల్సిందీ చెప్తున్నాడు. పది గంటలకి ఆయన కాఫీకి పోతూ, "రావయ్యా, కాఫీ తాగివద్దాం. ఊసూరుమని కూర్చుంటే పని సాగదు; పొరపాట్లుగూడా పడతాయి" అని భాస్కర్రావు రానంటున్నా లాక్కెళ్ళాడు ఆయనకి ఏభైఏళ్ళకు పైన వుంటాయి. బట్టతల. ఉదయమే స్నానంచేసి, విభూతి నుదుట దిద్ది, నవ్వుతూ చక్కగా వుంటాడు. ఎర్రని శరీరచ్ఛాయ. ఆయన స్వస్థలం ఏలూరు. బెజవాడవచ్చి పాతికేళ్ళయింది అప్పణ్ణించీ ఆ కొట్లోనే వుంటున్నాడు.

భాస్కర్రావు మొదట కొట్లోకి వచ్చి అడగగానే, ఆయనే 'కుర్రాడు మంచివాడుగా కనపడుతున్నాడు, ఏదో చదువుకున్నాడు, ఫరవాలేదు,' అని షావుకారుకి సిఫార్సుచేసి ఆ వుద్యోగం ఇప్పించాడు; అనుభవం గలవాడేమో, భాస్కర్రావు మొహంలో ప్రతిఫలిస్తున్న ఆకలికళ గుర్తించి కాఫీకి కూడా రమ్మన్నాడు. ఇద్దరూ హోటల్లో కాఫీ తాగుతూండగా భాస్కర్రావు వ్యవహారమంతా అడిగి తెలుసుకుని విచారం ప్రకటించాడు. "నీకేం ఫరవాలేదు నాయనా, మాట సాయం నాది వుంది. దిగులుపడకు; కష్టాలు పడితే గాని సుఖాలు తెలియవు నేనూ నీకు మల్లేనే చేరేప్పుడు పదిహేను రూపాయలకు చేరాను. పాతికేళ్లకుగాను ఇప్పుడు వంద ఇస్తున్నారు." అన్నాడు నిష్కల్మషంగా; ఆయనలోని మానవత్వం భాస్కర్రావును కదలించింది. ఈ కొమ్మ పట్టుకునే పైకి పోవాలనుకున్నాడు

(ఇంకా వుంది)

చేబ్రోలులో చదరంగం

"మనవూరికి ట్రెయినింగ్ యిస్కూలు వస్తోంది. మొన్ననే కొలతలు కూడా తీసుకు వెళ్ళారు..." దీంతో మా చేబ్రోలులో చదరంగం ప్రారంభమయింది. గుంటూరుకు హైకోర్టు వస్తున్నదన్న వార్త రాగానే గుంటూరులో గాలి మేడలూ - విజయవాడలో వ్యూహసౌధాలూ - వాటిమాట ఏమోగాని మా చేబ్రోలులో చదరంగం ఆరంభమైన మాట మాత్రం నిజం. ఎవరినోటవిన్నా, ట్రెయినింగ్ యిస్కూలు మాటే...

హెడ్ కానిస్టేబుగారు వస్తుంటే సీటు ఖాళీచేసే కానిస్టేబయ్యలాగా గుంటూరుకి హైకోర్టు వస్తోందంటే ఆ వూరునుంచి తప్పుకొనే ఆఫీసులు వగైరాలలో ట్రెయినింగ్ స్కూలు ఒకటి. అది గుంటూరుకి ఎనిమిదిమైళ్ళలోపు వున్న మా చేబ్రోలుకి వస్తోంది. ఇప్పటికే మావూరి హైస్కూలులో కనీసం ఐదువందల మందిదాకా విద్యార్థులు వున్నారు. ఇక అది గూడా వస్తే - యింకేం...అసలే చిన్నదైన మా వూరులో ఎక్కడ చూచినా విద్యార్థులే అవుపిస్తారు.

ట్రైనింగ్ స్కూలు గూడా మనవూళ్లోనే వుంటున్నది కొబట్టి ట్రైనింగ్ చదివి మేష్టరీ చెయ్యొచ్చునని అనుకొంటున్నారప్పుడే - మూడో ఫారమ్లో స్కూలు ఫైనల్ ప్యాసైన విద్యార్థుల్లో కొందరు.

గుంటూరుకి హైకోర్టు వస్తున్నదనగానే అక్కడనుంచి సిటీ బస్సులుఏర్పాటు చేసుకున్నారు. బస్సుచార్జి ఇదివరకే 0-5-3 అయితే, యిపుడు 0 4.0 తో మావూరు చేరచ్చు. ఇక మాకేమిటి?...ఇదివరకటి రోజుల్లో బస్సుస్టాండుకి పోయి పాన్నారు బస్సుదగ్గర బిక్కుతూ బిక్కుతూ నిలబడితే 'ఏవూరయ్యా' అని కసిరేవాడు కండక్టరయ్య. భయపడుతూ భయపడుతూ 'చేబ్రోలు' అనేసరికి "అబ్బబ్బ! చచ్చిపోతున్నాం యీ చేబ్రోలు మనుషులతో - ఎంతమందిని ఎక్కించుకోమంటావ్?...కారునిండా మీరేనా?..." అని కరవొచ్చేవాడు. ఆరోజులు యిప్పుడు పోయాయి. ఈరోజు వారు రమ్మన్నా ఆ బస్సుల్లో ఎక్కేవారే లేరు. "ఎంత సిత్రమాయెరా ప్రెపంచమూ!..."

"చేబ్రోలుకి సిటీబస్ వచ్చినతర్వాత మనరాబడి తగ్గిపోతోందిభాయ్..."అంటూ అప్పుడే ఓ కండక్టరు వేడి నిట్టూర్పులు వదులుతున్నాడు. రెండుమూడు సిటీ బస్సులకు ఆర్డరు వచ్చిందనీ - బహుశా అవి జూన్ ఒకటినుంచె ప్రారంభం కావచ్చుననీ అప్పుడే వార్తమీద వార్తలు వస్తున్నయ్.

మా చేబ్రోలుకి కలెక్టరుగారి తమ్ముడి కళ వచ్చిందనుకోండి. ఏం? మా చేబ్రోలుకి ఏంలోటుంది? పదునుచేసిన పొగాకుపాయలాటివూరు మావూరు. అన్ని వసతులూ వున్నాయ్. నీటిఎద్దడి లేదు. విద్యుచ్ఛక్తి వుంది - ఓ సినిమాహాలు కూడా వుంది. మొత్తంమీద కావలసినన్ని హంగులూ వున్నాయ్...

అసలు ఇంకోవిషయం మర్చిపోయాను - "యీ హడావుడిలో పడి. ఈ చల్లని శుభముహూర్తాన మా పూర్వుల్ని తలచుకోకుండా వుండలేను.

'ఆయన' ఆనాడు అడ్డం చెప్పకుండా వున్నట్లయితే...యిప్పుడు మావూరికి ఏం కళ వచ్చేది! గుంటూరు, చేబ్రోలూ - రెండూ కలసి జనం కిటకిట లాడుతుండేవారు. అట్లాంటిది చెడగొట్టారు మా పూర్వుల్లో కొందరు.

ఏంలేదు. అప్పట్లో మావూరికి రైలు వేస్తామని అన్నారు ప్రభుత్వంవారు. "గొడ్లు గోడా చనిపోతాయి ... చేలన్నీ పాడైపోతాయి." అనే సాకుతో అది రాకుండా చేశారు వూళ్లో పెద్దలు. లేకపోతేనా...!!!

అయితేమటుకేంలే. ఇదివరకే గుంటూరుకి బస్సు ప్రయాణం 25 నిముషాలు. యిప్పుడు పావుగంటకంటె ఎక్కువ అక్కర్లేదు...ఆ గుంటూరులో అందరికీ వసతులు ఎక్కడదొరకొచ్చాయి,కనుక కనీసం ప్లీడర్లు అయినా మనవూర్లో వుండకపోతారా? అనుకుంటున్నారు యిల్లు అద్దెకియ్యాలనుకున్న పెద్దమనుషులు.

హైకోర్టు మదరాసులో వున్నప్పుడే... అన్ని జిల్లాలలోకి మా గుంటూరుజిల్లానుంచే ఎక్కువ కేసులే వెళ్లేవట. అందులోనూ మా చేబ్రోలులోనుంచి వెళ్లే కేసుల సంఖ్య చాలా ఎక్కువ. ఇకముందు ఆ వుద్దేశ్య మున్నవాడు, తెనాలి సబ్ కోర్టునుంచి తిరిగి రాకుండా సరాసరి గుంటూరువెళ్లి, అక్కడ హైకోర్టులోకూడా దావా అప్పీలుచేసిగాని యిక యీవూరు చేరుకోడు. అవును మరి - దగ్గరలోనేగా హైకోర్టు! - మహా ఖర్చు అయితే బస్సుకి పాలుగు అణాలు!

ఐదు పదైనా, పది ఐదైనా, ఏది ఏదయినా, చేబ్రోలు ట్రాఫిక్ యిదివరకే ఎక్కువ ఇక ఇప్పుడు మరీ పెరిగిపోయింది. ఎక్కడ, ఏ కూడలిలో చూచినా, హైకోర్టు, ట్రైనింగ్ యిస్కూలు ముచ్చట్లే...

గుంటూరు జరిగి జరిగి వచ్చి చేబ్రోలుతో కలిస్తే, మదరాసు అంత మహానగరం అవుతుందని గుండె బాదుకొనేవారు కొందరు. "అలా ఎందుకు కావాలి...? మన చేబ్రోలే పెద్దదై గుంటూరులో కలిసిపోగూడదా?" అని పౌరుషం పోయేవారు మరి కొందరు.

—మన్నవ రామారావు

పట్టుదల

వా. స. మూర్తి

తనను ధిక్కరించడమే! ఇంతవరకూ తాను అధికారం చలాయించడమే కాని ఎన్నడైనా ధిక్కారమంటూ ఎరుగునా!

సహించలేకపోయారు పాండురంగారావుగారు. ఆయన రిటైర్డు పోలీసు సూపరింటెండెంటు. ఆయన ఉద్యోగం చేసినంత కాలం ఆయన పేరు చెపుతే ఆయన క్రింది వారూ, ప్రజలూకూడా గడగడలాడిపోయేవారు. ఆయనన్న మాటకు చిత్తం అనడమే తప్ప కాదనడానికి ఎవరికీ దమ్ములుండేవి కావు. ఆఖరికి ఆయన ఎదుట సందేహం వెలిబుచ్చడానికి కూడా అవకాశముండేది కాదు. అటువంటిది ఈనాడు తన కొడుకే తనను ధిక్కరిస్తే ఎలా సహించగలడు? ఇంట్లోనుంచి వెంటనే పొమ్మన్నాడు. కొడుకూ తక్కువవాడు కాడు. పోతానన్నాడు. పోయాడు.

కొడుకలా వెళ్లిపోవడం చూసి ఆయన కొంతసేపు నిశ్చేష్టులైపోయారు. ఎంత నిర్లక్ష్యం! ఎంత తృణీకారం! మరొకడైఉంటే ఏమి చేసిఉండేవారో! కాని ఆ పరిస్థితిలో చేయగలిగింది ఏమీ లేక, వ్యర్థకోపాన్ని అణచుకోలేక పళ్లు పటపట కొరుకుకున్నారు. ఒక మూల అయ్యో కొడుకే అన్న బాధ రగులసాగింది. కాని తానంటే ఏమీ లెక్కలేనట్లు అంతధీమాగా వెళ్లిపోయినందుకు కోపంతో ఏమైనా సరే మళ్ళీ అతనే వచ్చి బ్రతిమాలుకునేవరకూ అతని మొగం చూడకూడదన్న విపరీతమైన పట్టుదలా ఆయనలో పెరిగింది.

కోదండరావు అలా చేస్తాడని ఆయన ఎన్నడూ కలలోనైనా ఊహించలేదు. ఆయనకు కోదండరావు ఒక్కడే కొడుకు. అదైనా తమకు అసలు సంతానం కలుగుతుందా కలగదా అన్న వ్యధతో పీడింపబడగా, బడగా చివరికి నడి వయస్సులో పుట్టినవాడు. కొడుకు పదోఏటే భార్య చనిపోయింది. అయినా ఆయన మళ్లీ పెళ్లి చేసుకోలేదు. కొడుకు సంరక్షణభారం తనే పూర్తిగా వహించారు. కొడుకు నెంతో ప్రేమతో, శ్రద్ధతో పెంచారు. అతను అప్పటికప్పుడు కొండమీది కోతిని తెమ్మన్నా తెప్పించి యిచ్చేవారు. అతను కాలు క్రింద పెట్ట నక్కరలేకుండా సౌకర్యాలను ఏర్పాటుచేశారు. తనతోబాటు కాంపులకుతీసుకుపోయేవారు.. ఆయనకు వేట అంటే మహా సరదా. కొడుకుకు చిన్నతనంలోనే తుపాకిపట్టడం నేర్పి తనతోబాటు వేటకుకూడాతీసుకువెళ్లేవారు. కోదండరావుకుకూడా తండ్రిఅంటే ఎంతో ప్రేమా, గౌరవమూను. అతనుకూడా తండ్రిలాగే పొడగరి, రూపసి, బలిష్టకాయుడు. చురుకైనవాడుకూడా. చదువులో చకచకా పైకి వచ్చివేస్తున్నాడు. ఆ ఊరికాలేజీలో ఆఏడే బి.ఏ ఫస్టుక్లాసులో పాసయ్యాడు. పాండురంగారావుగారు కొడుకు తెలివి తేటలకు పొంగిపోతూ ఇంకా పెద్దచదువులు చదివించి ఏదో పెద్ద గవర్నమెంటు ఉద్యోగంలో ప్రవేశపెట్టడానికి ఉబలాటపడసాగారు. ఆయనా పెద్ద గవర్నమెంటు ఉద్యోగంచేసినవాడేకదా. పెద్దపెద్దవారితో మంచి పరిచయంఉంది. ఇక ఆయన అనుకున్నది నెరవేరడంలో ఆటంకమేముంది!

పాండురంగారావుగారి కొక ప్రాణస్నేహితుడున్నాడు. ఆయనపేరు రామమూర్తిగారు. ఆయనకుకూడా వేట అంటే మహా సరదా. చదరంగంకూడా బాగా ఆడుతాడు. ఆయనకు ఒక్కతేకూతురు ఉంది. పేరు సుజాత. ఆమె అందమైనదీ, తెలివైనదీ. ఆఏడే ఇంటర్‌మీడియేట్‌కూడా పాసయింది. టెన్నిస్ ఆడుతుంది. సైకిలు తొక్కుతుంది. నాట్యం చేస్తుంది - ఒకటేమిటి! ఆమె చలాకీతనం చూసి పాండురంగారావుగారెంతో ముచ్చటపడేవారు ఇద్దరూ ప్రాణస్నేహితులు కాబట్టి, ఇద్దరూ సమాన హోదాలోవారే కాబట్టీ, ఇటు పిల్లకీ పిల్లవాడికీ అన్నివిధాలా ఈడూ జోడూ కుదురుతుంది కాబట్టీ తమలో తాము వియ్యం పొందితే బాగుంటుందనుకున్నాడు. చాలా కాలంనుంచే వారీవిధంగా అనుకుంటూ వచ్చారు. చివరికి నిశ్చయానికి వచ్చారు - ఆఏడే వివాహం చేసివేయడానికి. ఈ నిర్ణయంసందర్భంలో తమ పిల్లలను సంప్రతించవలసినఅవసరమే వారికి కనిపించలేదు. తమ స్నేహాన్ని ఈవిధంగా దృఢతరం చేసుకుంటున్నందుకు ఆనందం పట్టలేక ఒకరినొకరు కౌగలించుకున్నారు. పెళ్ళికి ఏర్పాట్లు చేయసాగారు.

2

పెళ్లిమాట ఖాయం చేసుకున్న తరువాత పాండురంగా రావుగారు ఎంతో సంతోషంతో ఈవార్త కొడుకుకు చెప్పారు. కాని కొడుకు మొగంలో ఉత్సాహమేమీ కానరాలేదు. అతను మౌనంగా ఊరుకున్నాడు. తన ఆనందంలో పాండురంగారావుగారిది కనిపెట్టలేదు. కాని ఎంతసేపటికీ కొడుకు మారుమాటాడకపోయేసరికి తన వాక్ప్రవాహం ఆపి కొడుకు మొగంలోకి చూశారు. ఆశ్చర్యంతో స్తంభించిపోయారు. "ఏం, అలా ఉన్నావేం" అని అడిగారు తేరుకున్నాక.

"ఏంలేదు. నేనీ పెళ్లి చేసుకోనన్నాడు కోదండరావు.

మళ్లీ కొంచెంసేపు నిశ్చేష్టులైపోయారు పాండురంగారావుగారు.

"ఏమిటీ! అసలే పెళ్ళిచేసుకోవా ?"

"చేసుకుంటాను కాని ఈ సంబంధం కాదు."

పాండురంగా రావుగారికి అర్థంకావడం లేదు. అప్పుడే కోపం పొంగుకు వస్తోంది.

"ఎందుకు చేసుకోవు?"

కోదండరావు మాట్లాడలేదు.

"నీకు మతేమన్నా పోయిందా! ఇంత కన్న మంచి సంబంధం ప్రపంచమంతా వెతెట్టి వెతికినా దొరకుతుందా? అంత చక్కనిదీ, అంత తెలివైనదీ, అంత చలాకీ అయినదీ మరొకతె ఉంటుందా. పైగా నా ప్రాణస్నేహితుడి కూతురు సుజాతను చేసుకోవూ!"

"సుజాత చాలా అందమైనదే, తెలివైనదే. కానిఆమెను నేను పెళ్లిచేసుకోలేను."

పాండురంగారావుగారు కోపం ఆపుకోలేకపోతున్నారు. అయినా అతికష్టంమీద అణచుకొంటూనే అడిగారు." మరెవరినీ చేసుకుంటావు?"

"......................."

"నీ మనస్సు మరి ఎవరిమీదైనా ఉందా?"

"ఊఁ____"

"ఎవరు?"

"నా క్లాస్‌మేట్ రామారావు చెల్లెలు విమల."



స్నానఘట్టం
ఫోటో: కె. నాగలింగేశ్వరరావు (చాటపర్రు)

★ పట్టుదల ★

"ఆఁ!!—నీవెవరి కొడుకువో మరచిపోయావా? కాలేజీ జీతానికికూడా ఇతరుల మీద ఆధారపడవలసివచ్చే అటువంటి వాళ్ళతోనా మనకు సంబంధం?—నీ వామెను చేసుకోవడానికి వీలులేదు."

కోదండరావు మౌనంగాఉండిపోయాడు.

"ఏం, మాట్లాడవేం. నీవా సంబంధం చేసుకోడానికి ఎంతమాత్రమూ వీలులేదు. నీవు చేసుకుంటే సుజాతనే చేసుకోవాలి. ఏమంటావు?"

"చేసు-కో-ను" అన్నాడు కోదండరావు మెల్లగా.

అగ్నిపర్వతం బ్రద్దలైంది. "చేసుకోకపోతే వెంటనే ఇంట్లోనుంచి పో" అని రంకెపెట్టారు పాండురంగా రావుగారు.

"అయితే వెళ్ళిపోతా"నన్నాడు కోదండరావు. అలాగే వెళ్ళిపోయాడు.

అంతే, అప్పటినుంచీ తండ్రీ కొడుకూ ఒకరి మొగాలొకరు చూసుకోలేదు.


3

కొడుకు చర్యనుగురించి ఆలోచించిన కొలదీ పాండురంగారావుగారికి అసహ్యం ఎక్కువ కాసాగింది. పోతే పోయాడనుకున్నారు. తండ్రిమాట వినని కొడుకుంటే నేం పోతే నేం! ఆయనస్నేహితుడు రామమూర్తి గారు తన కూతురికి వేరొక సంబంధం నిశ్చయం చేశారు. పాండురంగారావు గారు పెళ్ళికి వెళ్ళారు. ఆ పెళ్ళిలో సుజాత తనకు కోడలు కాకపోయిందే అన్న బాధ కలిగింది ఆయనకు. అయినా ఆమెనే కొడుకూ కూతురుగా ఎంచుకొని ఆమెకన్నో బహుమతులిచ్చారు. స్నేహితుడింట్లోనే ఆరుమాసాలున్నారు. అక్కడనుంచి తన ఊరుకు రావడానికి ఆయన ఇష్టపడలేదు. కొడుకుకు తన లెక్క లేకపోతే తనకూ కొడుకు లెక్క లేదన్నట్లు దేశాటనంమీద బయలుదేరారు. అక్కడకొన్నాళ్ళూ, ఇక్కడకొన్నాళ్ళూ ఉంటూ, దేశం అంతటా తిరిగి, తిరిగి చివరికి ఆయన ఆరోగ్యం అంతగా బాగుండకపోయేసరికి నాలుగేళ్లకు తిరిగి తనఊరు చేరాడు.

తిరిగి వచ్చినతరువాత కూడా ఎన్నడూ ఎవరిదగ్గరా కొడుకు మాట ఎత్తలేదు. కొడుకునుగురించి విచారించడానికే ప్రయత్నించలేదు స్నేహితులందరినీ ఇంటికిపిలిచి పేకాటతో చదరంగంతో, మిగిలిన సమయంలో పుస్తకాలతో సరదాగానే కాలక్షేపం చేయసాగారు.

4

కోదండరావు విమలనే పెళ్లి చేసుకున్నాడు. ఇక పైకి చదవడానికి అవకాశం లేకపోగా వెంటనే కూడు గుడ్డలకోసం తాపత్రయపడవలసి వచ్చింది. ఉద్యోగం కోసం ప్రయత్నం చేశాడు. ఊళ్లోవారెవరూ తండ్రికి కొడుకుకీ వచ్చిన పేచీ తెలుసుకొని, అతనికి ఉద్యోగమీయడానికి సాహసించలేకపోయారు. ఆఊళ్ళో లాభం లేదని మద్రాసువెళ్ళి ప్రయత్నం చేశాడు. తండ్రిపేరు ఉపయోగించుకుంటే అతనికి వెంటనే ఎక్కడో అక్కడ పని లభించేది. కాని అతనికి ఆవిధంగా చేయడం తల తీసినట్లుగా కనిపించడంవల్ల అతనికృషి విఫలమై తిరిగి తనఊరేవచ్చి ఎలాగోఅలాగ తంటాలు



ఇన్యా లేక్ రంగూన్

ఫొటో: బి. రంగయ్య (రంగూన్)

పడి నాలుగైదు ప్రైవేట్లు సంపాదించి వాటితోటే కాలక్షేపం చేయవలసి వచ్చింది.

కాని ఆ ప్రైవేట్లవల్ల వచ్చేదానిమీద జీవితం గడపడం చాలాకష్టమైంది అప్పులు పెరగసాగాయి. ఇరుకు అద్దె కొంపలో ఉండవలసి వచ్చింది. ఆ పరిస్థితులలో, దారిద్ర్యప్రభావంవల్ల కోదండరావుకు విసుగూ, చిరాకూ ఎక్కువై ఎవరికోసం తానింత త్యాగం చేశాడో ఆమెమీదే కస్సుబుస్సుమంటున్నాడు. విమలకూడా అంతే చిరాకుతో జవాబిచ్చేది అప్పుడు వాళ్ళ వ్యవహారంచూస్తే వాళ్లు ప్రేమించి పెళ్ళిచేసుకున్నారని ఎవరూ నమ్మలేరు. వాళ్ళకొకకొడుకుకూడా కలిగాడు. వాడిప్పుడే నాలుగేళ్లవాడయ్యాడు. విమల మామగారు మొదట్లో ఒప్పుకోకపోయినా, తరువాత కొన్నాళ్ళకైనా మనసు మార్చుకొని తమను చేరదీస్తారేమోనని ఆశించింది. కాని ఆమె ఆశ నిరాశ అయింది మామగారు నాలుగేళ్ళ వరకూ ఆ ఊరు తిరిగే రాలేదు. వచ్చిన తరువాతకూడా తమమాటే స్మరించకుండా స్వేచ్ఛగా కాలక్షేపం చేస్తున్నారు. ఇటుపోనీ భర్తేనా తండ్రిదగ్గరకుపోయి ఆయనను బ్రతిమాలి మనస్సు మార్చుకునేటట్లు చేస్తాడేమోనంటే అతను ఎన్నడూ తండ్రిమాట స్మరించడం లేదు. ఇతరులనీ స్మరించనీయడం లేదు. ఇక తనుకీ బ్రతుకే తప్పదని నిశ్చయం చేసుకుంది. ఆమె తననే నిందించుకుంది. తనవల్లనే తండ్రీ కొడుకులమధ్య ఈవిరోధం వచ్చింది. తనవల్లే కోదండరావు ఇంతటి కష్టాలు పడవలసివస్తోంది తన అడ్డు లేకపోయినట్లయితే అతడీపాటికి ఏ కలెక్టరు కూతురునో పెళ్లాడి, ఏ పెద్ద చదువో చదివి, ఏదో పెద్ద గవర్నమెంటు ఉద్యోగంలో ఉండేవాడు. తనకోసం అతనెంత త్యాగం చేశాడు! ఆమె హృదయంలో భర్తమీద విపరీతమైన ప్రేమ పొంగుకువచ్చేది. అతని పట్ల తానోర్పుతో వ్యవహరించక అతని చిరాకుకు తగ్గ చిరాకుతోనే వ్యవహరిస్తున్నందుకు మిక్కిలి బాధపడేది. తన పరిస్థితులే తన్నిట్లా వివశంచేస్తున్నాయి. ఇంటి పరిస్థితులు అంతకంతకు చెడిపోతున్నాయి. కోదండరావు సంపాదన ఏనెలకానెల పాత అప్పులు తీర్చడంతోనే సరిపోతోంది. ఎప్పటికప్పుడు కొత్తబాకీలు పెరిగిపోతున్నాయి. ఇరుగుపొరుగులు చేబదుళ్ళు ఈయడంకూడా మానివేశారు. అన్నిటికీ కటకట పడసాగారు. కోదండరావు ఆరోగ్యంకూడా చెడిపోయింది. అతను దగ్గుతున్నాడు. ఆ దగ్గుచూసి విమల హడలిపోసాగింది. ఆఖరికి ఆమె తెగించింది.

5

ఒకరోజు మామగారికొక చీటీరాసి తన నాలుగేళ్ళ కుర్రవాడిని తీసుకొని బయలుదేరి, మామగారి యిల్లు కనపడేవరకూ వెళ్లి, అక్కడనుంచి కొడుకుకా ఇల్లుచూపి, అక్కడకు వెళ్ళి లోపల ముసలాయనకా చీటి ఇచ్చిరమ్మని కుర్రవాడిని పంపింది.

కుర్రవాడు చీటీ తీసుకొని వెళ్ళాడు. లోపల నౌకర్లకు తెలుసు ఆ కుర్రవాడు ఫలానా అని. అందువల్ల వాడక్కడకు రావడంచూసి ఆశ్చర్యంతో అలాగే నిల్చొనిపోయారు. వాడు వచ్చీరాని మాటలతో "పాండులంగాలావుగా లున్నాలా" అని అడిగాడు. "ఉన్నారు బాబూ, ఏం పనుంది బాబూ" అని అడిగారు నౌకర్లు. కుర్రవాడు మాటలాడకుండా లోపలికి నడచివెళ్ళాడు. పాండురంగారావు పడక కుర్చీలో కూర్చొని పేపరు చదువుకుంటున్నారు. పేపరు అడ్డుగా ఉండడంవల్ల వాడి రాక గమనించలేదు. ఎంతసేపటికీ ఆయన పేపరు చదవడం పూర్తికాకపోయేసరికి కుర్రవాడు ఆయన పక్కకు వచ్చి

నిలబడ్డాడు. ఆయన ఉలిక్కిపడి వాడికేసి చూశారు. వాడు మౌనంగా ఆ చీటీ ఆయన కందిచ్చాడు. ఆయన ఆశ్చర్యంతో చీటీ తీసుకొని చదివారు. కుర్రవాడికేసి చూశారు. "నీ కేదేనన్న మాట ఆ విమల కొడుకు!" అనుకున్నారు. ఇంత గ్రంథానికీ ఆమే కదా కారణం. అటువంటిది ఈ విధంగా రాస్తుందా? ఎంత సాహసం! ఎంత నిర్లజ్జ! ఈవిధంగా తనను మెల్లగా మంచి చేసికోవడానికిదొక ఎత్తు! ఆయనకు మళ్లా ద్వేషం పొంగుకు వచ్చింది. చీటీ నలిపి పడవేసి ఒక నౌకరుతో "ఈ కుర్రవాడితో వెళ్లిపొమ్మని చెప్పు"మన్నారు. నౌకరు చెప్పేలోగానే కుర్రవాడు పరిస్థితి గ్రహించాడు కాబోలు ఏమీ మాట్లాడకుండా తల వంచుకొని మెల్లగా అడుగులు వేసుకుంటూ వెళ్లిపోయాడు.

వాడు వెళ్లిన రెండు నిమిషాలకి ఆయన హఠాత్తుగా లేచి వరండాలోకి వెళ్లి వీథిలో పోతున్న ఆ పిల్లవాడికేసి చూశారు. ఆ నాలుగేళ్ళ బుడతడు అలాగే మెల్లగా అడుగులు వేసుకుంటూ, బస్లూ అవీ జాగ్రత్తగా తప్పించుకుంటూ పోతున్నాడు. ఉన్నట్టుండి ఆయన ఒక నౌకరిని వెళ్లి ఆ కుర్రవాడిని వెనక్కి పిలుచుకురమ్మన్నారు. తనను ధిక్కరించినందుకు ఎటువంటి గతి పట్టిందో కొడుకుకి ఇప్పుడు బాగా తెలియ వస్తుంది. అతను ఎలాగైనా తనను క్షమాపణ కోరుకోవలసిన పరిస్థితి వస్తుంది. తన దగ్గరకు రావడానికి మొగం చెల్లక కొడుకే ఈవిధంగా చేసిఉంటాడనుకున్నాడాయన. ఆయన కిప్పుడదొక విధమైన తృప్తి కలిగింది. నౌకరు ఆ కుర్రవాడిని తీసుకు వచ్చాడు. పాండురంగారావుగారు పాతిక రూపాయలు కుర్రవాడి చేతిలో పెట్టి జాగ్రత్తకోసం నౌకరును కూడా వెళ్లిరమ్మన్నారు. ఒక క్షణం ఆ బుడతడి మొగంలోకి చూశారు. ఆ రూపాయలు చూసే సరికి వాడి చిన్ని మొగంలో సంతోషం తొణికిసలాడింది. మరొక క్షణం చూశారు. వాడచ్చు తన పోలికే. ఆయన హృదయంలో ఏదో మ్రోగింది. ఆయనకు మరి కొంతసేపు వాడి మొగం చూడాలనీ, వాడిని పలకరించాలనీ అనిపించింది కాని వాడు నౌకరుతోబాటు వెళ్ళిపోయాడు.

6

ఇప్పుడు ఆయన ఆలోచనలన్నీ తన కొడుకుమీదా, ఆ బుడతడు 'తన మనుమడి' మీదా పోసాగాయి. ఇన్నాళ్ళూ తన కొడుకు తన దగ్గరనుంచి వెళ్ళిపోయిన తరువాత ఎలా గడుపుకొంటున్నాడో ఆలోచించలేదు. కాని ఇప్పుడు అతను జీవితం ఎలా గడుపుతున్నాడో, ఏ ఇబ్బందులు పడుతున్నాడో అన్న ఆలోచనలు కలిగాయి ఆయనకు. తన దగ్గరకు కబురంపించ వలసివచ్చిందంటే వాళ్లు నిజంగా డబ్బుకోసం ఎంత కటకటపడుతున్నారో! వేళకు సరిగా తిండి తింటున్నారో లేదో! కట్టుకుందుకు గుడ్డలు ఉన్నాయో లేవో? కొడుకు ఆరోగ్యం బాగా ఉందో లేదో? ఈ ఆలోచనలు కలిగేసరికి ఆయన హృదయం ఎన్నడూ లేని ఆదుర్దాతో దడదడ కొట్టుకోసాగింది. ఆ బుడతడి మొగం జ్ఞప్తికి వచ్చినప్పుడల్లా ఆయన గుండె పొంగిపడుతోంది. ఆయన ఈ ఆలోచనలు తప్పించుకోవడానికి ప్రయత్నించారు కాని ఆయన హృదయమే ఆయనకు లొంగక పోతే ఏం చేయగలరు? పోనీ కొడుకును గురించి ఎవరిద్వారానైనా కనుక్కుందామంటే - తను లొంగిపోయినట్లు కనబడదమే!

ఆయనకు సాయంత్రం వేళ ఊళ్లో ఒకటి, రెండు మైళ్లు షికారు చేయడం అలవాటు. ఇప్పుడు నగరంలో అన్ని వీధులకు షికారు సాగించడం మొదలుపెట్టాడాయన. ఒక రోజున కొన్ని వీథులైతే, ఇంకొక రోజున మరికొన్ని వీధులు షికారు వెళ్లివస్తున్నాడు. చివరికి ఒకరోజున కొడుకు ఇల్లు కనుక్కోగలిగారు. అదే అయిఉంటుంది. ఎందుకంటే అప్పుడే ఆ చిన్న కుర్రవాడు వీథిలోకివచ్చి అక్కడ పిల్లలతో ఆడడం మొదలుపెట్టాడు. వాడివెనకే ఎవరో వీథిలోకి వచ్చి వాడికేసే చూస్తోంది. "ఆమే నన్నమాట!" ఆమె తనను చూస్తుందేమో నన్న కంగారుతో దూరంనుంచే త్వరగా ఇంకొక వీథిలోకి తప్పుకున్నారు.

మర్నాటినుంచి ఆయన అటే వస్తున్నారు కాని ఆ యింటిదగ్గరకు రాకుండా పక్క వీథిలోనుంచి ఆ యిల్లు కనబడేటట్లుగా చూస్తూ వెళ్తున్నారు. ఆ యిల్లు జాగ్రత్తగా చూశారు. బాగా నేలబారు ఇల్లు. కప్పుమీద పెంకులైనా సరిగా లేవు. గోడలకు సున్నం లేదు. వీథిలో మురికికాలువలు. ఆ యిళ్లలో ఎటువంటివారు ఉంటారో ఊహించడం సులభమే. అటువంటివారిలో తన కొడుకొకడా! ఆయన హృదయం ఆరాటంతో గిజగిజలాడుతూ అటువైపుకు లాగసాగింది కాని ప్రతిష్ఠ ఆయనను వెనుకకు నొక్కిపట్టిఉంచింది.

"బాగా ఏడుపు వచ్చేదాకా నవ్వేవా నువ్వు, ఎప్పుడైనా?"

"ఆ!"

"ఎప్పుడూ?"

"ఈవేళ పొద్దున్నే."

"ఏంజరిగిందేం?"

"ఏమీ లేదు. మా నాన్నగారు పడక కుర్చీలో పడుకోబోతే, పట్టా వూడిపోయి, ఆయన దభేలున కింద పడిపోయారు. అదిచూసి నేను పక్కున నవ్వేశాను. నేను నవ్వటంచూసి మా నాన్నగారు లేచివచ్చి రెండు వేశారు. దాంతో ఏడ్చేశాను."

మళ్లీ కొన్నాళ్లకు ఆ కుర్రవాడు ఇంటికి వచ్చాడు, ఈసారి పాండురంగారావుగారు వాడిని దగ్గరకు పిలిచి తల నిమురుతూ పేరడిగారు. వాడు 'రాంబాబు' అని చెప్పాడు. పేరు ముద్దుగానే ఉంది కాని అది తన పేరు కానందుకు ఆయన మనస్సు చివుక్కుమంది. వాడిని రోజూ ఏం చేస్తావని అడిగారు. వాడు తానేం చేసేది, వాళ్ల అమ్మ, నాన్నా ఏంచేసేదీ అంతా వచ్చీ రాని మాటలతో, ఆమాటలైనా సరిగా పలకలేక నగరుస్తూ, కళ్లు పెద్దవిచేస్తూ, కాలివేళ్ల మీదలేస్తూ, తల తిప్పుతూ చెప్పుకుపోయాడు. ఆ మాటలు వింటూంటే వాడిని కౌగలించుకోకుండా ఉండలేకపోయారాయన. వాడికోసం బిస్కట్లూ, చాక్లెట్లూ తెప్పించి, తినిపించి, రోజూ వస్తూఉండమని చెప్పి, డబ్బిచ్చి నౌకరును వెంటబెట్టి పంపారు.

రాంబాబు అలాగే రోజూవచ్చి తాతగారిదగ్గర చాలాసేపు ఆడుకొని పోతున్నాడు. ఇప్పుడు తాతగారిదగ్గర వాడికి బాగా చనువైంది. 'తాతా' అనే పిలుస్తున్నాడు. ఎన్నో అర్థంలేని ప్రశ్నలు వేస్తున్నాడు. ఏదో గొడవ చెపుతున్నాడు. ఇల్లంతా స్వేచ్ఛగా తిరుగుతున్నాడు. నౌకర్లమీద అధికారం చలాయిస్తున్నాడు. నౌకర్లు చేతులు కట్టుకుని వాడేమి చేయమంటే అది చేస్తున్నారు. గుర్రాలుగా వంగుమంటే వంగుంటున్నారు. రాంబాబు ద్వారా పాండురంగారావుగారు అప్పు

డప్పుడు డబ్బు పంపిస్తూనే ఉన్నారు. ఆ డబ్బుతో విమల చిన్న చిన్న అప్పులు తీరుస్తూ జాగ్రత్తగా సర్దుకుంటోంది. కాని కన్నకొడుకు తాతగారి ఇంటికి పోవడం కాని, భార్య మామగారి దగ్గరనుంచి డబ్బు తెప్పించుకోవడం కాని కోదండరావు ఎరగడు. ఆఖరికి అతనికీ తెలిసిపోయింది.

7

ఒక రోజున రాంబాబు తాతగారి ఇంటి దగ్గరనుంచి తెచ్చుకున్న బొమ్మతో ఆడుకుంటూ ఉండగా కోదండరావు చూశాడు. "ఇది ఎక్కడిది?" అని అడిగాడు ఆశ్చర్యంతో. దాపరికం అంటూ ఎరగని ఆ బుడతడు "తాతయ్య ఇచ్చాడు" అని చెప్పాడు. "ఏ తాతయ్య?" అన్నాడు కోదండరావు మరీ ఆశ్చర్యపోతూ. రాంబాబు అంతా చెప్పివేశాడు. కోదండరావు ఒక క్షణం స్తబ్ధుడైపోయాడు. వెంటనే కోపం ముంచుకువచ్చింది. "వెధవా అక్కడికి నిన్నెవరు వెళ్ళమన్నారు" అంటూ వాడి వీపుమీద గట్టిగా నాలుగు వాయించాడు. "అమ్మ పంపించింది" అంటూ కుఱ్ఱవాడు ఏడుపు మొదలుపెట్టాడు. కోదండరావు వెంటనే భార్యను కేకవేసి "నీవేనా ఈపని చేసింది" అని అడిగాడు. "ఏపని" అంది ఆమె. "వీడిని అక్కడికి పంపించింది నీవేనా?" అవునంది ఆమె (ఆమె డబ్బు తెప్పించుకున్న సంగతి ఇంకా అతనికి తెలియలేదు.) అతను వెంటనే మండిపడుతూ, "నీకేమైనా అభిమానం ఉందా. ఎందుకోసం నేనీ కష్టాలుపడేది. నీలా అభిమానం చంపుకుంటే ఈ కష్టాలు పడవలసి వచ్చునా. నీకభిమానం లేకపోతే నాకుంది ఇకనుంచి వీడిని అక్కడికి పంపావంటే నామీదఒట్టే" అన్నాడు. రాంబాబు చెవి పట్టుకొని గుంజుతూ "ఒరే వెధవా నువ్వు మళ్ళీ అటు కాలు పెట్టావా చెవులుపట్టుకొని గిరగిర తిప్పి అవతల గిరవాటేస్తాను" అన్నాడు. ఆ కోపం చూసి భార్య కూడా ఏమీ మాట్లాడలేకపోయింది. రాంబాబు కూడా అప్పటినుంచి తాతగారింటికి పోవడం మానివేశాడు.

8

పాండురంగారావుగారు సాయంత్రం మనుమడికోసం ఎదురుచూశారు, వాడు రాలేదు. మర్నాడూ రాలేదు. నాలుగు రోజులైనా రాలేదు. ఒకవేళ కుఱ్ఱవాడికి ఏ జ్వరమైనా వచ్చిందేమో! ఆయన హృదయం ఆదుర్దాతో కొట్టుకోసాగింది. మనస్సు పరిపరివిధాల పోసాగింది. ఆదుర్దా ఆపుకోలేకపోయారు. నౌకరును పంపించి తాను పంపించినట్లు కాకుండా వాళ్ళింట్లో ఎలా ఉన్నది కనుక్కోని రమ్మన్నారు. వాడు వెళ్ళివచ్చాడు. ఇంట్లో అంతా కులాసాగానే వున్నారనీ, కుఱ్ఱవాడు చక్కగా ఆడుకుంటున్నాడనీ చెప్పాడు. ఈ వార్తకు ఆయనకు అంతులేని ఆశ్చర్యం కలిగింది. 'మరి రాంబాబు రావడం ఎందుకు మానివేశాడు? ఒక్కొక్క కారణమే ఊహించసాగారు. కాని ఏదీ సరియైనదిగా తోచలేదు. చివరకు తోచింది కొడుకు రానీయకుండా చేసిఉంటాడని. అదే అయి ఉంటుంది. సందేహం లేదు. ఆయనకు మళ్ళీ రోషం పుట్టుకువచ్చింది. కొడుకు

★ పట్టుదల ★

కేనా అంత పట్టుదల, తనకు మాత్రం లేదా? కాని ఇప్పుడాయనకు ఆ బుడతడిని చూడకుండా ఉండడమనేది దుర్భరమైపోయింది. జీవిత సంధ్యలో ఉన్న ఆయన హృదయం ఇంకొకరి ప్రేమకోసం పరితపించసాగింది. జీతపురాళ్ళకోసం నౌకర్లు చాకిరీ చేస్తారు కాని తాను మూలిగినా, చచ్చినా కన్నీరు విడచేవా రెవరూ ఉండరనిపించింది. ఇంతవరకూ ఎన్నడూ ఆయన కిటువంటి ఆలోచనలు కలుగలేదు. ఇప్పుడు తా నేకాకియై పోయినట్లు బాధపడసాగారు. అర్థం లేని భయా లెన్నో ఆయన హృదయాన్ని ఆవరించివేశాయి.

ఆయన ఆరోగ్యం పూర్తిగా చెడిపోయింది. నౌకర్లు చాకిరీ చేస్తూనే ఉన్నారు. డాక్టర్లు వచ్చి చికిత్స చేస్తూనే ఉన్నారు. నర్సులు ఉపచారం చేస్తూనే ఉన్నారు. అయినా ఆయన హృదయబాధ ఉపశమించడం లేదు నా అనే వారొకరూ దగ్గర లేరే అన్న బెంగతో ఆయన పరిస్థితి ఉన్నదానికంటె కూడా అధ్వాన్నంగా ఉంది. క్రమక్రమంగా క్షీణించిపోతున్నారు. డాక్టర్లు కూడా ఆశ వదులుకున్నారు. ఆయన నిశ్చయించుకున్నారు తన తుది ఘడియలు సమీపించాయని. ఒక్కసారిగా ఆయన కళ్ళనుండి కన్నీటిధార పొంగి పారింది. పోలీసు సూపరింటెండెంట్ పదవి నిర్వహించినవాడు, ప్రజలను హడలెత్తించినవాడు, ఆయన ఆ పెద్ద వయస్సులో చిన్నపిల్లవాడిలా వెక్కి వెక్కి ఏడ్వసాగారు. తన భార్యా, తల్లీ, తండ్రీ జ్ఞాపకం వచ్చారు. వారి చావులు జ్ఞాపకంవచ్చాయి. తన కొడుకు పుట్టడం, వాడిని తాను పెంచడం, వాడు చిన్నతనంలో ఏమేమి చేసిందీ •అన్నీ వరుసగా జ్ఞాపకం రాసాగాయి. అవి తలచుకొన్నకొలదీ ఆయన ఏడ్పుకు కట్టు లేకపోయింది. యజమాని ఏడుపు చూసి నౌకర్లు కేమీతోచక, నివెర్వపోయి నిలబడిపోయారు. ఆ దుఃఖపుపొంగు కొంతసేపటికి కొద్దిగ తగ్గిన తరువాత ఆయన ఇక ఆగలేక ఒక నౌకరును పిలచి కొడుకు ఇంటికి వెళ్ళి కోడలితో తన పరిస్థితి ఏమీ బాగుండలేదని చెప్పి రమ్మన్నాడు.

వాడు రెక్కలు కట్టుకున్నట్టు వెళ్ళి కోదండరావుభార్యతో చెప్పాడు. ఈ వార్త వినగానే ఆమె కంగారుగా పిల్లవాడిని తీసుకొని బయలుదేరింది. అప్పుడే కోదండరావు తిరిగివచ్చాడు. “ఎక్కడికి?” అన్నాడు. ఆమె చెప్పలేదు. “అక్కడికేనా?” అన్నాడు తీక్ష్ణంగా. “అవును, అక్కడికే ఆయనకు చాలా జబ్బుగా ఉందట” అంది ఆమె. “వెళ్ళడానికి వీల్లేదు” అన్నాడు కోదండరావు మొండిగా. “మీ తండ్రిగారి మాట మీరు విన్నారు గనుకనా నేను మీ మాట వినడానికి” అని ఆమె చరచరా వెళ్ళిపోయింది.

ఆమెను చూసేసరికి పాండురంగారావుగారి ఏడ్పు మళ్ళీ పెల్లుబికింది ఆ దృశ్యం చూడగా ఆమె గుండె కరిగిపోయి ఆయన పక్కదగ్గరకు చేరి మెల్లగా ఆయన కాళ్ళు రాయసాగింది కుర్రవాడు తాతగారిదగ్గరకు చేరాడు. వాడికేమీఅర్థం కావడం లేదు. తాతగారిఏడుపు చూసి వాడూ ఏడవసాగాడు. ఆయన వాడిని తన దుర్బలమైన చేతితో మెల్లగా దగ్గరకు లాగుకొని, గుండెలకదుముకొని, ముద్దుపెట్టుకొంటూ, కన్నీటితో వాడి తల తడిపివేశారు. కొడుకు రాలేదేనన్న లోటు కనిపించినా తనవాళ్ళేవారున్నారు కదా అనే సంతృప్తి కలిగింది ఆయనకు. హృదయంమీది బరువు తొలగినట్లైంది. శరీరం తేలిపోతున్నట్లుగా అనిపించింది. వెంటనే ఆయనప్లీడరును పిలచి తాను రాయించిన వీలునామా చదవమన్నారు. ప్లీడరు చదివాడు. ఆయన ఆస్తిఅంతా మనుమడి పేర రాయబడింది. ఈ ఆస్తికంతా ట్రస్టీగా విములనే పేర్కొన్నా రాయన. — ఎవరివల్లనైతే తండ్రీ కొడుకులు విడిపోయారో ఆమెనే. ఆయన వీలునామామీద సంతకం చేశారు. డాక్టరుచేతా, ప్లీడరుచేతా ఆమెచేతా సాక్షిసంతకాలు చేయించారు. వీలునామా కుర్రవాడిచేతిలో పెట్టారు. తేలిపడ్డ గుండెతో మనుమడి తల నిమురుతూ పడుకున్నారు.

9

భార్య వెళ్ళినతరువాత కోదండరావు మనస్సులో మథనపడసాగాడు. అతని కంతకు ముందే తెలిసింది తండ్రి ఆరోగ్యం చెడిపోయిందని. అయినా మొదట్లో ఉపేక్షా భావంతో ఈ విషయంగురించి ఆలోచించలేదు. కాని భార్య అలా వెళ్ళడం చూసిన తరువాత అతని ఆలోచనలన్నీ తండ్రిమీదకే పోయాయి. తండ్రి పరిస్థితి ఎలా ఉందో? తండ్రి తనను చిన్నప్పటినుంచీ ఎలా పెంచిందీ, తల్లిలేని లోటు కనిపించకుండా ఎంత ప్రేమతో తనను చూసిందీ అంతా స్మరణకు వచ్చింది. అటువంటి తండ్రి బాధపడుతూంటే తను లెక్కచేయకుండా ఊరుకోవడమా! తండ్రి ఒకసారి ఏదో తొందరపాటుగా వ్యవహరించినందుకు తానీవిధంగా ప్రతిక్రియ చేయాలా? తండ్రి నిజంగా అవసానదశకు వచ్చాడేమో! తండ్రిని తాను మరి చూడలేడేమో! అతను ఒక్క పరుగున తండ్రి యింటికి వచ్చాడు.

గుమ్మంలో అడుగు పెట్టాడు రక్తాన్ని కరుడుగట్టించే ఏడుపులు ఒక్కసారిగా లేచాయి అతను ఒక్క ఉరుకులో ప్రాణంలేని తండ్రి శరీరంమీద పడి ఇన్నేళ్ళ ఎడబాటుకు ప్రాయశ్చిత్తంగా గుండెలు పగిలిపోయేటట్లు ఏడవసాగాడు. ★

అధికారం

వేసవికాలం. మేనెల. మా వూరిలో వుదయం తొమ్మిదైందగ్గిర్నుంచీ పెనం మీదవేచినట్టు యెండ వేడియెక్కుతుంది. నాకు యేమీ పనిలేదు. పెద్దలుంచిన ఆస్థి అనుభవించడం, రోజులో చాలాభాగం మా వూరి క్లబ్బులో నాలాటివాళ్ళతో ఇండోరు, అవుటుడోరు, గేమ్సుతో కాలం వెళ్ళబుచ్చడం నాపని. వొకరోజు వుదయం స్నానం, కాఫీ, వగైరాలన్నీ ముగించి క్లబ్బుకిబయల్దేరుతూవుంటే టపావొచ్చింది. అందులో వొకవరు చింపి చూసేను. నా స్నేహితుడు వొక పోలీసు అసిస్టెంటు సూపరింటెండెంటు, సముద్రపొడ్డున వున్న వొక బంగళాలో వారంరోజు లుంటాననీ నన్నురమ్మనీ రాసేడు. సరేననుకుని ప్రయాణానికి సిద్ధమయేను. వొచిన్న సూటుకేసూ, బెడ్డింగూ రెడీ చేసేరు.

అతడున్న స్థలానికివెళ్లాలంటే మావూరిలో వుదయం తొమ్మిదిగంటలకి బస్సెక్కాలి. అది యిరవైమైళ్ళదూరంలో వున్న రంగపురానికి సుమారు పదకొండున్నరకి వెళ్తుంది. అక్కణ్ణించి యేటివంతెన దాటి సుమారు మైలుదూరం వెళ్ళి అక్కడ మరోబస్సెక్కాలి. అది మధ్యాహ్నం రెండుగంటలకి బయలుదేరి నేను వెళ్ళవలసిన వూరికి వొంగంటన్నరలో వెళ్తుంది. బస్సుదగ్గిరకి సబిన్‌స్పెక్టర్ని పంపిస్తానని నా స్నేహితుడు రాసేడు. రంగపురంలో మధ్యాహ్నం టైముంటుంది. భోజనం చెయ్యవచ్చును. నేను బస్సుస్టాండుకి వెళ్లేను. కండక్టరు తెలిసినవాడు. ఫ్రంటుసీటులో కూర్చోబెట్టి నా సామాన్లు వెనకసీటులో సర్దించేడు. అప్పటికి తొమ్మిదిన్నరైంది. బస్సు బయల్దేరేసరికి వొక డవాలీబంట్రోతు వొచ్చి 'తాసీల్దారుగారు బయల్దేరుతున్నారు. ఇంటికి బస్సు తెమ్మన్నార'న్నాడు. అలాగే సందులన్నీ దాటి బస్సువాళ్లింటిముందు ఆపేరు. అప్పటికి యెండ యెక్కువవుతున్నాది. కండక్టరు వెళ్ళి ప్యూనుతో చెప్పేడు. 'అయ్యగారు స్నానానికెళ్లేరు. అర్ధగంటతరవాత భోంచేసి, బయల్దేరుతారు' అని ప్యూను చెప్పి, క్లీనర్ని తీసుకుని వెళ్ళి, క్యాంపు సామాన్లన్నీ బయట పెట్టించి, గుమాస్తాగార్ని పిలవడానికెళ్లేడు. డ్రైవరు 'చచ్చాన్రా దేవుడా! యీబస్సు స్టార్టవడానికల్లరపెడుతుంది. ముందుకి తొయ్యడానికి వీల్లేదు. వెనక్కితోస్తే కదుల్తుందో లేదో' అంటున్నాడు. సుమారు పదకొండు గంటలకి గుమాస్తాగారొచ్చి లోపలికెళ్ళి ఆఫీసరుగార్ని నాహ్వానించేరు. తాసీల్దారుగారొచ్చి నా పక్కనే కూచున్నారు. సామాన్లు టాపుమీద వేయించి ట్రూపంతా బస్సెక్కింతరవాత బయల్దేరమని ఆర్డరిచ్చేరు. ఎన్ని తంటాలుపడ్డా బస్సు స్టార్టు కాదు. బస్సు వెనక్కి తొయ్యగా వో అరగంటకి స్టార్టయింది. ఆఫీసరుగారి కోపంవొచ్చి 'ఎవ్రడా యీ బస్సువోనరూ? ఈలాంటి బోకువెధవ బస్సుపెట్టి, పబ్లికుదగ్గిర డబ్బు

పి. జి. స్వామి

లాగి (తను మహాబస్సు ఫేరిచ్చినవాడిలాగ), యిన్కన్వీనియన్సు చేస్తున్నాడూ' అని గర్జించేరు. 'చిత్తం, చిత్తం! బేటరీ అవుటైపోయింది చార్జి చేయించాలి సార్' అని డ్రైవరు చెప్పేడు. బయల్దేరి బస్సు పన్నెండుమైళ్ళు వెళ్ళింతరవాత ప్యూనొక కేకేసి బస్సు నిలపమన్నాడు. అక్కడ యెదురుగావున్న వొకబండీ తోవలోకి బస్సు తిప్పమన్నాడు. నాకు గుండెజారిపోయింది. తాసీల్దారుగారితో 'అయ్యా! యెండ దంచేస్తున్నాది. పిల్లలూ, ఆడవాళ్లూ వున్నారు ఇప్పటికే చాలాలేటయింది. అదీగాక నేను రెండో బస్సెక్కాలి' అని చెప్పేను. ఆయన 'అదుగో. ఆయెదురుగావున్న వూళ్లో యీవాళ పంచాయితీకోర్టుయలక్షన్లు కండక్టు చెయ్యకతీరదు' అని జవాబిచ్చేరు. ఈలోగా బస్సులోంచి కాంగ్రెసు డ్రెస్సు ధరించి వున్న వొక ఆసామీ 'బస్సు తిన్నగా రంగపురం నడిపిస్తారా, లేదా? పబ్లికు బస్సులు స్వంత బళ్ళలాగ వుపయోగించడం యింకా కట్టలేదు. యీ సంగతీమాటు మినిస్టరు చెవిని వెయ్యాలి' అని హుంకరించేడు. దాంతో యేమాలోచించేరో ఆఫీసరుగారు 'తన సామానులన్నీ దింపించి, వూళ్ళోకి వెళ్ళి వొక బండీ తెమ్మని ప్యూనుని పంపించి, తానూ, క్లార్కూ దిగిపోయేరు. మా బస్సు రంగపురం చేరేసరికి సుమారు వొంటిగంటన్నరైంది. హోటేళ్లలో భోజనం లేదన్నారు. దాహం ఎక్కువగా వుంటే రెండు కొబ్బరికాయల నీళ్లుతాగితే ప్రాణం కొంచం బచాయించింది. కూలీ నెత్తిమీద సామాను పెట్టి బ్రిడ్జీ దాటి రెండో బస్సుకి మండుతున్న యెండలో ఆతృతగా నడిచి వెళ్లేను రోడ్డుమీద బస్సువుంది బతుకు జీవుడా అనుకుని కూలివాడికి డబులిచ్చి పంపేసేను.

ఆ బస్సులో యెలకల్లాగ మాడిపోతున్న ప్యాసెంజర్లు తప్ప, కనుచూపు దూరంలో, బస్సుకి సంబంధించిన వాళ్లు గాని, మరి యే యితరమానవులు గాని కనుపించలేదు. రోడ్డుకి యిటూ, అటూ యేటియిసక దిబ్బలు కాలి వేడి గాడ్పులొస్తున్నాయి. నేను ముందు సీటు దగ్గిర కెళ్ళి చూస్తే వొక కాకీసంచీ

★ అధికారం ★

వుంది. దాన్ని డ్రైవరు సీటువేపు పెట్టి వొడ్డుకి కూచున్నాను. ఆకలి దహించేస్తున్నాది. అసలే నా దేహచ్ఛాయ నలుపు. నేను, పంచకట్టుకుని, కాలరులేని చొక్కా తొడుక్కుని, వో తువాలు బుజంమీద వేసుకున్నాను. అదివరకు బస్సు ప్రయాణం ధూళీ బట్టలనీ, వొంటినీ ఆశ్రయించుకుని వుంది. నడకవల్ల పట్టిన చెమట, గాడ్పువల్ల ఆరిపోయి, ధూళి అంటుకుని చారికల్లాగ వుంది. మొత్తానికి డర్టీగా వున్నాను. యెంత డర్టీగా వున్నా వొక హాఫ్ పేంటూ, బుష్ షర్టూ, హేటూ ధరిస్తే ఆ దర్జా వేరూ.


యెంత వేగం గమ్యస్థానం చేరి, స్నానంచేసి శుభ్రమైన బట్టలు వేసుకుంటానా అని వున్నాను. రెండున్నర గంటలైంది. యెవరూ రాలేదు. సుమారు మూడుగంటలకి క్లీనరు వొచ్చేడు. అతణ్ణడిగితే, నా వేపు తీవ్రంగా చూసి, అతి నిర్లక్ష్యంగా 'కండక్టరూ, డ్రైవరూ టీ తాగొస్తారు' అన్నాడు. తనో బీడీ ముట్టించి, డ్రైవరు సీటులో కూచుని, 'బస్సు పుటేంగోర బాబూ, బస్సు పుటేంది బస్సుపుటే, బల్లవాల్లక్కడుపు పెటేంది,' అని, యింకా యేవో హిందీ, తెలుగూ మేళాయించి సినీమా పాటలూ పాడుకుంటూ చిదానందంలో మునిగివున్నాడు. మూడున్నరకి కండక్టరూ, డ్రైవరూ వొచ్చి బీడీలు కాలుస్తూ బస్సు నీడని నిల్చున్నారు. 'ఏమండీ! యీ బస్సు యెన్ని గంటలకి బయల్దేరాలండీ' అని నే నడిగేను. 'నీ కెందుకయ్యా ఆ వివరాలూ? మా యిష్టం వొచ్చినప్పుడు బయల్దేరుతుంది' అని కండక్టరు జవాబిచ్చేడు. డ్రైవరు 'వొరే సిరపా! యింజను తుడిచేవా? ఆయిలూ, పెట్రోలూ వేసేవా' అని అడిగితే 'అన్నీ రైటు' అన్నాడు క్లీనరు. కొంతసేపు బీడీ కాల్చి, అది పారవేసి డ్రైవరు తన గద్దెయెక్కి విష్ణుచక్రంలాగ స్టీరింగు పట్టుకుని హేండిలు కొట్టమని క్లీనరుకి ఆర్డరిచ్చేడు. క్లీనరు హేండిలు పట్టుకుని బస్సుముందుకెళ్ళి 'యెయ్యొ కండక్టరూ! కనిస్టీపిగోరు రాలేదు.' అన్నాడు. డ్రైవరు 'టీ తాగొత్తానన్నాడు. కొట్రా. బస్సు టాటు సేద్దామూ' అన్నాడు. క్లీనరు హేండిలు తిప్పి, తిప్పి, ప్రాణం విసికి 'డ్రైవేరూ! బెల్లుటాటుకొట్టూ. కారిబెట్టు సూసినావా?' అనడిగేడు. డ్రైవరు అవీ యివీ నొక్కి మళ్ళా కొట్టమన్నాడు. అలా చేస్తే బస్సుకి చలనం పుట్టింది. క్లీనరు హేండిలు నా కాళ్ళమీదనించి లోపలికి విసిరి, వూరువేపు చూసి, 'కనీస్టీపిగో రొత్తున్నారని' కేకేసేడు. మరైదునిమిషాలకి వొకాయన కాకీ నిక్కరూ, తెల్లషర్టూ తొడుక్కుని, పోలీసుసప్లై ఆకు చెప్పులు వేసుకుని, సిగరెట్టు కాలుస్తూ ఫ్రంటుసీటు దగ్గిరకొచ్చి నా వేపు వోమాటు యెగాదిగా చూసేడు. బస్సు ఫుట్టుబోర్డుమీద కాలు పెట్టి ఆ కాకీమూటవేపు చూపెడుతూ 'ఆ మూట యిక్కణ్ణించి అక్కడికెలాగ వెళ్ళింది?' అన్నాడు. నేను మాటాడలేదు. మళ్ళా అతి శివిగా 'యెలాగ వెళ్ళిందీ అంటా' అన్నాడు. అప్పుడు నేను 'దానంతటది వెళ్ళలేదూ. నేను యిక్కణ్ణించితీసి అక్కడ పెట్టేను' అన్నాను. అతడు అతిగంభీరంగా 'అది గౌరమెంటు పోపర్టీ అని తెలీదూ?' అనడిగేడు. 'దానిమీదలాటి వ్రాత యేమీ లేదు. యేమైనా నేను దాన్ని యేమిచెయ్యలేదు. కొంచం అటువేపుజరిపి యిక్కడ కూచున్నాను' అని చెప్పేను. 'హక్కులేంది దాన్ని ముట్టుకోడం వోనేరం. పీనలుకోడుప్రకారం ప్రాసిక్యూషను చెయ్యొచ్చు' అని అతడన్నాడు. నాకు ప్రాణం విసుకెత్తి 'అయిందేదో అయిందీ. మీ మూటకేమీ డామేజీ కలగలేదయ్యా. మీరు దయచేసి బస్సెక్కండీ యిప్పటికే చాలా లేటయిం

దన్నాను. అతడికి మరీ కోపం వొచ్చి 'లేటవుతే అవుతుంది. అదంతా నీకెందుకూ? గౌరమెంటుడూటీ, అందులోనూ పోలీసు డూటీ అంటే బస్సు కాదు, రెయిలయినా ఆగితీరాలి' అని గర్జించేడు. బస్సులోంచి వొక ఆసామీ 'కనిస్టీపుగోరూ! తెలీక మాలోట్లోళ్ళం తప్పులు సేస్తాం. తమలాంటి ఆపీసర్లు సూసె సూన్నట్టూరుకోవాలి. చెమించాలి' అన్నాడు. మరొకడు 'ఆయన మాట మట్టుకుంటే కోపం రాదటయ్యా?' అన్నాడు. కండక్టరుకూడా ఆయన్ని బతిమాలితే ఆ కానిస్టేబిలు నావేపు వొక అధికారపూరితమైన చూపు విసిరి, దర్జాగా వొచ్చి డ్రైవరు పక్కని కూచున్నాడు. తరవాత బస్సులోని జనం యెవరికి తోచినట్టూ వారు యీ యిన్సిడెంటుగురించి అనేకవిధాలుగా చర్చ సాగించి తుదకు నేను యెంత కఠినశిక్షయినా డిజర్వయేటంత తప్పుచేసినట్టూ, కనిస్టీపిగారు మిక్కిలి దయగలవారు కాబట్టి నన్ను క్షమించి విడిచిపెట్టేసినట్టూ మెజారిటీ నిర్ణయించేరు. అతడుకూడా మధ్యమధ్య వొక రిమార్కు ప్యాసుచేస్తూ తన ఆధిక్యతా, పవరూ ప్రకటించేవాడు.

రోడ్డంతా గోతులతో నిండి వుంది. అంచేత బస్సు స్పీడు గంటకి పదిమైళ్ళకంటే యెక్కువలేదు. కుదుపు యెక్కువగావుంది. నాకు వొళ్ళంతా నొప్పిగావుంటే, కళ్ళు మూసుకుని, తల రెండుచేతుల్లోనూ పట్టుకుని కూచున్నాను. నాలుగైదు మైళ్ళు వెళ్ళి వుంటాము. బస్సు మెల్లిగా నడవడం ఆరంభించింది. నేను కళ్ళువిప్పి చూసేసరికి నా పక్కనున్న కానిస్టేబిలు తన మూటవిప్పి టోపీ తీస్తున్నాడు. బస్సు ఆగింది. అతడు యెలాగు గెంతేడో వొక్కదాటుతో రోడ్డుమీద వున్నాడు. ఎటెన్షనులో నిలబడి యెదురుగావొస్తున్న పోలీసుసర్కిలినస్పెక్టరుకి వొక సాల్యూటుచేసేడు. అతడు నిండు డ్రెస్సులో వున్నాడు. కనిస్టీపిగార్ని చూడగానే 'యిడియట్! ఆ డ్రెస్సేమిట్రా. బికారి వెధవలాగ? టోపీమీద నంబరు లేదేమీ? యెక్కడికి వెళ్తున్నావూ?' అని వొక్క కేక వేసేడు. 'చిత్తం. బీటుడూటీమీద ఆడవరాని కెళ్తున్నానుసార్' అని జవాబిచ్చేడు కనిస్టీబు 'నీటిక్కెట్టేది?' '.....' 'బస్సుమీద దయచేస్తున్నారేమిటీ? దొరగారూ. ఎయ్ కండక్టర్ వీడి మూట యివతల విసిరెయ్' అని యినస్పెక్టరుగారన్నారు. కండక్టరు ఆ మూట తీసియిస్తూవుంటే చూసి ఆయన 'అబ్బో! దొరగారికి ఫ్రంటుసీటు కూడానా' అంటూ నన్ను చూసి 'బాబూ మీ రెక్కడికి' అని అడిగేరు నేను చెప్పేను. అప్పుడు కానిస్టేబిల్ని చూసి 'ఓరీ యిడియట్! ఆయన పక్కనే కూచున్నావూ?' అని తిట్టి, అతడి దగ్గర డబ్బు వొసూలు చెయ్యమని కండక్టరుతో యినస్పెక్టరుగారు చెప్పి 'బీటుకి నడిచి వెళ్ళడం మానేసి బస్సెక్కటోయ్ ఆఫీసరుగారికి' అంటూ వొచ్చి నాపక్కని కూచున్నారు. బస్సు నడుస్తూవుండగా వెనకనించి 'యెవరితో మాట్టాడుతున్నాడో సూసోక్కొద్దా? యిట్టం వొచ్చినటూ మాటాడినాడోయ్. మా గొప్పోడినాగ? ఆ మాగా జొల్లకున్నాము.' అనీ 'యేటి తెలుస్తాది' 'తెలకపోతే నాను సెప్తున్నానుగానూ అయిందేదో అయింది వొల్లకో బాబూ అంటే వొగ్గినాడా? యెంత బాబుసేసినాడూ మాగొప్పోలీసర్నాగా' అన్న మాటలు వినిపించేయి. సర్కిలుగారు మధ్య దారిలో దిగిపోయేరు. నేను గమ్యస్థానం చేరేసరికి అయిదుగంటలైంది. సబినస్పెక్టరుగారొచ్చి, నాసామాను దింపించి, బస్సు లేటుగా వొచ్చినందుకు కండక్టరుమీదా, డ్రైవరుమీదా చార్జి పెడతామని బెదిరించితే వాళ్ళు తగినట్టూ బతిమాలుకున్నారు. నేను స్టేషనుకి వెళ్ళి, స్నానంచేసి, శుభ్రమైన దుస్తులు వేసుకుని, టిఫిను ముగించేసరికి, నా ఫ్రెండుకూడా యేదో విలేజీ విజిటు చేసి వొచ్చేడు. ఇద్దరం కలిసి బంగళాకెళ్ళేం.

అక్కడ వుండగా మూడోనాడో, నాలుగోనాడో, సాయంకాలం బంగళా వరండాలో కూచుని, నా స్నేహితుడూ నేనూ టీ తాగుతున్నాం. సర్కిలినస్పెక్టరుగారు దూరంగా వొక కుర్చీమీద కూచున్నారు. సబినస్పెక్టరుగారు దూరంగా యెటెన్షనుగా నిలబడి మావేపు చూస్తున్నారు. ఆ సమయంలో వొక కానిస్టేబిలు యెక్స్‌ప్రెస్ కవరు పట్టుకుని సర్కిలినస్పెక్టరుగారి దగ్గరకి వెళ్ళి సాల్యూటుచేసి కవరిచ్చేడు. దాని అడ్రసుచూసి 'అలా తిరిగి వెళ్ళి దొరగారి చేతికియ్యి' అని ఆయన చెప్పేడు. తిరిగొచ్చి కొంచెం దూరంలో అతడు నావేపు అతి దీనంగానూ, భయంగానూ, చూస్తూ నిలబడిపోయేడు. నేను చూద్దునుగదా అతడు బస్సులోని 'కనిస్టీపి' గారే. నా స్నేహితుడు అతణ్ణిచూసి 'యేమ్రా నువ్వా?' అంటే గడగడ వొణుకుతూ అక్కడే యెటెన్షనై వొక సాల్యూటు చేసి, నన్ను చూస్తూ, మెల్లగా అడుగులు వేసుకుంటూ వొచ్చి ఆ కవరు దొరగారి టేబిలుమీద పెట్టేడు. మరో సాల్యూటుచేసి నావేపే చూస్తూ వెళ్ళేడు. సర్కిలుగారు నావేపు చూసి చిరునవ్వు నవ్వుతున్నారు.

★



గండిపేట గార్డెన్సు - హైదరాబాదు



—ఫొటో: టి. సత్యనారాయణ, పిప్పర.

బొమ్మరిల్లు

ఆటలు

కవిరావు

1

ఆకాశ వీధిలో
ఆడుకొనుటకు నన్ను
మబ్బు బాలికలు 'ర
మ్మ'ని పిలిచినారమ్మ!
ఆకాశ వీధిలో...

ఉదయభానుని స్వర్ణ
రథ కేతనము లెక్కి,
నెలవంక చలువ వె
న్నెల చిగుళ్ళను మెక్కి,
ఆకాశ వీధిలో...

పెర గాలి బయళ్ళ
పరవళ్లు తొక్కుతూ
అస్తమానము వారు.
ఆడుకొనుటేనంట,
ఆకాశ వీధిలో...

భూతలాగ్రము కేగి
చేతు లెత్తితె నేను
చేదుకొని తమలోన
చేర్చుకొంటారంట
ఆకాశ వీధిలో...

'అమ్మ వెదకును రాను
బొమ్మంటి'నంతలో
తేలియాడుతు పైర
గాలిలో పోయారు
ఆకాశ వీధిలో...

మబ్బునయ్యెద చంద
మామ నీవగుమమ్మ
అందాక పోనేల ?
ఆడుకుందా మిచటె
ఆకాశ వీధిలో...

2

జలరాశిపై ఆడు
అలల బాలలు వచ్చి
కిలకిలా నవ్వుతూ
పిలిచి పోయారమ్మ
జలరాశిపై...

ఆటలతో పాటలతో
హాయిగా తీయగా
కడలిపై కాలంబు
గడుపుచుం డెదరంట
జలరాశిపై...

కనుమూసుకొని నేను
గనిమపై నిలచితే
క్షణములో వారు నను
కొని పోదుమన్నారు
జలరాశిపై...

'అమ్మనే విడిరాను
పొ'మ్మనంగా వారు
చిఱునవ్వు లొలికిస్తు
పరుగు తీశారమ్మ!
జలరాశిపై...

అలలనయ్యెద తీర
మగుము నీ ఒడిలోన
దొర్లుతూ 'నే' పొర్లి
పొర్లి నవ్వెదనమ్మ!
జలరాశిపై...

మనజోలి యీ లోక
మున కేలనే అమ్మ ?
హాయిగా మన మిచటె
ఆడుకొందామమ్మ!
జలరాశిపై...

—ఆధారం: రవీంద్రనాథ టాగూర్.

కర్పూర ద్వీప యాత్ర



(బొమ్మరిల్లు సీరియల్)

నోరి నరసింహశాస్త్రి

31

ఆ ఎనిమిది విమానాలూ ఆనందగీతికా తరంగాలలో "ఊగులాడుతూ పైకి పోతున్నవి. వాళ్లకింకా పై నుంచి పాలపుంత తోక విచ్చుకొని అనేక విమానాలు ఎదురువచ్చినై. అందులో కిన్నరులు కింపురుషులు యక్షులు, గరుడులు, నాగులు, విద్యాధరులు, అప్సరసలు, గంధర్వులు మొదలైన చిత్ర చిత్ర దేవతా భేదాల వారు ఎదురువచ్చి స్వాగతము చెప్పుతూ గానముచేశారు. వాళ్ల గొంతులు ఒక్కవిధంగా లేవు. వాళ్ల వాద్యాలుకూడా మన మెరిగినవికావు, రకరకాలవి. వాళ్లంతా ఎవరిదారినవాళ్లు పాడుతున్నా, అన్ని మేళాలూ బాండువాద్యంలో కలసిపోయినట్లుగా, అన్నీ ఒకటిగా కలిసిపోయి శ్రవణపర్వంగా వినవస్తున్నవి.

కింనరు లెట్లా ఉంటారో ఎరుగుదురా? ఒళ్లంతా మనుష్యులల్లేనే ఉంటారు కాని తలలు గుర్రపు తలలు. హయగ్రీవావతారాలు అన్నమాట. ఇహ కింపురుషులు వాళ్ళకు సరిగ్గా తల్లక్రిందులు, ఒళ్లంతా గుర్రాలూ తలలు మనుష్యులవీ. గరుడులు మొత్తంమీద గరుడపక్షులల్లే ఉంటారు. నాగులు రెక్కలున్న నాగుబాము లనుకోండి.

యక్షులు కొందరు చక్కనివాళ్లూ కొందరు వికృతాకారాలవాళ్లూ. విద్యాధరులు గంధర్వులూ బహుచక్కనివాళ్లు. అప్సరసల అందము చెప్పనే అక్కరలేదుగా, మీలో అందమైనపిల్లను అప్సరసల్లే ఉందంటారు గదా!

ఈ నానారకాల దేవతలూ వాళ్లకు స్వాగతాలు చెప్పి ఎనిమిదిమందినీ తీసుకుపోతుంటే వాళ్లు పాల దారిలో వింతలన్నీ చూస్తూ ఆనందిస్తున్నారు. అంతలో దూరాన వాళ్లకు చక్కని తోటఒకటి కనిపించింది. అదేమిటని మయూరరాజు అడిగాడు.

"నందనవనము ! నందనవనము !"

దేవతల మాటలు విని వాళ్ళెనిమిదిమందీ తలలు వంచి నందనవనానికి నమస్కారం చేశారు. ఆ వనం దగ్గరకు వచ్చేప్పటికి లోపలికి పోవడానికి అడ్డంగా ప్రవాహమొకటి కనిపించింది. విమానాలకు కూడా దాటేందుకు వీలులేనివిధంగా ఉన్నదది.

ఎనిమిదిమందికీ ఏమీచేయాలో తోచక ఆలోచిస్తున్నారు. గంధర్వులువచ్చి, "ఇది ఆకాశగంగా ప్రవాహము. నందనవనంలో ప్రవేశించే ముందు ఇందులో స్నానాలు చేయాలె!" అన్నారు.

ఆ మాటలు విని ఎనిమిదిమందీ తుళ్లిపడి చేతులు జోడించుకొంటూ విమానాలలోనుంచి దూకారు. అప్పుడు వాళ్లకు ఆకాశగంగా ప్రవాహము ఇంకా బాగా కనిపించింది. అది ప్రవాహమన్నాము కాని ఏమి ప్రవాహమో చెప్పలేము. మన మెప్పుడూ అట్లాంటి ప్రవాహము కలలోకూడా చూసిఉండము.

★ కర్పూర ద్వీప యాత్ర ★

అది తెల్లగా ఉంటుందని కవులు వర్ణిస్తారు. కాని నవరత్నాల రంగులూ దానిలో కనిపిస్తూ నవరత్నాలే ప్రవాహం కట్టినట్లు ఉంది. పోనీ, కవులు చెప్పేమాట అబద్ధమందామంటే, తెల్లగానూ ఉంది. ఏమి తెలుపు! హంసరెక్కలవలె మానస సరస్సువలె తెల్లదామరవలె హిమాలయంమీద మంచువలె—అంతకంటెకూడా తెలుపు.

అది చల్లగా ఉన్నది. ఎండాకాలంలో చల్లటి గాలివేస్తే హాయిగా చల్లగా ఉండేట్లుఉంది. అయితే చలికాలంలో చలిమంట వేసుకున్నట్లు వెచ్చగానూ ఉన్నది.

ఆ ప్రవాహగమనమో? అదే అన్నిటికంటె చిత్రము. ఇక్కడ ప్రవాహాము ఒకపక్కనుంచి ఇంకో పక్కకే పోతుంది; పైనుంచి కిందికే ప్రవహిస్తుంది. మరి అదో? అటునుంచి ఇటూ, ఇటునుంచి అటూ, పైనుంచి కిందికీ కిందినుంచి పైకీ ఎటుబడితే అటే ఆ ప్రవాహాము ప్రవహిస్తుంది. అందుకనేకాబోలు దానికి 'త్రిపథగా' అని కవులు పేరుపెట్టారు!

మనకిక్కడ తెలుపంటే తెలుపే నలుపంటే నలుపే; చలిఅంటే చలి వేడంటే వేడి; పైనఅంటే పైన కిందంటేకింద. ఒకదానితో ఒకటి కలవదు. దేనికదే భేదంగాఉంటుంది.

అయితే మనము చూస్తున్న ఈ కొత్తలోకంలోనో? అక్కడ ఏ భేదాలూ లేవుసుమా!

32

వాళ్లెనిమిదిమందీ ఆకాశగంగనుచూస్తూ దీనికి మూలమేమూ అని దిక్కులన్నీ పరకాయిస్తున్నారు. చూడగా దూరంగా ఒక అందాల ఆవు పడుకొనిఉంది. దాని పాదాలలోనుంచే ఆ ప్రవాహ మట్లా వస్తున్నది, కాక పొదుగులోనుంచేనో!

ఆ ఆవు అందము ఏమని వర్ణించను? వాళ్లు పుణ్యాత్ములు కాబట్టి వెంటనే కామధేను వని గుర్తించారు. వెంటనే భక్తితో దగ్గరకుపోయి చేతులుజోడించి ప్రదక్షిణాలుచేసి ఆ గోమాత పాదాలముందు—ఒక్కొక్క పాదానికి ఇద్దరిద్దరుచొప్పున—తల లానించి మొక్కినారు. వెంటనే వాళ్ళందరిమీదా ఆకాశగంగా ప్రవాహం జలజల ప్రవహించింది.

అప్పుడు జరిగిన చిత్రం విన్నారా? ఇప్పటిదాకా వాళ్లు ఎనిమిదిమందీ—శ్రీశైలం సంగతి ఇద్దరూ, భద్రాచలం సంగతి ఇద్దరూ, సింహాచలం సంగతి ఇద్దరూ, కైలాసగిరిపాదాలవద్ద మానస సరోవరము సంగతి ఇద్దరూ - ఈవిధంగా తలచుకొంటూ అక్కడ తమతమ క్రీడలసంగతే ఆలోచించుకుంటున్నారు.

ఆకాశగంగలో స్నానం చేయగానే వారి రూపాలే మారిపోయినై. హంసలు లేవు. నెమళ్లు లేవు. చిలకలు లేవు. కోకిలలూ లేవు. ముచ్చట్లు లేవు. మురిపాలు లేవు. స్నేహాలు లేవు. విరోధాలు లేవు—బంధుత్వాలు లేవు. దూరత్వాలు లేవు. వాళ్లకు దివ్యదేహాలు వచ్చినై.

నరకంలో బాధపడేందుకు యాతనాశరీరాలు వచ్చినట్లుగానే, ఇప్పుడు సుఖించేందుకు దివ్యదేహాలు వచ్చినై. శక్తిలేని సుఖమనుభవించాలెనంటే మమకారం వదలాలె వాళ్లకిప్పుడు పూర్వదేహాలు వదలడంతో మమకారాలు వదలినై. మమకారమంటే నా అనేభావం. ఇది నాది అనుకోడం. అదే కల్మషంలేని సుఖానికి ఆటంకం.

ఆ దివ్యదేహాలతో కామధేనువుదగ్గర వాళ్లు సెలవుతీసుకొని నందనవనం ప్రవేశించారు. అక్కడ ఎవరిదారి వారిదే ఇద్దరు ఆగ్నేయంగా పోయినారు. ఇద్దరు వారుణ దిక్కుకు పోయినారు. ఇద్దరు కుబేర దిక్కుగా పోయినారు. ఇద్దరు వాయవ్యంగా బయలుదేరారు.

33

అక్కడ వాళ్లు మిగిలిన దేవతలతో కలిసిపోయి భోగా లనుభవిస్తున్నారు. ఇద్దరిద్దరు ఒక్కొక్క దిక్కుగాపోయినారన్నా కలసి జంటగా వెళ్లారని కాదు. ఎవరికివారే యమునాతీరే!

అట్లా అక్కడ ఎన్నాళ్లు వాళ్లు భోగా లనుభవించారోకూడా చెప్పలేము. వాళ్ల కాలపు కొలతే వేరు. అంతమంది దేవతలలో వాళ్లను గుర్తించడముకూడా సాధ్యంకాదు. మన మరగని కొత్తలోకమది. వాళ్ళ ఆకారాలే వేరు; వేషాలే వేరు. వాళ్లు అనుభవించిన భోగాలు ఏమిటోకూడా ఇప్పు డూహించలేము. మన మాటలతో చెప్పబోతే వాటి స్వభావమే అపార్థమై పోతుంది.

వాళ్ల భాష ఒకటిమాత్రం మనము నేర్చుకోదలచుకుంటే నేర్చుకోవచ్చు. దేవభాష అంటాము ఎరుగుదురుగదా! దానినే సంస్కృతమనికూడా అంటాము. అక్కడ అంతా మాట్లాడేది ఆభాషే. ఆ భాషలో మాట్లాడితేగాని వాళ్లు వినిపించుకోరు. వాళ్లకు వినపడదుకూడాను. వాళ్ల చెవులుకూడా అపూర్వ చిత్రమైన చెవులన్నమాట!—చూడండీ, మనము నీళ్లల్లో ప్రాణవాయువు పీల్చగలమా? చేపలు మనగాలిలో ప్రాణవాయువు పీల్చగలవా? అట్లాగే అనుకోండి!—సంస్కృతమైన శబ్దాలేకాని దేవతల చెవులు వినిపించుకోవన్నమాట ఇంకోభాష వినబడితే వాళ్ల చెవులకు చికాకుగాకూడా ఉండవచ్చు. ఈ లోకానికీ దేవలోకానికీ తాడల్లే సంబంధం కలిపేది ఆభాషేసుమా!

అందుకనే పాణిని మహర్షి ఆభాషకు వ్యాకరణసూత్రాలు చేశాడు. ఆసూత్రాలవల్ల ఈలోకంలో వాళ్ల మెప్పటికీ.దేవభాష మరచిపోకుండానూ తప్పులులేకుండా సుష్ఠుగా వాడుకునేట్లుగానూ చేశాడు. ఆపాణినికి మనమంతా నమస్కారంచేసి సంస్కృతం తప్పక నేర్చుకుందాముగా! తెలుగు బాగా వచ్చిన వాళ్లకు సంస్కృతం రావడము తేలిక.

34

దేవతలందరికీ ఎప్పుడూ పాతికేళ్లవయస్సే! ఎన్నేళ్లు గడిచిపోయినా వాళ్ల వయస్సు మారదుసుమా. పిల్లిగాని ఘోటక బ్రహ్మచారులకూ కన్యలకూ సంబంధాలకు వచ్చినపుడు చెప్పడంలో మారనటుగాకా.

★ కర్పూర ద్వీప యాత్ర ★

నిజంగానే వాళ్లకు మారదు. స్వర్గమంటే మన ఊహలన్నీ తారుమారు చేస్తుంది. వెనక ధర్మరాజంతవాడే అర్థంకాక తడబిడపడ్డాడు.

దేవతలకు చావులేదు. వాళ్లు అమరులు. అయితే శాశ్వతంగా వాళ్లక్కడే ఉంటారనుకున్నారా? ఎబ్బే!

ఎప్పుడన్నా దీపారాధన చేశారూ? పోనీ మీ అమ్మగారు చేసినప్పుడైనా చూసి ఉంటారుగా! కుందిలో చమురైపోతే దీపమేమవుతుంది? కొండెక్కుతుందిగాదూ!

వర్షాకాలంలో గట్లు తటాయించిఉండే మీ చెరువునీళ్లు వేసంగిలో ఏమవుతవి? వట్టి నేలే గదా కనపడేది?

మీ నాన్నగారు బాగా సంపాదించి మీకు డబ్బు కూడబెట్టి పోయారనుకోండి. మీరు చదువు సంధ్యలు లేక ఊరికే ఖర్చుచేస్తూఉంటే, చివరకు లెక్కపుస్తకాల్లో మిగిలేది, సున్నాకు సున్నా, హుళ్లీకి హుళ్లీ లేగా!

పెద్దకర్పూరపు ముద్దతెచ్చి పళ్ళెంలో పెట్టండి. అది గాలిబారితే కాస్తకాస్తే ఇగిరి పోయిపోయి చివరకు మిగిలేది వట్టి పళ్లెమేగా!

సరిగ్గా అట్లాగే చేసిన పుణ్యం ఇగిరిపోతున్న కొద్దీ అక్కడ ఉండే కాలంకూడా దేవతలకు తగ్గిపోతూ ఉంటుంది.

ఇంకో తమాషా చూశారూ! ఈ లోకానికీ స్వర్గానికీ దేవభాషేకాక మరొక సంబంధంకూడా ఉంది. ఇది భావకంటేకూడా సూక్ష్మమైనది. ఇది చాలా మంది తెలియదు. ఇంద్రద్యుమ్న మహారాజు కథ చదవండి!—

ఎవరిసంగతన్నా మన మనుశొనేప్పుడు వాడు మంచి పేరుప్రతిష్ఠలతో బ్రతికాడంటాము. ఆ పేరు ప్రతిష్ఠలకే కీర్తి అనేపేరు. యశస్సన్నా అదే. ఈ లోకంలో యశస్సు ఎన్నాళ్లుంటే వాడన్నాళ్లూ స్వర్గంలో ఉంటాడు.

పేరంటే గోడలమీదా, కట్టించిన మందిరాల ముఖపట్టాలమీదా, చెక్కలమీదా, దేవాలయాలకు పోయే మెట్లమీదా పావలాడబ్బులిచ్చి చెక్కించుకొనే విలాసాల పేరుకాదు. అట్లా చెక్కించే పేర్లు ఆ రాళ్ల మీదనే ఉంటవి. పైకిపోవు. అవికావు నేనుచెప్పే పేరుప్రతిష్ఠలు.

వీడీ మంచిపనిచేశాడు. ఇదుగో ఈ మంచినీళ్ల బావి తవ్వించాడు. ఈ గుడి కట్టించాడు. ఈ సత్రం వేయించాడు. ఈ చలివేంద్ర పెట్టించాడు. ఈ కలకలలాడే మంచి పిల్లలను కన్నాడు. ఈ మంచిపిల్లలపుస్తకం వ్రాశాడు—ఇట్లాంటి కీర్తి—లోకంలో మనబోటి మంచివాళ్ల హృదయాలలో ప్రతిష్ఠితమై నిలిచి ఉండాలి. అదే సువాసనవలె—సంపెంగ పువ్వు వాసన వెలగపండువాసనకంటెకూడా బాగా—గుప్పున స్వర్గలోకం దాకా వ్యాపిస్తుంది—స్వర్గమంటే వేరే ఏమోఅనుకోకండి, పుణ్యాత్ముల యశోగంధమే, వారి యశోధూపమే, వారి యశోగానమే, వారి యశఃకాంతే, వారియశః పీయూషమే, వారి యశోవ్యాప్తే స్వర్గము ఆకారంగా ఏర్పడుతుంది.

కుందిలో మళ్ళీమళ్ళీ పోసే చమురులాగే ఈలోకంలో కీర్తించేమాటలు వాళ్లకక్కడ నిలకడ కలిగిస్తవి.

శిబి ఎప్పటివాడు? కర్ణుడెన్నాళ్లనాటివాడు? దధీచి ఏకాలంవాడు? దాత పేరు చెప్పినప్పుడల్లా వాళ్ల పేర్లు తలచుకుంటామా లేదా ఇప్పటికీ?

వాల్మీకి అంటే వ్యాసుడంటే జైమిని అంటే కాళిదాసుఅంటే నన్నయ తిక్కన ఎర్రయ పోతన

లంటే ఇప్పటికీ మనము భక్తితో ప్రేమతో తలచుకోమూ? కాబట్టి వాళ్లకు ఇంకా స్వర్గంలో స్థానము చలించలేదన్నమాట. అయితేనూ శారూ, చక్రవర్తులలో షట్ చక్రవర్తులని ఆరుగురుచక్రవర్తుల పేర్లే చెప్పుకుంటాము. మిగిలిన చక్రవర్తులు ఎంతమంది రాలేదు. పోలేదు? వాళ్ల పేర్లు మన కెవరికన్నా జ్ఞాపకమున్నవా? మన ఈ కథలో చక్రవర్తికూడా ఆ మరిచినపోయిన వాళ్లల్లోనే పడ్డాడు. అందుకనే అతనిపేరు నాకే జ్ఞాపకంలేక చెప్పలేదు. మరి అతని మంత్రీ కోశాధికారీ గాయకుడూ వాళ్ల భార్యలూ—వాళ్ల పేర్లన్నీ అసలే జ్ఞాపకంలేవు. పోనీ, మీా కెవరికైనా జ్ఞాపకముంటే చెప్పండి చూదాము!

వాళ్లతర్వాత పెద్ద పెద్ద చక్రవర్తులు మంత్రులు కోశేశ్వరులు గాయకులు ఎందరెందరో పుట్టారు. వీళ్ళ పేర్లు ఈ లోకంలో తలుచుకొనే వాళ్లే తక్కువైపోయినారు.

వెనక ఇంద్రద్యుమ్న మహారాజును స్వర్గంలోనుంచి వెళ్ళిపొమ్మంటే, లోకమంతా వెదకి తన పేరూ పుణ్యకార్యాలూ ఎరిగిన ముసలితాబేలునుచూపి మళ్ళీ స్వర్గంలో స్థిరపడ్డాడు. మన మివ్వాళ ఆ మహారాజు పుణ్యనామము స్మరించినాము గనుక ఇంకా కొన్నాళ్లు గట్టిగా ఉంటాడక్కడే.

స్వర్గంలోఉన్నవాళ్లకు తమ కీర్తిదీపంలో చమురు ఐపోతున్నదని తెలుస్తుంది. వాళ్ళకు దిగులు పుట్టుకు వస్తుంది. మన కథలో ఎనిమిదిమందికీ దిగులుగా ఉన్నది.

ఒకనాడు వాళ్లక్కడ పొద్దున్నే లేచారు. ఎవరన్నా పుణ్యాత్ములు భూలోకంలో మన పేరివ్వాళ స్మరిస్తారాలేదా అని ఆదుర్దాగా ఎదురుచూస్తున్నారు. ఆ ప్రొద్దున ఎవరూ తలచుకోలేదు!

మధ్యాహ్నమైంది. ఇంకా ఎవరూ తలచుకోలేదు!

మూడుజాములైంది. ఎవరూ తలచుకొన్న జాడలేదు. వాళ్ళకు దిగుళ్లు ముంచుకువస్తున్నది. వాళ్లి దేహాలలో సహా మనస్సులు దిమకుపోతూ కుంగుతున్నవి.

ఆ దీపాలు మిణుక్కు మిణుక్కు మంటున్నవి.

పొద్దుకూకబోతున్నది. ఆశ వదలింది. అక్కడినుండి పొమ్మని చెప్పించుకునేకంటె మర్యాదగా తామే బయలు దేరుదామనుకొన్నారు.

ఎనిమిదిమందీ ఎనిమిది దిక్కులనుంచీ కామధేనువుదగ్గరకు గాభరాగా పరుగెత్తుకు వచ్చారు. ఉన్న కొనఓపికతో ఆ గోమాత కాళ్లమీాద పడ్డారు.

కామధేనువు వాళ్లవంక దయతో చూసింది. ఒక్క త్రుటికాలము!

ఆ చిన్ని దయాలోకనమే ఇన్నాళ్ళూ వాళ్ళు తాగిన అమృతంకంటె ఎన్నోరెట్లు మధురంతోచింది. కర్పూరద్వీపం భాసించింది.

ఆ చివరక్షణంలో వాళ్లకు ప్రయాణం చేయడానికి ధైర్యం వచ్చింది. ఎనిమిదిమంది పుణ్యమూర్తుల ముఖాలు వాళ్లకు మెరుపు మెరిసినట్లు భాసించినై.

అంతే!

దేవతలలెక్కలో ఆ ఎనిమిదిమంది లెక్క తగ్గిపోయింది. దేవలోకంలో వాళ్ళపేర్లు లేవు.

ఏమైనారో మరి?

[ఇంకా ఉన్నది]

చాలీచాలని జీతంతో కాలంగడిపే ఒక గృహస్థుయింటికి ఆయన మేనమామ వచ్చాడు.

మేనమామ: ఒరే అబ్బాయీ! కోర్టుపనిమీాద వచ్చాను అర్జంటుగా ప్లీడరుగారిని చూడాలని; వెళుతున్నాను. ఈ సామానులు లోపల పెట్టించెయ్.

అల్లు: సరే వెళ్లిరా మామయ్యా నేనూ జ్యోతిష్కుణ్ణి సంప్రతించటానికి ఇపుడే వెళ్లొస్తాను.

మా: ఏం విశేషం?

అల్లు: ఆ! ఏమీాలేదు. నాకు ఇవ్వాళనుంచి శనిదిశ ఆరంభమౌతుందని లోగడ చెప్పాడు; నిజమౌతుందనుకో, ఇక అది వదిలేదెప్పుడో కనుక్కుందామని! —కృత్తివెంటి సత్యనారాయణరావు; మద్రాసు.

బడితోట

ఎస్. గోపాలరెడ్డి

మేనేజిమెంటువారి బదిలీ పుత్తర్వు పురస్కరించుకొని, మూటా ముల్లె సర్ది కుటుంబ సమేతంగా బయలుదేరాను కమలాపురానికి. శరీరంమాత్రం పోతూంది గానీ మనస్సుమాత్రం విడిచిపోతూన్న గ్రామం పైననే మసలుతూంది. పంతులుగారంటే ఆ గ్రామస్థులకుండే ప్రేమ, ఆ విద్యార్థులకుండే భక్తి, విశ్వాసాలు, ఆ తలిదండ్రుల ఆదరణ యివన్నీ తలచుకొంటూంటే నా మనస్సు పరిపరి విధాల ఖేదపడడం ప్రారంభించింది. విధివైపరీత్యాన్ని నిందించుకొంటూనే బయలుదేరాను.

పది గంటలకల్లా కమలాపురం చేరుకొన్నాను. బస్సుదిగి నేరుగా బడికెళ్లాను. బడి స్థలం మాత్రం చాలినంతగా ఉంది. ఒక పెంకుటిల్లు, ఒక పూరియిల్లు ఉంది. బడి వెనకనే ఆటస్థలం. బడి ముంగిట కూడా కాళీజాగా వుంది నేను బడిలో కాలుపెట్టగనే సహోపాధ్యాయుడు యెదురుగా వచ్చి చేతనున్న సంచి తీసుకొని లోపలికి తీసుకెళ్లాడు. కొద్దిసేపు సేదతీర్చుకొని, సహోపాధ్యాయుడు తెప్పించిన చన్నీళ్లు త్రాగి ప్రధానోపాధ్యాయుడుగా చార్జి పుచ్చుకొన్నాను. ఆ దినమే పూరింటనున్న తరగతులను పెంకుటింటికి మార్చి, పూరింట తాత్కాలికంగా కాపురం పెట్టాము నేనూ, నాభార్య.

సాయంత్రం బడి వదలగనే బయలుదేరి గ్రామంలోకిపోయాము. సహోపాధ్యాయుడు చాలామందికి నన్ను పరిచయం చేశాడు. అందులో ముఖ్యంగా గ్రామమునసబు, మాజీ పంచాయితీబోర్డు ప్రెసిడెంటు, కులపెద్ద యిత్యాదులున్నారు. అందరూ సరిఅంటే సరిఅన్నారే గానీ ఆదరించిమంచినీళ్లిచ్చినపాపాన పోలేదు. అంతటితోనే ఆ గ్రామపరిస్థితి యేలాగుంటుందో అర్థం చేసుకొన్నాను. తిరిగివస్తూ చేతనున్న ఐదురూపాయలకు శెట్టి అంగట్లో బియ్యము, నూనె, ఉప్పు వగైరా జీవితావసర వస్తువులు కొని బడిచేరుకొన్నాను మాఆవిడకు గ్రామపరిస్థితులన్నీ చెప్పి, యెలా పొదుపుగా నడచుకోవలసిందీ చెప్పాను. మాఆవిడ సైతం విస్తుపోతూ “యిదేంటండీ! స్వర్గంలాంటి గ్రామంవదలి యీ నరకంలాంటి వూరొచ్చేశాము. తిరిగీ అచ్చటికే మార్చమని దరఖాస్తు చేయండి.” అంది. “అలాగే చేద్దాం” అంటూ రోజులు గడుపుకపోతున్నాం.


పక్షంరోజులు గడచేసరికే మేనేజిమెంటువారి ధర్మమా అంటూ జీతం రాళ్ళు పంపారు. అంతతో కొద్ది తృప్తిగలిగి యిక బళ్లో కాపురం చేయడం యేమంత బాపుండదనుకొని గ్రామంలో యేదైనా ఇల్లు చూద్దామని బయలుదేరాను. యెంత వెదకినా ఒక్క యిల్లైనా యిస్తానన్న పుణ్యాత్ముడు లేకపోయాడు. చివరికి, విసుగెత్తి సహోపాధ్యాయుణ్ణి కూడా చూడమన్నాను. ఆయన వారం రోజులు తిరిగి తిరిగి గ్రామమునసబు సిఫార్సుతో ఒకగుండ్రని గుడిసె దొరికిందన్నాడు. దానికి మూడు రూపాయలు కిరాయి! యేదో వొకటి దొరికిందనే తృప్తితో ఆగుడిసెలోనే కాపురం ప్రారంభించాము.

ఆయింటికి మేము తెచ్చిన సామాన్లే సరిపోయాయి. యిక పడుకొనడం, కూర్చోవడానికి సైతం యింటిముంగిట ఒక పందిరి తయారుచేయించుకొన్నాను. ఆ గ్రామాన డబ్బులుంటేగానీ ఒక్కవస్తువు దొరకదు. మజ్జిగనీళ్లు మొదలుకొని కూరగాయలవరకూ ఉచితంగా యివ్వరు సరిగదా బాకీ కూడా యివ్వరు. అదేమింటే యింతకమును వున్న పంతులొకడు బాకీలన్నీ యెగ్గొట్టి వెళ్ళిపోయాడట అందుకని నాకివ్వనన్నారు. యిలా అతికీ అతకని సంసారంతో ఒకమాసం గడిచింది.

ఒకనాడు డిప్యూటీ యిన్‌స్పెక్టరుగారు మాబడిని విజిట్ చేశారు. బడిని గురించి, చదువును గురించి అన్నీ బాపుందనే వ్రాశారు కానీ బడితోట లేకపోవడం చాలా పొరబాటని, దీనినిబట్టి చూస్తే పంతుళ్ళ సోమరితనం బయటపడుతున్నదని, మరోమారు దర్శించేలోగా బడితోట లేకుంటే పంతుళ్లపై చర్య తీసుకోబడునని వ్రాసి వెళ్లారు. ఈ విషయమై సహోపాధ్యాయునితో చెప్పాను. “బడితోట నిర్మిం

చకపోతే చర్యతీసుకొంటారని, తర్వాత మనం చాలా యిబ్బందులు పడవలసివస్తుందని, యేలాగూ మనం కూరగాయలు కొంటున్నాము గనుక తోటపెంచితే అందులో కాయలు మనమే వుపయోగించుకో వచ్చునని, అందువలన మనకు కొద్ది ఆదాకూడా వుంటుందని" బడితోటయొక్క అవసరాన్ని గూర్చి చెప్పాను. ఇందుకు సహోపాధ్యాయుడుకూడా "సరి" అన్నారు. పిల్లలసాయంతో వంగ, మిరప చిక్కుడు, బీర, సొర, పొట్ల యిత్యాదుల విత్తులను చేర్పించాము. బడి ముంగిట స్థలాన్ని బాగుగా త్రవ్వించి, ఎరువువేయించి, విత్తులు నాటించాము. బడిలో బావి లేని కారణాన నీటిసమస్య కొద్ది కష్టమనిపించింది. ఇందరు పిల్లలుండగా నీటికేమి కొఱతని ప్రతిదినం సాయంత్రం పిల్లల సాయంతో బయట బావులనుండి నీరు తెప్పించి పోయడం ప్రారంభించాము. ఇలా ఓ పదిరోజులు గడచింది.

ఒకనాడు మాజీ పంచాయితీ బోర్డు ప్రెసిడెంటుగారు బడికొచ్చారు. నేనూ లేచి యెదురుగా వెళ్లి, లోపలికి తీసుకొచ్చి బడి బాగోగులను గూర్చి వరుసగా వివరించాను. అన్నీ సావధానంగా విన్నారు. తర్వాత "పంతులుగారూ! మిమ్మల్ని గూర్చి మా గ్రామంలో మహాచెడ్డగా చెప్పుకొంటున్నారు" అన్నాడు. నాకు కడుపున నిప్పు పడ్డట్టయింది. "యేమండీ అలాగంటారు" అన్నా. "అవును. మీరు ప్రతిరోజూ పిల్లల చేత నీరు తెప్పించుతున్నారట.



"మీరు ప్రతిరోజూ పిల్లలచేత నీరు తెప్పించుతున్నారట. మనసెరిగి మసలుకోండి"

ఇలాగ యిదివరకున్న ఉపాధ్యాయు లెవరూ చేసియుండలేదు. లేదు. మా గ్రామంవాళ్ళంతా హెచ్చుకులానికి చెందినవారు. వారిచేత యిలాంటిపనులు చేయించడం యేమంత బావుండదు. గాన మనసెరిగి మసలుకోండి" అని సలహా చెప్పి వెళ్లిపోయారు. నేను యిదివిని అలాగే స్తంభించి పోయానంటే నమ్మండి. నా జీవితంలో యిలా యేతల్లీతండ్రీ అన్నపాపాన పోలేదు.

బడితోటలో విత్తులన్నీ మొలకలెత్తాయి. గ్రామంలో యిలాగున్నదని తెలియడంచేత ఆనాటినుండి ప్రతిదినం నీరుపోయడం మాన్పించి, రెండురోజులకొకమారు పోయునట్లేర్పాటుచేశాను. పక్షం రోజుల కల్లా మొక్కలన్నీ బాగా ఎదగడం ప్రారంభించాయి. కాకర, బీర, సొర, పొట్ల యిత్యాదులన్నీ తీగలు వదలి ప్రాకులాడడం ప్రారంభించాయి. ఇలా వుండగా ఒకనాడు యెవరివో కొన్ని పశువులు వచ్చి తోటంతా నాశనంచేసి వెళ్లాయి. ఇకకంపలు కట్టకపోతే ప్రయోజనం లేదని ఒక ఆదివారం పెద్దపిల్లలు కొందర్ని పిలుచుకొని చేనుకెళ్లాము. కావలసినన్ని కంపలుకొట్టి తీసుకొచ్చి బడితోటకు భద్రంగా వేశాము.

బడితోట

ఆ మరునాడు గ్రామమునసబుగారు మా బడికి వేంచేశారు. వచ్చిందే తడవుగా "యేమండీ పంతులుగారూ! తమరు కొద్దిగా గ్రామస్థుల గౌరవాన్ని కూడా గుర్తించండి." అన్నాడు. "ఏమండీ నేను ఆలా యెవ్వరినీ అగౌరవించలేదే" అన్నాను. "అదేమిటండీ అందరి పిల్లల చేతా నీరు తెప్పించడం, కంపలు కొట్టించడం యిదంతా యేమిటనుకొన్నారు. ఇదివరకున్న పంతుళ్లెవరూ యిలా చేయించలేదు. గాన గమనించి తిరుగండి" అంటూ హెచ్చరిక చేసి వెళ్లారు మునసబుగారు.

ఆ నాటినుండి నాకు బడితోటంటే కొద్దిగా మనసు విరిగింది. పిల్లలచేత యింక యేలాటిపనీ చేయించరాదనే తీర్మానానికి వచ్చాను. కానీ మొక్కలన్నీ పువ్వులుపూసి కాయలు కాయడానికి ప్రారంభిస్తూన్నాయి. పొట్ల, కాకర, చిక్కుడు యిలాంటి పన్నీ తమతమ తీగలతో కంపలను కప్పేసి తోరణాలవలె పిందెలను, పువ్వులనూ వ్రేలాడదీసినయ్. పాములు వచ్చి తీగలను కరుస్తున్నాయో అన్నట్టు పొట్లపిందెలు తీగనుండి వ్రేలాడుతున్నాయి. అప్పుడప్పుడే పువ్వునుండి బయటికొస్తూన్న బెండపిందెలు బంగారు కడ్డీలలాగా ఎండకు మెరుస్తున్నాయి. గోరుచిక్కుళ్లు ముత్యాల్లాగా గుర్తులు గుత్తులుగా పువ్వులు తొడిగిఉంది. వీటినంతా చూస్తూంటే నాకు వాటి నాలాగే నీరు పోయకుండా యెండబెట్టటానికి మనసు రాలేదు. ఈ సంగతి సహోపాధ్యాయునికి కూడా చెప్పాను. ఆయనకూడా తోటకు నీరుపోయకమానడం బాగు లేదన్నాడు. ఆనాటినుండి మేమిరువురూ సాయంత్రపువేళలో బక్కెట్టు తీసుకెళ్లి నీరు తెచ్చి పాదులకు పోసేవారము. ఆదివారములలో సైతం తోటలో కలుపు తీయడం, గొప్పు త్రవ్వడం, కంప కట్టడంలాంటి తోట పనులలో పాల్గొనేవారం.

కష్టానికితగ్గ ఫలితమే యన్నట్టు తోటకూడా దినదినాభివృద్ధిచెందుతూ ఫల, పుష్పసంభరితమై చూచువారల కన్నులు మిరుమిట్లు గొలుపునట్లుగా దారినిపోతున్నవారిని సైతము విభ్రాంతుల జేయడం మొదలెట్టింది. తేనెటీగల్లాగా గ్రామస్థులంతా వరుసగా తోటకు రావడం, కాయల్నిపట్టి చూస్తూండడం. "ఒకమణుగు వంకాయలవుతుందండీ" అని ఒకరు, "వంద

పింఛన్ పుచ్చుకొనన యిద్దరు ప్రభుత్వోద్యోగులు ఒకనాటి సాయంకాలం పార్కు బెంచీమీద కూర్చొని చాలాసేపు జీవితాన్ని గురించి మాట్లాడారు. ఆ మాటల ధోరణిలో ఒకరు "నీ చిన్ననాటి కోరికల్లో ఏవైనా తీరాయా?" అని రెండో ఆయన్ను అడిగారు.

"ఆఁ! ఒక్కటి మాత్రం తీరింది!"

"ఏమటదీ?"

"ఏమీ లేదు. చిన్నప్పుడు నేను అల్లరిచేస్తే మా అమ్మ నా జుట్టు పట్టుకు ముందుకువంచి వీపుమీద తన్నేది. అటువంటి సందర్భాలలో యీ దిక్కుమాలిన జుట్టు లేకుండా వుంటే బాగుండునుకదా అనిపించేది. ఆ కోరిక యిప్పటికి పూర్తిగా తీరిపోయింది." అంటూ తల తడువుకొన్నాడు రెండో ఆయన.

సొరకాయలు కాసిందండీ" అంటూ మరొకరు, "రెండు తట్ల బెండకాయలవుతుందండీ!" అని మరొకరు యిలాగ చెప్పూపోతూండే వారు. మాకూ కాయలు కోయడానికి చేతులురాక అలాగే ఉంచాము.

అకస్మాత్తుగా ఒకనాడు డిప్యూటీ యిన్‌స్పెక్టరుగారు మా బడికి విజిట్టుచేయడానికొచ్చారు. బడితోట చూచి చాలా సంతోషపడ్డారు. "పంతులూ! అయ్యగారికి కొన్ని కాయలిప్పించండీ" అన్నాడు డి. ఐ. జవాను. అలాగేనంటూ సహోపాధ్యాయునితో చెప్పి రకానికి కొన్ని కోసి యిప్పించాను. డిప్యూటీ యిన్‌స్పెక్టరుగారు సంతుష్టులై "ఈ ప్రధానోపాధ్యాయుడు చాలా గట్టివాడని, ఇతను వచ్చాక బడి అన్నివిధాలా సంపూర్ణాభివృద్ధి పొందిందని, ఒక్క బడితోటలోనే ప్రస్తుతం యీ ఖైరూపాయలకూరలు పండించియున్నాడ"ని బలేబలే వ్రాసి వెళ్లారు. మేమూ డి.ఐ. గారి విజిట్టు రిపోర్టు చూచి సంతోషపడి ఆనాడే వాటి కాపీలు తీసి మేనేజిమెంటుకు కూడా పంపేశాము. ఇక ఆఫీసర్ల బాధ్యత తీరిపోయిందంటూ ఆమరునాడు రెండు సొరకాయలుకోసి, సహోపాధ్యాయుని కొకటిచ్చి, నేనొకటిపుచ్చుకొని యింటికి బయలుదేరాను. ఏదురుగా ఆ గ్రామ కులపెద్ద వచ్చి నేకోసుకెళ్తున్న కాయను చూచి "పంతులూ! బడితోటలో బలేబలే కాయలు కాసినాయటనే! మాకూ రెండు పంపవయ్యా!" అన్నాడు. నరేనని మధ్యాహ్నం



"ఎవరో?"

ఫోటో: డి. బి. రాజు (ద్రాక్షారామ)

బడికి రాగానే రకానికి కొన్ని కాయలు కోయించి గ్రామపెద్దకు పిల్లలచేత పంపించాను. అదెల్లా పాకిందో యీవార్త? కాసేపటికల్లా మునసబు పంపాడని ఒకరు, మాజీపంచాయితీ ప్రెశిడెంటు పంపాడని మరొకరు యిలా గ్రామమంతా కూరగాయలకు వచ్చేశారు. నేనూ చేసేదిలేక కొన్ని కోయించి మునసబు, ప్రెశిడెంటులకు పంపి మిగిలిన వారందరికీ ఉదయం పంపిస్తానని నచ్చచెప్పి పంపించాను.

తెల్లారేసరికే మాయింటిచుట్టూ గ్రామస్థులంతా ప్రోగయ్యారు. ఎవరిని పలుకరించినా అందరూ

★ బడితోట ★

కాయగూరలకే వచ్చామన్నారు. ఇంతమాత్రం గ్రామస్థుల మనస్సు బడిపై కేంద్రీకరించాం గదా? అనే సంతోషంతో సహోపాధ్యాయుని పిలుచుకరమ్మని బడికి బయలు దేరాను గ్రామస్థులంతా మా వెంట చేతిసంచులు పట్టుకొని వస్తూంటే సగర్వంగా నడుస్తున్నాము మేము. తీరా తోటకెళ్ళి చూచాం గదా యేముంది? యేమీలేదు. ఒక్కపిందైనా లేదు. తోటంతా గాలించినా ఒక్కకసరు పిందైనా లేకపోయింది. గ్రామస్థులు తోటను చూచి విస్తుపోయారు. మాతోటకుపట్టినగతిని చూస్తూంటే నాకు దఃఖం ముంచుకొస్తూంది. నా సహోపాధ్యాయుడు సైతం తోటకు పడ్డకష్టం తలచుకొని బావురుమంటూ యేడ్చాడు.

"ఎందుకు యేడుస్తారండి" అంతా ఆదొంగవెధవలు చేసేపని" అన్నాడొక గ్రామస్థుడు.

"వాడు కాకపోతే మరెవరు వస్తారు? "అన్నాడు మరొక గ్రామస్థు.

"ఈనాడు సంతకెళ్ళితే మన కాయలు తప్పక పట్టుకోవచ్చు" నన్నారు మరొకరు; ఇలా యెవరికి తోచిన సలహాలు వారు వారు చెప్పి, కాళీచేతులతోనే వచ్చిన దారి బట్టారు గ్రామస్థులు.

దుఃఖపూరిత మనస్కులమై పది గంటలవరకూ ఆ తోటనే చుట్టుక తిరుగుతూ ఉండిపోయాము. ఇంతలో తపాలు బంట్రోతు "తపాలుసార్!" అంటూ ఒక కవరు చేతికిచ్చి వెళ్ళిపోయాడు. అది మా మేనేజిమెంటునుండి వచ్చింది. చింపి చూచాను. "విజిట్ రిపోర్టుప్రకారం మీ బడితోట బాగా వుందని, అందులో కాయకూరలు సుమారు యాభైరూపాయల విలువ కలిగి వున్నవని తెలిసింది. గాన వెంటనే వాటిని కోయించి, మున సబుగారి సాయంతో దండోరా వేయించి గ్రామస్థులయెదట వేలం పాట పాడించి వచ్చిన డబ్బును వారంరోజులలోగా ట్రెజరీలో చెల్లించి రశీదు పంపండి." అని వుంది. అప్రయత్నంగానే రెండు కన్నీటిబొట్లు ఆ కాగితంపైబడ్డాయి. దీనితో "గోరుచుట్టుపై రోకలిదెబ్బ"లా గయింది నాపని. వెంటనే గ్రామమునసబు వద్దకెళ్ళి "బడితోటలోకూరలన్నీ పోయాయి. ఆమాట తెలియించండిసార్" అని మొత్తుకొన్నాను. తుదకు మేనేజిమెంటునుండి వచ్చిన ఉత్తర్వును చూపించి తోటకూరలన్నీ దొంగతనం పోయాయని ఒక సర్టిఫికేటు యిమ్మన్నాను. "పోవయ్యా! నా గ్రామంలో దొంగతనం పోయిందంటే అది నాకవమానం. అట్లా నేను సర్టిఫైచేయడానికి వీలులేదు" పొమ్మన్నారు.

ఆదినమంతా నాకు పిచ్చి పట్టినట్లనిపించింది. యేం చేయడానికీ తోచలేదు. చేచేతులా పెంచిన తోట పోయిందేనని ఒకప్రక్క, యింతకష్టించి తుదకు మేనేజిమెంటువద్ద చెడ్డపేరు వస్తుందేమోనని మరొప్రక్క వేధించుకతింటూంది. "అధికార్లకు నిజం చెప్తే తప్పేముందని?" సలహాయిచ్చాడు సహోపాధ్యాయుడు అలాగే జరిగిన వాస్తవ విషయాలు మేనేజిమెంటుకు తెలుపుకొన్నాను.

వారం గడచింది. మేనేజిమెంటు నుండి ఉత్తర్వు వచ్చింది. బడి సొత్తులు జాగ్రత్తగా కాపాడలేక పోయారనే కారణాన మా యిరువురికీ తలకొక గ్రామానికి పనిష్మెంటు ట్రాన్స్ఫరు చేశారు.

హారి భగవంతుడా! అనుకొంటూ మూటాముల్లె సర్దుకొని బయలుదేరాము చెరోఒకప్రక్క.

★

రూపంకాదు, గుణంప్రధానం

ఆ రోజు ఆదివారం. పరీక్షలన్నీ అయిపోయాయి. ఆ శ్రమనంతా మరిచిపోయినట్లుగా, ఆరోజు మధ్యాహ్నంనాలుగుగంటలవరకూ బాగా నిద్రపోయి లేచాడు విశ్వం. తలమీద కొట్టినట్లు, అప్పుడే వాడికి జ్ఞప్తికి వచ్చింది—ఆరోజు మొదటి ఆటకు 'బూట్ పాలిష్' సినిమాకు—రంగడు, రఘులతో కలిసివెళ్లాలని. ఆదరాబాదరా స్నానంచేసి దుస్తులు తొడుక్కొని, తను దాచిన మూడురూపాయల డబ్బులుకోసం, బీరువా డ్రాయరు తెరిచాడు. తను డబ్బు దాచిపెట్టిన చోటుకు, మరో ప్రక్కగా నాన్నగారి రిస్టువాచీ వుండడం వాడికి కగుపించింది. దాన్ని చూస్తూ రెండు నిమిషాలుండిపోయాడు విశ్వం. తర్వాత డబ్బుతీసి, జేబులో ఏడేసుకుని, వంటయింట్లో వున్న తల్లి వద్దకు వచ్చాడు. "మా..."అని నసిగాడు.

"ఏరా విశ్వం!...స్నేహితుల్తో కలిసి సినిమాకెళ్లాలని చెప్పావుగా! ...ఇంకా వెళ్లలేదూ?" అని అడిగింది అమ్మ.

"ఇదిగో, బయల్దేరబోతున్నాను ...సరేగాని, నాన్న ఎక్కడికి పోయాడే?" అని అడిగాడు.

"పేకాటలో మునిగిపోయి వుంటారు— మూడోయింట్లో. ఎందుకూ?"

"ఏమీలేదు... నాన్న రిస్టువాచీ, డ్రాయరులో చూచానే! ఈ ఒక్కపూట సినిమాకి చేతికి కట్టుకుపోతానే!" అని జాలిగా అన్నాడు విశ్వం.

"రిస్టువాచీ?! ... మీ నాన్నగారికి తెలిసిందంటే, నీ వీపు బద్దలు చేస్తారు" అంది అమ్మ.

◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆

సి. డి. యస్. రామయ్య

◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆

"ఎలా తెలుస్తుందే? ... ఇక పుదయం ఆఫీసుకెళ్లేప్పుడు మాత్రమేగా రిస్టువాచీని చూచుకోపోతున్నాడు. అంతలోకే, నేను వున్నచోటే దాన్నుంచేస్తాగా!" అన్నాడు ధీమాగా.

"ఏమో బాబూ!...నీ యోచన నాకు బాగాలేదుగానీ, ... జాగర్తగా తీసుకెళ్లి, మళ్లీ తెచ్చిపెట్టేయ్. జాగర్త!"అని వూరుకుంది అమ్మ.

విశ్వం సంతోషంతో గంతులేస్తూ, రిస్టువాచీ చేతికి కట్టుకుని బయలుదేరాడు.

అనుకున్నప్రకారం, రఘు-రంగడు రౌండుటానాలో నాలుగున్నర గంటలకల్లా రెడీగా కాచుక్కూచునివున్నారు. విశ్వం వాళ్లని కలుసుకున్నాడు. తన చేతనున్న

రూపం కాదు, గుణం ప్రధానం

రిస్టువాచీని వారికి చూపిస్తూ, డంబాలు పలకడం మొదలెట్టాడు విశ్వం. వాళ్ళనాన్నగారు, ఈ రిస్టువాచీని తనని కట్టుకెళ్ళమన్నారనీ, వాళ్ళ నాన్నగారికి తనమీద మితిలేని ప్రేమనీ చెప్పాడు.

వాళ్లతో కలిసి హోటలుకెళ్ళిన తర్వాత, కిల్లీషాపువద్ద నిల్చుని, కబుర్లాడుకుంటున్నారు ముగ్గురూ. ఉండబట్టక, వీధిన వెళ్లే 'ఐస్ ఫ్రూట్'ను కొనుక్కొని తినడం మొదలెట్టారు రఘు, రంగడూ. కాని, విశ్వానికి ఐస్ అంటే గిట్టదు. కాబట్టి, కిల్లీషాపులో, రెండు బిస్కట్లు కొని, తింటూండగా, తోకాడించుకుంటూ, చీడ పట్టిన ఒక కుక్క వారివద్దకు వచ్చింది. తింటున్న బిస్కత్తులో కొంతతుంచి దానికి వేశాడు విశ్వం. అది దాన్ని తిని, మళ్ళీ తోకాడించుకొంటూ, విశ్వం ముఖంలోకి చూస్తూ కూర్చుండిపోయింది.

"పాపం, మంచి కుక్కలాగుంది. చీడవచ్చి, శరీరం చెడిపోయింది" అన్నాడు విశ్వం.

రఘు తాను తింటున్న 'ఐస్ ఫ్రూట్'లో కొంత పడేశాడు. ఆ కుక్క దాన్నితింది; మళ్ళీ తోక ఆడించుతూ, విశ్వం ముఖంలోకి చూస్తూవుంది.

"ఏంరోయ్, మనకో కొత్త మిత్రుడు పరిచయమైనట్టున్నాడే! —అవునా?" అని కుక్క ముఖంలోకి చూశాడు రంగడు. కుక్క రెండుకాళ్లూ పైకెత్తింది.

"భలే భలే!...అచ్చంగా మాటలునేర్చిన కుక్కరోయ్! మన మాటలు బాగా పసిగట్టి వింటోందిరా!...అవశ్యం ఇదీ మనమిత్రుడవ్వాల్సిందే!..." అన్నాడు రఘు—తన ఐస్‌ఫ్రూట్‌లో కొంతపడేస్తూ.

"మిష్టర్ చీడారావ్!...మీ పేరేమిటి?...మీ నివాసమెక్కడ?" అని పరిహాసంగా అన్నాడు రంగడు.

"నివాస మేముందిరా భాయ్, దానికి?... ప్రేమచూపే మనుష్యులు యెక్కడుంటే, అక్కడుంటుంది అది. మనం, ప్రేమతో ఆహారం పెట్టి పిలిచామనుకో, అది మనల్నే అనుసరిస్తుంది. అంతే!" అంటూ కిల్లీషాపులో, మరో బిస్కత్తుకొని, దానికి కొంత కొంతగా వేశాడు విశ్వం.

"ఒరే విశ్వం!...దాని కెందుకురా, వూరికే తిండిపడేస్తావ్?... కర్మం, చీడపట్టిన కుక్క, అది మనల్ని అనుసరించడం, మనకంత మంచిదిగాదు." అన్నాడు రఘు.

అలాకులాసాగా కబుర్లాడుకుని, వేళకి మొదటిసినిమాకి ముగ్గురూ వెళ్లారు. థియేటర్లో అర్థగంటసేపు కరంటుఆగిపోయింది; తీరా సినిమా వదిలేసరికి రాత్రి పదిగంటలయింది. బస్సులు దొరకటం శ్రమ అయింది గూడా!... తీరా బస్సు దిగాక, రఘు రంగడు వాళ్ల యిళ్ళ దారిపట్టారు. బస్సు దిగిన తర్వాత, తనిల్లు చేరుకోడానికి అరమైలు వెళ్లాల్సివుండటంవల్ల, విశ్వంకి భయంవేసింది. ఏ పోకిరి వెధవలైనా, తన్ను బెదిరించి, అదిలించారంటే తనేంచేస్తాడు? అనుకుంటూ నడుస్తున్నాడు. తను స్నేహితులతో కలిసి, కబుర్లాడిన కిల్లీషాపు గడిచి, మరో చిన్నవీధి గుండా నడిచిపోతున్నాడు విశ్వం! రిస్టువాచీ జ్ఞప్తికొచ్చింది. ఎవడైనా పోకిరి వెధవ, తన్ను ఎదిరించి, తన రిస్టువాచీ లాక్కుపోతే, తన గతేమవుతుంది? నాన్న తనను వూరికే వదిలిపెట్టాడా?...తనకే గాకుండా, తన అమ్మకిగూడా చీవాట్లూ, పెట్లూ తగలవూ?...ఛీ!... ఇకయెప్పుడూ ఇతరులసొత్తు తాకగూడదు. నాన్న రిస్టువాచీ తను కట్టుకోడం మూలానేగదా ఇంతిగా భయపడవలసి వచ్చింది?...

ధైర్యం చిక్కబట్టుకుని నడుస్తున్న విశ్వానికి, మరో చిన్న సందులో, ఒక నల్లని, లావుపాటి రూపం ప్రత్యక్షమయింది. ఆ రూపాన్ని చూస్తూనే, భయంతో కొయ్యబారిపోయాడు విశ్వం. ముక్కు బీడీ, నోటనుంచుకున్న ఆవ్యక్తి కింగ్‌కాంగ్‌లా వున్నాడు.

"యార్రా నీ?" అని అడిగాడు ఆ కింగ్‌కాంగ్.

విశ్వం తమిళాన్ని అర్థంచేసుకోగలడుగాని మాట్లాడలేడు. కాబట్టి, "నేను...ఇంటికి...పోతు..." అని తడబడ్డాడు భయంతో. ఆ కింగ్‌కాంగ్ విశ్వం సమీపానికొచ్చాడు.

"ఎంగేపోయివర్రే?" - (అంటే నువ్వెక్కడికిపోయి వస్తున్నావని) అడిగాడు కింగ్‌కాంగ్.

"సిని...మాకి...!"

"పణం...వుందా?"

"డబ్బు అంతా అయిపోయింది

...పావలా ...మాత్రమేవుంది... ఇంకేమీలేదు." అన్నాడు చేతులూపుతూ విశ్వం. చేతులూపుతున్నప్పుడు, విశ్వం చేతిలోని వాచీ ఆ రౌడీకళ్లపడింది.

"ఆ రిస్టువాచీ నాకు కుడు." అన్నాడు ఆరౌడీ.

విశ్వం నిలువునా నీరైపోయాడు. "ఇది మానాన్నది. ఇది నీకిచ్చేస్తే మానాన్న నన్ను చంపేస్తాడు." అని ఏడ్పు లంకించపోయాడు, విశ్వం.

"డేయ్!" అని వురిమాడు రౌడీ! ... "వాయ్ గట్టియా తెరిందియనా కుత్తిడువేఁ! (నోరు గట్టిగా తెరచావంటే, పొడిచేస్తాను)" అంటూ, విశ్వానికి బాకు చూపిస్తూ బెదిరించాడు. విశ్వానికి భయంలో మైకం వచ్చినంతపనయింది.

"కైట్రా! (విప్పరా)"అని గర్జించాడు ఆ కింగ్ కాంగ్.

అంతసేపూ, విశ్వానికి వెనకాల చీకటిలో దాగివుండి, ఇదంతా గమనిస్తూన్న ఒకకుక్క, హఠాత్తుగా ఆ రౌడీమీదపడి, అతని చేతిమీద కరిచింది. రౌడీ చేతిలోని కత్తిని కింద పారేసి, కుక్కని అదిలించబోయాడు. కానీ, అంతలోకే, కుక్క, ఆ రౌడీశరీరంమీద నాలుగైదు కాట్లుపడేసింది. చేతిమీదా, కాళ్ళమీద నెత్తురు కారుతుండగా, బాధకి తాళలేక, ఆ రౌడీ పలాయనం చిత్తగించాడు.

ఆపదసమయంలో తన్ను వచ్చి కాపాడిన, ఆ కుక్కవేపు జాగ్రత్తగా చూశాడువిశ్వం! ...అతనికాశ్చర్యం కలిగింది! ఆ సాయంత్రం కిల్లీషాపు వద్ద, తను బిస్కత్తుపెట్టిన కుక్కే; రంగడు రఘులు చీడకుక్కని పరిహాసంచేసిన ఆకుక్కే!...దానికి తనమీద ఎంత ప్రేమ! అనుకున్నాడు విశ్వం. తోకాడించుకుంటూ తన వద్దకు వచ్చిన ఆ కుక్కని - దాని శరీరమంతా చీడగావుండినాగూడా-మెల్లగా నిమిరాడు. దాన్ని తోడు తీసుకుని, యిల్లు చేరాడు విశ్వం.

* * *

మర్రోజుసాయంత్రం - అయిదు గంటలకి, రంగడూ - రఘులతో కలిసి కిల్లీ షాపువద్దకు వచ్చాడు విశ్వం. అక్కడ మళ్ళీ ఆ చీడకుక్క ప్రత్యక్షమయింది. దాన్ని ప్రేమగా పిలచి, దానికి కావలసినంతవరకూ తిండి పెట్టాడు విశ్వం. అది తనకు రాత్రిచేసిన వుపకారాన్ని తన స్నేహితులకు విశదంగా చెప్పాడు విశ్వం. రంగడు, రఘులు ఆమాటలు విని ఆశ్చర్యపడ్డారు. వారికి, ఆ చీడకుక్కమీద జాలి, ప్రేమ కలిగాయి.

"అయితే, ఈ రోజునుంచీ చీడారావ్ మనస్నేహితుడే!"అని సంతృప్తిగా నవ్వుకున్నారు ముగ్గురూ. వారి మాటలకు తను సమ్మతించినట్లు, ఆ చీడకుక్క తన ముందరి కాళ్లు రెండింటిని మీదికెత్తి నిలుచుంది. ★



"పాపం మంచికుక్కలాగుంది. చీడవల్ల చెడిపోయింది."అన్నాడు విశ్వం.




"అన్నపూర్ణ" అనే ఫ్రెంచి డాక్యుమెంటరీ చిత్రంలో ఒక దృశ్యం.
హిమాలయాలలోని అన్నపూర్ణ శిఖరారోహణం 1951 లో ఒక ఫ్రెంచి జట్టుచేత సాధింపబడింది.



ఎ. వి. ఎమ్ వారి "సంఘం" (లడ్కీ) లో వైజయంతిమాల, అంజలి దేవి.

★

అశ్వరాజ్ వారి "అన్నదాత" లో సిపాయిలచే చుట్టుముట్టబడిన నాగేశ్వరరావు.



అదీ - ఇదీ

ఈ ఏడాది ఇప్పటికి ఒక పది తెలుగు చిత్రాలదాకా విడుదల అయ్యాయి. పూర్వపు రోజుల్లోని చిత్రాలతో పోల్చి చూస్తే వీటిలో ఏదీ చెప్పుకోదగినంత ఆర్థిక విజయం పొందలేదు. పిల్లల చిత్రం ఒకటి కాక వీటిలో జానపద చిత్రం "చంద్రహారం" ఒక్కటే. మిగతావన్నీ సాంఘిక చిత్రాలు. గుడ్డిలో మెల్లగా ప్రజాదరం పొందినవి 'అంతా మనవాళ్ళే', 'పెద్ద మనుషులు' 'చక్రపాణి' భరణీవారు తమ చిత్రం తక్కువలో తీశారు కనుక, ప్రత్యేకంగా దానివల్ల నే నిర్మాతలకు నష్టంవచ్చే ప్రమాదం లేదు. ఇక మిగిలిన చిత్రాలన్నీ నిరుత్సాహ జనకంగా నడిచాయి.

కిందటేడు, ఈయేడు చాలా సాంఘిక చిత్రాలు విడుదల అయ్యాయి. వీటిలో 'దేవదాసు' వంటివి ఒకటి రెండు తప్పించి మిగతావి అంతంత మాత్రంగా పోయాయి. దీనితో నిర్మాతలు మళ్ళీ జానపద చిత్రాలపై దృష్టి సారిస్తున్నట్లు కనబడుతోంది. ఈయేడు దాదాపు పది జానపద చిత్రాలు విడుదల అయినా ఆశ్చర్యపడ నక్కరలేదు అటు సాంఘికాలు, ఇటు జానపదాలు ఏవి తీసినా ప్రజలు ఆదరించని ఈ పరిస్థితిలో నిర్మాతలకు ఏమీ పాలుపోవడం లేదు.

సినిమా పరిశ్రమ విపరీతమైన నష్టాలకు గురికాకుండా ఉండడానికి చవక చిత్రాల నిర్మాణం ఒక మార్గమని పరిశ్రమ శ్రేయోభిలాషులు కొంత కాలంగా సూచిస్తూ వచ్చారు. కాని చవకచిత్రాలు ఖరీదైన చిత్రాలతో పోటీ చేయలేవనీ, చవకలో తీస్తే టెక్నికల్ ప్రమాణం పడిపోతుందనీ కొందరు మొదట్లో అభ్యంతరాలు చెబుతూ వచ్చారు. ఈ అభ్యంతరాలకు ఆస్కారం లేనట్లు ఇటీవలి చిత్రాలవల్ల వెల్లడయింది. 'చక్రపాణి', 'దొంగరాముడు'... 'తోడుదొంగలు' చిత్రాలు టెక్నికల్ ప్రమాణం విషయంలో అసంతృప్తికి తావివ్వలేదు. వీటిలో చవకబారుదనం ఏమీలేదు. చవకలో తీసినంత మాత్రాన బాక్సాఫీస్ హిట్ అవదనీ, కాదనీ, కళ దెబ్బతింటుందనీ, తినదనీ సిద్ధాంతంలేదు. కొన్ని చవకచిత్రాలు బాగా నష్టపడిన మాట నిజమే. అంత మాత్రాన చవకచిత్రాల నినాదం మూర్ఖమని ఎవరూ భావించ నక్కరలేదు. ప్రస్తుత విపత్తును ఎదుర్కోడానికి, పరిశ్రమను గడకూ, అది నిర్విరామంగా కొనసాగ డానికీ అదొక్కటే పరిష్కార మార్గంగా కనిపిస్తోంది. చాలా లక్షలు ఖర్చుపెట్టి ఎంత గొప్ప చిత్రం తీసినప్పటికీ, మునపటిలాగా ప్రజలు ఆదరించే స్థితిలో లేరు. దీనికి మంచి ఉదాహరణ "చంద్రహారం". టెక్నికల్ ట్రిక్కులు చెయ్యకుండా సాదాగా రెండు లక్షల లోపు చిత్రం తీసి నష్టపోవడానికీ, పదిలక్షలఖరీదు చిత్రం తీసి నష్టపోవడానికీ తేడా తప్పకుండా ఉంది.

చవక చిత్రాల నినాదం హఠాత్తుగా తెలుగు సినిమా రంగంలోనే పుట్టుకొచ్చినది కాదు. మన దేశంలోనే మరాఠీ, బెంగాలీ సినిమారంగాలు, ఇతరత్రా ఇటాలియన్, జాపనీస్ సినిమారంగాలు ఈ నినాదానికి ప్రోద్బలమిచ్చాయి ఆ ప్రాంతాల్లో ఇప్పటికీ చవకచిత్రాలు, పెద్దతారలు లేని చిత్రాలు తయారవుతూనే వున్నాయి.

[illegible]


సాంఘిక చిత్రాలయొక్క, ముఖ్యంగా అభ్యుదయ చిత్రాలయొక్క అపజయం చూసి సాంఘిక చిత్రాలమీదనే విశ్వాసం కోల్పోవడం దౌర్బల్య సూచన. ప్రజాభిరుచులను బాక్సాఫీస్ సూత్రాలతో అంచనా కట్టడమూ తప్పే. ఆదర్శ కళా సిద్ధాంతాలతో అంచనా కట్టడమూ తప్పే. ప్రజాభిరుచులు ఏ సంకుచిత సూత్రాల లోనూ ఇమడవు. ఒక చిత్రం సాంఘికమైనా, జానపదమైనా ప్రజాహృదయానికి సన్నిహితంగా తగలాలి. మానవ హృదయానుభూతులను, ఆశయాలను, ఆశలను, వైఫల్యాలను వదిలిపెట్టి చైతన్యం లేని నిర్జీవ ఆర్థిక, రాజకీయ సమస్యలను కళలో చొప్పించినంతమాత్రాన అది అభ్యుదయ కళ కాదు. అలాగని ఆ సమస్యలకు మానవ జీవితంమీద ఏ ప్రభావమూ లేదని ఊహాలోకాల్లో మడికట్టుకుని కూర్చోవడం కూడా 'ప్యూర్ ఆర్ట్' అనిపించుకోదు.

కేవలం తారాబలం గల చిత్రాలనే ప్రజలాదరించే రోజులు పోయాయి. అందమైన స్త్రీ తారమీద, ఆకర్షణగల పురుష తారమీద మొదటిచిత్రంలో ఉన్నంత మోజు, వరసగా ప్రతి చిత్రంలోనూ కనిపిస్తున్నప్పుడు ఉండదు. కథలో ఆ పాత్రకు ఉండదగిన ప్రాధాన్యాన్ని మించిన ప్రాధాన్యం ఇస్తే ఎంత గొప్ప తారనైనా ప్రజలు భరించలేరు. ఈ సత్యం గ్రహించకుండా నిర్మాతలుగా మారిన తారలు తమ చిత్రాల్లో తమకు మితిమీరిన ప్రాధాన్యం ఇచ్చుకుంటున్నారు. ఈ పద్ధతిపై ప్రేక్షకులు చాలా తీవ్రమైన వ్యతిరేకాభిప్రాయాలు వెలిబుచ్చుతున్నారు కూడాను. ఇటువంటి పరిస్థితులలో కొందరు పెద్ద నిర్మాతలు తమ చిత్రాల్లో నలుగురైదుగురు పెద్ద తారలను ఒకేసారి బుక్ చేయడం ఎంత వరకూ వాంఛనీయమో, ఉపయోగకరమో మళ్ళీ ఆలోచించుకోవాలి పెద్ద తారలను తీసుకున్నప్పుడు వారికి ఉచితస్థానం ఇవ్వలేకపోయినా నష్టమే; ఔచితిని మించిన ప్రాధాన్యం ఇచ్చి కథకు అసందర్భంగా చిలవలు పలవలు పెంచినా నష్టమే. 'మా చిత్రంలో అయిదుగురు పెదతారలున్నారు' అని గర్వంగా చెప్పుకోడానికి తప్ప ఈ పద్ధతివల్ల లాభమేమీ లేదు. ధనం వెచ్చించి కొనుక్కునే కీర్తికంటె నిజమైన కళా ప్రతిభవల్ల పొందే కీర్తి సుస్థిరంగా ఉంటుంది.

మద్రాసులో సినిమా స్కోప్

చాల కాలంగా వింటూవచ్చిన సినిమా స్కోప్ ఇన్నాళ్ళకి మద్రాసు వచ్చింది. న్యూగ్లోబ్ థియేటరువారు చిన్న తెర స్థానంలో బ్రహ్మాండమైన 'రెక్టాంగ్యులర్' తెరను నిర్మించారు. హాలులో చాలా స్పీకర్లు పెట్టారు.


ఈనెల 9 వ తేదీన సినిమా స్కోప్‌ను పత్రికా ప్రతినిధులకు ప్రదర్శించారు. మూడు రీళ్ళు మాత్రమే చూపబడినవి. ట్వెంటీయత్ సెంచరీ ఫాక్సువారు తాము కనిపెట్టిన సినిమాస్కోప్ విధానాన్ని ఇన్‌డోర్‌లోను, ఔట్‌డోర్‌లోను ప్రయోగం చేసి పరీక్షించి ఫలితాలు చూసుకునేందుకు తీసిన కొన్ని దృశ్యాలు చూపెట్టారు. వీటిలో న్యూయార్కు, లండను, పారిస్, వెనిస్, రోమ్‌నగర దృశ్యాలు, బ్రిటిష్ రాణి పట్టాభిషేక దృశ్యాలు, అమెరికన్ మిలిటరీ కవాతు దృశ్యాలు, ఫాక్స్ కంపెనీవారు తీసిన, తీయబోతున్న సినిమాస్కోప్ కథా చిత్రాలలోని కొన్ని దృశ్యాలు ఉన్నాయి. ముఖ్యంగా ఆకర్షవంతంగా ఉన్నవి ఔట్‌డోర్ దృశ్యాలు. విశాలమైన లాండ్‌స్కేప్‌ను చూపవలసి వచ్చినప్పుడు సినిమా స్కోప్‌నుమించిన విధానం మరి లేదనేమాట అతిశయోక్తి కాదు. ఫొటోగ్రఫీ దృష్ట్యా ఈవిధానం అతి రమణీయంగానూ, సుస్పష్టంగానూ ఉంది. విమానంనుంచి తీసిన కొన్ని షాట్లు చాలా బాగున్నాయి అన్నిట్లోకీ వెనిస్‌నగర దృశ్యాలు. అసలేఅందమైన నగరమేమో, సినిమా స్కోప్‌లో దాని అందం మరింత అందంగా భాసించింది. వీథులు నిరంతరం జలమయమై ఉంటాయి. ఇళ్ల గుమ్మాలవరకూ నీళ్లు ఉంటాయి.



"అన్నపూర్ణ" డాక్యుమెంటరీ చిత్రంలో ఒకదృశ్యం. (ఈ చిత్రం మద్రాసు, ఓడియన్‌లో విడుదల కానున్నది.)

ఏ యింట్లోనుంచి గుమ్మందాటినా సరాసరి పడవలోకే కాలు పెట్టడం. ఈ పడవలను 'గాండోలాస్' అంటారు. మనం బస్సుల్లో తిరిగినట్టు వెనీషియన్ ప్రజలు గాండోలాస్‌లో తిరుగుతూ నిత్యవ్యవహారాలు చక్కబెట్టుకుంటారు. అక్కడక్కడ ఎత్తైన వంతెనలు. ఈ వంతెనల కిందనుంచి సోమరిగా, హంసలవలె మందగమనంతో పోయే పడవలు. ఆదృశ్యాలు చూస్తుంటే మనం అక్కడ లేకపోయినామే అని కాసేపు బెంగకలిగినమాట నిజం

సినిమా స్కోప్‌లో త్రీ-డీ భ్రాంతి మచ్చుకైనా కానరాదు. విశాలమైన దృశ్యం కనిపించడం ఒక్కటి తప్ప మరే అదనపు ప్రయోజనమూ లేదు. పైగా మామూలు పోతాయి కూడాను. ఉదాహరణకు, టూ-డీ టెక్నిక్ వల్ల వచ్చే కొన్నిలాభాలు ముఖానికి క్లోజప్ ఇవ్వడానికి వీలులేదు.



మచిలీపట్టణంలో ఈ నెల 7, 8, 9 తేదీలలో జరిగిన 18 వ ఆంధ్ర నాటకకళా పరిషత్తులో సన్మానాన్ని పొందిన ఆత్రేయ, కె. వి. రెడ్డి, నాగేశ్వరరావు, అంజలీదేవి గార్లు.

★ అదీ - ఇదీ ★

పెడల్పాటి తెర ఉండడంవల్ల ఒకమూల చూస్తుంటే మరోమూల కనిపించదు. ఈ యిబ్బందులను ముందు ముందు మరొక రకంగా పరిష్కరించడానికి అవకాశం లేక పోలేదు.

సినిమా స్కోప్ దృశ్యం మామూలుకంటె పెద్దదవడం మూలాన శబ్దగ్రహణంలో కొన్ని మార్పులు విధిగా చెయ్యవలసి వచ్చింది. తెరమీద ఒకమూల ఒక మనిషి, మరొకమూల మరొక మనిషి మాట్లాడు తున్నా రనుకోండి. శబ్దం తెర మధ్యభాగం నుంచి కాక ఆమూలనుంచి, ఈమూలనుంచి రావలసిన అవసరంఉంది. లేకపోతే అసహజంగా ఉంటుంది. దీన్ని డైరెక్షనల్ సౌండ్ (శబ్దంచేసే వస్తువు ఎక్కడఉంటే అక్కడి నుంచే శబ్దం వస్తున్నట్లు భ్రాంతి కలిగించడం) అంటారు. ఈ సమస్యను పరిష్కరించడానికి 'స్టీరియో ఫోనిక్ సౌండ్' పద్ధతిని కనిపెట్టారు. ఈ పద్ధతిలో మామూలుగా ఉండే సౌండ్ ట్రాక్ కాక మరికొన్ని ట్రాక్‌లు ఉంటాయి.

కాని సినిమాస్కోప్ ప్రదర్శనం మొదటిసారి చూసినప్పుడు, హాలులో స్పీకర్లు ఎక్కువ ఉండడంవల్లనో, లేక వాల్యూము ఎక్కువ చేయడంవల్లనో శబ్దం లోపభూయిష్ఠంగా ఉంది. దీన్ని సవరించుకుంటారని ఆశించవచ్చు.

'ట్వంటీయెత్ సెంచరీ ఫాక్సు' వారు మొదటగా అమల్లోకి తెచ్చిన సినిమాస్కోప్ టెక్నిక్‌ను 'ఎమ్. జి. ఎమ్' మొదలైన ఇతర హాలీవుడ్ కంపెనీలు కూడా అవలంబించి చిత్రాలు తీస్తున్నాయి. వీటి కనుగుణంగా ప్రపంచమంతటా స్టాండర్డు తెరలను తొలగించి పెద్ద తెరలను ఏర్పాటు చేసుకోవలసిన అవసరం త్వరలోనే రావచ్చు. ★

ఫిలిం కళలో కళాకారుడు

భగవాన్ లాల్వానీ

చిత్రకారుని భావ వ్యక్తీకరణకు కాన్వాస్ ఎటువంటి సాధనమో, సృజనాత్మకమైన ప్రతిభగల కళాకారునికి ఫిలింకూడా అటువంటి సాధనమే. సాధారణంగా చలనచిత్రాన్ని కళ అని వ్యవహరిస్తూంటాము. కాని చాలా దేశాల్లో చలన చిత్రం వ్యాపారపు సరుకుగా మాత్రమే చెలామణీ అవుతోంది.

మామూలుగా చిత్రకారుడు వ్యాపారపు లావాదేవీలతో ముడిపెట్టు కూర్చుని ఉండడు. కాని చలన చిత్రకారుడు విధిగా లక్షాధికారులయిన షరాబుల ప్రభావానికి లోబడిపోయి ఉంటాడు.

అయినా ఒకటిమాత్రం నిజం. ఆర్థిక లాభాలను తృణీకరించి కేవలం కళకే అంకితులైన కొద్దిమంది సృజనాత్మక కళాకారులు ప్రపంచంలో లేకపోలేదు. ఈనాడు చిత్ర నిర్మాణంలో అవలంబింపబడే టెక్నికల్ విధానాలలో అనేకం అటువంటి కళాకారుల చలవవల్లనే ప్రచారంలోకి వచ్చాయి.

హాలీవుడ్ "ఫ్యాక్టరీ"లలో భారీ ఎత్తున ఉత్పత్తి అయ్యే చిత్రాలనుగూర్చి చాలా విన్నాం, చదివాం. కాని హాలీవుడ్ పెత్తందారులు కొంత నిజాయితీ కలవారు కనుక తమ చిత్రాలకు కళాఖండాలని పేరుపెట్టేటంత సాహసానికి ఎన్నడూ పోలేదు. అంతేకాక, తమచిత్రాలపై పూర్వపు కళాకారుల ప్రభావంలేదని వాదించే అసత్యానికికూడా పాల్పడలేదు.

సాధారణంగా అమెరికన్ చిత్రం ఒక వ్యక్తి యొక్క కళాప్రతిభను సూచించే సృష్టి అయి ఉండదు. ఒక చిత్రం విడుదలయ్యేసరికి, దానికీ మొదట్లో దాని రచయిత వ్రాసిపెట్టినదానికీ ఎక్కడా పోలిక ఉండదు. ప్రేక్షకుల అభిరుచులను అనుసరించి అనేకమైన మార్పులు చేయబడతాయి. ట్రీట్‌మెంట్‌లో నిపుణుడైన స్టూడియో స్క్రిప్టు రచయిత ఈ మార్పులు చేస్తాడు. ఇంకా చేయవలసిన ఆఖరిమార్పులుంటే డైరెక్టరూ, ఎడిటరూ చేస్తారు. (ఈ డైరెక్టరనేవాడికి ఎక్కడలేని ప్రాధాన్యమూ, పబ్లిసిటీ లభిస్తాయి. ఎడిటర్ అంటే ఫిలిం సామ్రాజ్యంలో ఒక చిన్న చక్రవర్తి అన్నమాటే.)

కాని ఈ సూత్రం డి. డబ్ల్యు. గ్రిఫిత్స్, ఎరిక్ వాన్ స్ట్రాహీమ్, చార్లీ చాప్లిన్, ఆర్సన్ వెల్స్‌వంటి కళాకారులకు వర్తించదు. శక్తివంతములైన వారి ప్రత్యేక వ్యక్తిత్వాల ప్రభావం వారి చిత్రాలపై బలంగా ముద్రించబడుతుంది. వారి వ్యక్తిత్వాలు మామూలు బాక్సాఫీసు సంప్రదాయాలకు లొంగేవి కావు. అందువల్లనే చిత్రనిర్మాణానికి వారి చిత్రాలు పాఠ్యగ్రంథాలవలె ఉపయోగపడుతూ ఉంటాయి.

కాని హాలీవుడ్‌లో ఈ ప్రతిభావంతులకు సముచిత స్థానం ఎన్నడూ లభించలేదు. చివరిరోజుల్లో పనీ పాటా దొరక్క గ్రిఫిత్స్ అవస్థపడి మరణించాడు. ఎరిక్ వాన్ స్ట్రాహీమ్ నిర్మించిన మహత్తర చిత్రం "గ్రీడ్" ఈయేడు లండనులో తిరుగ ప్రదర్శించబడింది. ఆ సందర్భంలో ఆయన "హాలీవుడ్ నన్ను పెంటపోగును పారవేసినట్లు పారవేసింది," అన్నాడు. చార్లీ చాప్లిన్ ప్రస్తుతం అమెరికాను విడిచిపెట్టి, స్విట్జర్లెండులో హిమావృత పర్వతాల సీమలో ఏదో ధ్యానంలో మునిగిపోయినట్లు ప్రవాసజీవితం గడుపుతున్నాడు. ఆర్సన్ వెల్స్ కూడా ప్రవాసియై, యూరప్‌లోని ఫిలిం రాజధానుల్లో విచారంగా తిరుగుతున్నాడు.

ఈరోజున సెసిల్ బి. డిమిల్, ఫ్రాంక్ కాప్రా, జాన్‌ఫోర్డు, జాన్ హస్టన్ మొదలైనవారి పేర్లు తారక మంత్రాలవలె విన్పించవచ్చు. కాని చరిత్రలో వీరు బాక్సాఫీస్ దేవతా భక్తులుగానే మిగిలిపోతారు.

గడచిన రెండు ప్రపంచ యుద్ధాల మధ్య కాలంలో యూరప్‌లో ప్రతిభావంతులైన చలనచిత్రకారు లనేకులు వర్ధిల్లారు. వీరి చిత్రాలలో వారివారి వ్యక్తిగత కళాప్రతిభ ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఇందుకు ఉదాహరణలు: రష్యాలో ఐజెన్‌స్టీన్, పుడోవ్కిన్, హెన్రిక్ గాలెన్; ఫ్రాన్సులో జీన్‌రెనాయిర్, రీనీక్లెయిర్, జీన్‌కాక్టూ, డేనిష్ దేశీయుడైన కార్ల్ డ్రేయర్.

వీరిలో ఒక్క రష్యన్లు తప్ప మిగతావారందరూ హాలీవుడ్ భారీ వ్యాపార శక్తులను తీవ్రంగా ఎదుర్కొని పోరాడినవారే. ఈ కళాకారులలో కొందరు యూరప్ ఫిలిం రాజధానుల్లో నిలువ నీడ లేక డాలర్ భూతానికి దాసోహమని కూడా అన్నారు.

యుద్ధానంతరం యూరప్‌లో చిత్ర నిర్మాణం అమెరికన్ పద్ధతులకు లొంగిపోయినప్పటికీ వ్యక్తివాదంమీద నిలబడిన

కళాకారులు అక్కడక్కడ కనిపిస్తూనే ఉన్నారు. ఉరి శిక్ష విధానంమీద ఆలోచన రేకెత్తించే చిత్రం తీసిన ఆంద్రే కొయాట్, చిన్నపిల్లలపై యుద్ధఫలితాలు చూపిస్తూ చిత్రం తీసిన రీనీ క్లెమెంట్, నవ వాస్తవికవాదులైన రోజెలినీ, డీసికా, విస్కాంటీ మున్నగువారిని ఉదహరించవచ్చును.

ఇండియాలో చిత్రనిర్మాతల స్థితిగతులకు ఒక విశిష్టత ఉన్నది. వారి చిత్రాలు ఒకే మూసలో కరిగించి పోసినట్లనిపించవు. సాధారణంగా భారతీయ చిత్రం ఒకే వ్యక్తి యొక్క సృష్టిఅయి ఉంటుంది.

భారతీయచిత్రనిర్మాత కథ తనేవ్రాస్తాడు, డైరెక్టు చేస్తాడు, ఎడిట్ చేస్తాడు, దేవుడు మేలుచేస్తే హీరోగాకూడా నటిస్తాడు. అది తన జన్మహక్కు అని అతని భావన. ఈ విషయంలో అతడు పాశ్చాత్య చలనచిత్రకారుల్లోని ఉత్తమ ప్రతిభావంతులతో పోల్చదగి ఉన్నాడు. కాని ఇటువంటి హక్కుకోసం పాశ్చాత్య చలనచిత్రకారుడు ఏం త్యాగం చెయ్యమన్నా చేస్తాడని, అది అతనికి అందరాని గగన కుసుమమనీ భారతీయ నిర్మాత ఊహించనైనా లేడు.

భారతీయ నిర్మాతకు ఇంత స్వాతంత్ర్యం ఉన్నా, భారతీయ చిత్రాలలో నిజమైన కళాకారుడు కనిపించడు.

భారతీయ నిర్మాత సాధారణంగా డిస్ట్రిబ్యూటర్ల చేతులో కీలుబొమ్మ అయిఉంటాడన్నమాట నిజమే. డిస్ట్రిబ్యూటర్లు బాక్సాఫీసు తారలను, పేరుపొందిన సంగీత దర్శకులను, డైలాగ్ రచయితలను తీసుకోవాలని ఒత్తిడిచేస్తారు. ఈ ఒత్తిడి ఒకవేళ తప్పినా, ఎక్కువ వడ్డీలపై ఋణాలిచ్చే షరాబుల బాధ తప్పదు. కాని నిజంగా ఆలోచిస్తే ఈ సాధక బాధకాలు కథా సంవిధానాన్ని జాగ్రత్తగా పోషించకుండా అడ్డుపడతాయా?

భారతీయ చిత్రాల్లో సృజనాత్మక కళాకారుల ప్రభావచ్ఛాయలు ఒకప్పుడు కనిపించకపోలేదు. కాని ఆ కొద్దిమంది ప్రతిభా వికసించక ముందే మన చిత్రాల స్థాయి పడిపోవనారంభించింది. ఇంకా పడిపోతూనే ఉంది. దీనికి కారణం చిత్ర నిర్మాతల సాంస్కృతిక స్థాయి మాత్రమే అని చెప్పడానికి వీలులేదు. చిత్ర నిర్మాణంపట్ల మనవారికున్న దృక్పథమూ, అనుసరించే పద్ధతులూ ఇందుకు కారణాలు. టాకీలతోపాటు వచ్చిన ఒక అవలక్షణం పాటలు, నృత్యం లేకుండా చిత్రం తీయరాదన్న సూత్రం. ఈ సూత్రంనుంచి తప్పించుకోలేక బాధపడుతున్నది సృజనాత్మక కళాకారుడు.

చలనచిత్ర కళలో కొత్త ప్రయోగాలు చేయడానికి ఫ్రాన్సులో కొంతకాలం కిందట కొందరు పురోగామి కళాకారులు నిత్యమూ కృషిచేశారు. ఈ ప్రయోగాల వల్ల మంచి ఫలితాలు వచ్చి ఉండకపోవచ్చును కాని ఇప్పుడు మనకి కావలసింది అధిమానవు డనదగిన వ్యక్తి.

నృత్యమూ, సంగీతమే పరమావధిగా పెట్టుకున్న చిత్రాలు మన దేశంలో చాలా వచ్చాయి. ఇవి ఇక్కడితో ఆగితే బాగుండును. ('ఫిలింఫేర్ నుండి') ★

ఆంధ్ర నాటక కళా పరిషత్తు

బందరులో నాటకాల పోటీలు: బహుమాన ప్రదానాలు

(స్వకీయ విలేఖరి)

బందరులో ఈ నెల 7వ తేదీన ప్రారంభమైన ఆంధ్రనాటక కళాపరిషత్తు 18వ వార్షిక మహాసభలు 10వ తేదీ ఉదయం నాలుగు గంటలకు సమాప్తమయ్యాయి. పోటీలకు పంపబడిన 36 నాటకాలు, 32 నాటికలలో 6 నాటకాలు, 10 నాటికలు మాత్రమే ప్రదర్శనకు నిర్ణయించబడినవి. పోటీలలో పాల్గొన్న నాటికలూ, నాటకాలు అంతగా సభికుల ప్రశంస అందుకోలేకపోయినా యంటే రచనా స్థాయి తగ్గిఉండడమే కారణమని చెప్పవలసి వస్తోంది. ఎక్కువ భాగం అభ్యుదయ రచయితల రచనలే ప్రదర్శించబడినవి. పరిషత్తువారిచ్చిన బహుమతుల్లో కొన్నిటిని అంజలీదేవి, భానుమతి, సావిత్రి, పూర్ణిమ, రాజేశ్వరి, పువ్వుల అనసూయ, ఎ. నాగేశ్వరరావు గార్లు స్వంత ఖర్చులతో సప్లయిచేశారు. చల్లపల్లి రాజాగారు బహుమతుల నిమిత్తం పరిషత్తు వారికి వెయ్యి నూటపదహార్లు యిచ్చారు. ఈ సంవత్సరం మామూలుగా కార్యవర్గం ఎన్నుకోబడలేదు పాత కార్యవర్గమే అధికారంలో ఉన్నది.

సభకు బెజవాడ గోపాలరెడ్డిగారు అధ్యక్షత వహించారు. ఆంధ్ర నాటక రంగాన్ని పునరుద్ధరించడానికి ఒక నాటక ఎకాడమీని స్థాపించాలనీ, ఉత్తమ నాటకాలు ఎక్కువగా నిర్మాణం కావాలనీ ఆయన సూచించారు. సభను హైదరాబాద్ మంత్రి చెన్నారెడ్డిగారు ప్రారంభించారు.

బహుమతులు

ఉత్తమ నాటక ప్రదర్శన:— విజయవాడ ప్రజా నాట్యమండలివారి "ఆసామి".

ఉత్తమ నాటకరచన:—ఆచార్య ఆత్రేయ ("విశ్వశాంతి".)

ఉత్తమ నాటికా ప్రదర్శన:— మొదటి బహుమతి విజయవాడ నవ్యకళామండలివారి "నా బాబు". రెండో బహుమతి కాకినాడ రాఘవ కళాసమితివారి "వరప్రసాదం".

ఉత్తమ నాటికా రచన:— డా॥ కె. గంగాధర రావు ("బంగారు సంకెళ్లు".)

ఉత్తమనటుడు:—అంకరాజు శంకరరావు.

ఉత్తమనటి:—కొప్పరపు సరోజిని. నాటకాలలో ప్రత్యేక బహుమతులు:—"విశ్వశాంతి"లో నటించిన కె. వెంకటేశ్వరరావు, కొడాలి ఆదిశేషయ్య, ఎమ్. వి. సత్యనారాయణరావు; "సభ లేఖ" లో కె. సత్యనాయణ, వై. యశోదా దేవి; "ఆసామీ" లో సాజర్.

నాటికలలో ప్రత్యేక బహుమతులు:— ఉత్తమనటుడు "నాబాబు"లో కె. వెంకటేశ్వరరావు; ఉత్తమ నటి "వరప్రసాదం"లో శ్రీమతి సుబ్బులక్ష్మి;

"కోపం" లో నటించిన బ్రహ్మకోటి లక్ష్మీనారాయణ, "పెళ్లిచూపులు" లో ప్రసాదరావు, డిటెక్టివ్ లో సి. హెచ్. రామమోహనరావు, "అద్దంతోలు" లో శ్రీమతి సరస్వతి ఇతర బహుమతులు పొందారు. సెట్టింగులు, రంగస్థలం ఏర్పాట్లకు సికిందరాబాదు నవ్యకళా సమితివారికి బహుమతి ఇవ్వబడింది. ★

★ సినిమా వార్తలు ★

ప్రతిభావారి "రేచుక్క" నిర్మాణం శీఘ్రగతిని సాగుతున్నది. ఇప్పటికి సగందాకా తయారైంది లీల, ఘంటసాల, జిక్కి పాడిన అయిదు పాటలు రికార్డు అయినవి. అంజలీదేవి, ఎన్. టి. రామారావు, ముక్కామల, సదాశివరావు, శివరాం, జోగారావు, ఒక కొత్తనటి (ప్రమీల?) నటిస్తున్నారు. సుప్రసిద్ధ కథానికా రచయిత మల్లాది రామకృష్ణశాస్త్రి గారు మాటలు, పాటలు వ్రాశారు. పి. పుల్లయ్యగారు దర్శకులు సంగీతం అశ్వత్థామ, కళ ఎస్. వి. ఎస్ రామారావు, ఫోటోగ్రఫీ పి. ఎల్. రాయ్, స్టూడియో రేవతి.

* * *

ఈ నెల ఆఖర్లో "మనోహర" చిత్రాన్ని ఆంధ్రదేశంలో విడుదల చేయడానికి పూర్ణావారు నిశ్చయించినట్లు తెలుస్తోంది. ఆ



జనతా వారి "పరివర్తన" లో దొరస్వామి, నాగేశ్వర రావు, ఎన్. టి. రామారావు పెరుమాళ్లు, సావిత్రి, మాష్టరు నాగేశ్వర రావు.



పిమ్మట "బంగారు భూమి" కూడా విడుదల చేస్తారు. జూన్ నెలలో నాలుగైదు చిత్రాలు విడుదల కాగలవని వినికిడి. ఎ. వి. ఎమ్ వారి "సంఘం" (లడ్కీ) వీటిలో ఒకటి.

* * *

అంజలీవారి "అనార్కలీ" నాలుగో వంతు పైగా తయారైందని తెలుస్తోంది. కొత్తగా కన్నాంబను సలీం తల్లి జోధా భాయి పాత్రకు, రాజా మాన్‌సింగు పాత్రకు నాగయ్యను బుక్ చేశారు. లొకేషన్ షూటింగ్ కు ఈ నెలలో ఆగ్రా వెళదామని వీరు మొదట అనుకొన్నారు గాని అక్కడ ఎండల తీవ్రతవల్ల వాయిదా వేసుకున్నారు.

* * *

'వంగీయ ప్రగతి చలచిత్ర నాట్య సంఘం'వారు 1953 లో ఉత్తమ బెంగాలీ చిత్రంగా "షేషేర్ కవిత"ను, ఉత్తమ దర్శకుడుగా ఆ చిత్ర దర్శకుడు మధుబోస్ ను నిర్ణయించారు. ★

ఎ. వి. ఎమ్. వారి "సంఘం" లో అంజలీ దేవి, నాగయ్య.



"దిగినాను దిగినాను దివినుండి భువికి"
ఎ. వి. ఎమ్. వారి "సంఘం" లో వైజయంతంనుండి నేలకు జారినట్లున్న వైజయంతీమాల.

★ సీతాకోక చిలుక ★

(10-వ పేజీ తరువాయి)

అభిప్రాయాలు లేని వాళ్ళని అర్థం
చేసుకోవచ్చు
ఆశయాలు లేనివాళ్ళని జీవించడానికి
అనుమతించవచ్చు
వీరెండ కౌగొడుగు పట్టేవాళ్లని
ఎన్నడూ క్షమించలేను.
[గంట కొడతాడు.]

సీత :
బాబూ, ఏం సెలవు.

కొడుకు :
సెలవుల్లేని ఉద్యోగంలాగుంది నామనస్సు
ఏదీ ఆ మూడో అమ్మాయి
ఏదీ ఈపండు పుచ్చుకొని
నా జీవితాన్ని పండించే ఆషాఢ మేఘం

సేవకుడు :
ఎవరూ రాలేదండి
బయటెవరూ లేరండి.

కొడుకు :
నాన్నగారు ముగ్గురొస్తారని చెప్పారు
ఇద్దరు నా పరీక్షలో తప్పారు
ఏదీ ఆ మూడో అమ్మాయి
ఏది నా ఊహా సుందరి.

సీత :
ఇంకా రాలేదండి
చినబాబుగారూ ఆకలేస్తోంది
ఆపండు నాకిస్తారా అండీ.

కొడుకు :
ఇది పండు కాదు
నా హృదయం
ఇది ఆకలి తీర్చదు
కోరినది సమకూర్చగా.
సీతకా నీ కెందుకు
ఇంద్రజాలికుడవు కాకూడగా
నే కోరిన కన్నియ
కెందుకు తీసుకురాకూడదు
ద్వారబంధం ముందు నిలబడూ
రాగబంధాన్ని తీసుకురా.

సీత :
చిత్తం.

కొడుకు :
ప్రయాణం మొదలెట్టకూడదు
ప్రణయంగురించి తలంచకూడదు
ప్రయాణం మొదలెడితే
గమ్యాన్ని చేరుకోవాలి
ప్రణయం గురించి తలంచితే
ప్రేయసిని వరించాలి.
కణకణలాడే వింత చీకటి
మనసునిండా ఆవరించింది
నీ చంద్రముఖి నవ్వుల వెన్నెలతో
ఈ చీకటి తెల్లవారుతుంది
నీ పల్లవపాణి మృదుస్పర్శతో
ఈ హృదయం పల్లవిస్తుంది.
తల్లడిల్లే నా ఊహాలు చల్లబడతవి
నాభవిష్యత్తుని పంచుకొని
నాతో సమానంగా ఊపిరి పీల్చుకొని
నన్ను పరిపూర్ణుని చేయమని
నేను ఆహ్వానిస్తున్న సుందరి చిరునామా
ఏమిటి?
సాక్షిని ఏది? సఖి ఎక్కడ?

మూడవ. అమ్మాయి :
నమస్కారం.

కొడుకు :
మీకు నమస్కరించడానికి
నాకు మనస్కరించడంలేదు
అయినా నమస్కరిస్తాను,
ఎవరు మీరు?

8. అ :
సెలయేటిలో పడిఉంటే
గులక రాయిని ఎవరునీవారని
అడిగితే ఏమని చెపుతుంది
మసక చీకటిలో
రొజగాలిలో ఎగిరే
చిత్తుకాగితాన్ని ఎవరు నువ్వని
అడిగితే ఏమని చెపుతుంది
ఆకాశంలో పక్షులు కొడుతున్న
రెగిన గాలిపడగనీ
సరోవరంలో నీటిబుడగనీ
ఎవరు మీరని అడిగితే
ఏమని సమాధానం చెప్తాయి?

కొడుకు :
సమాధానం రాకపోయినా
ప్రశ్నించడం సహజం
ప్రశ్నించాక జవాబు
రాబట్టడం సైజం
ఎందుకొచ్చారు ఇక్కడికి?

8 అ :
పుష్పం ఎందుకు వికసిస్తుందో
పుష్పానికి తెలుసునా
గాలి ఎందుకు వీస్తుందో
ఎవరికి తెలుసు?
ఫ్యాక్టరీలలో చక్రాలలో చక్రం
తా నెందుకు తిరుగుతుందో
తనని తాను ప్రశ్నించుకోదు
తక్కిన చక్రాలతోపాటు
తనుకూడా తిరుగుతుంది
తతిమ్మా చక్రాలు విరిగినప్పుడు
తనుకూడా విరుగుతుంది.

కొడుకు :
సృష్టి ఎక్కడ మొదలయిందో
దృష్టికి అందకపోవచ్చు
మీ జీవనప్రయాణం ఏ స్టేషనులో
మొదలయిందో మీరు మర్చిపోయినా
ఇక్కడికి రావడానికి ముందు
ఎక్కడనుంచి బయలుదేరారు
ఇక్కడనుంచి మీరు
ఎక్కడికి వెళ్తారు.

8. అ. :
చీకట్లో బయలుదేరాను
వెలుగులోకి వెళ్ళాలనుకుంటున్నాను
విరోధంనుంచి విడివడ్డాను
స్నేహంలోకి పోవాలనుకుంటున్నాను.
ఒంటరిగా బయల్దేరాను
జంటని వెతుక్కోవాలనుకొంటాను
నిన్నటిదాకా జైల్లో ఉన్నాను.
ఇప్పుడే ఇలా వచ్చాను.

కొడుకు :
ఏమిటి మీరు చేసిన ఘోరం
ఏమిటి మీరు చేసిన నేరం

8. అ. :
అక్షరాలలో పరుషాలుండ కూడదన్నాను
ఆశయాల బియ్యంలో అవరోధాల మంటి
బెడ్డ లుండకూడదన్నాను
చూపు తిన్నగా ఉండాలన్నాను.
ఊపిరి పీల్చడం నేరం కాదన్నాను,
ఉద్దేశాలు సవ్యంగా ఉండాలన్నాను
ఎరువు తెచ్చుకున్న భావాలని
ఎరువుగా వాడి అభిప్రాయాలని
పండించ కూడదన్నాను.

కొడుకు :
మీరెవరో నా కుడిచెయ్యిలా గున్నారు
నా ఎడమకన్ను మీరైతే ఎంతో బాగుం
టుంది
నా హృదయం ఖాళీగానే ఉంది
అందులో మీరు......

8 అ :
జీవించడానికి
చైతన్యం కావాలి చలనం కావాలి.

కొడుకు :
నా హృదయంలో చైతన్యపు కను
లున్నాయి
నా మనస్సులో నిరంతరం చంచలనం
ఉంది
నా ఆలోచన జలపాతం
నా ఆవేదన అగ్నిపర్వతం

8 అ :
నా తెల్లకాగితం మనస్సుమీద
కుదురైన అక్షరాలు రాసేవాళ్ళెవరు
ఆ అక్షరాలకి అర్థం కల్పించే దెవ్వరు
నా హృదయం పీఠేలుకి
కమాను ఎవ్వరు? నాకు
కావలసిన దేమిటో మీకు తెలియదు.

కొడుకు :
ఏమిటి - ఏమిటి?
మీకు కావలసిన దేమిటి?

8. అ :
నా కాళ్ళకి బలం
నా కళ్లకి వెలుగు
నా హృదయానికి చోటు
కొడుకు :
అన్నీ ఈ ఫలంలోనే ఉన్నవి
ఇది స్వీకరించు
ఇది నా హృదయం.
8. అ :
అది మీ మది అయితే
అది నా ఎదలో స్వప్నం అయితే
స్వీకరిస్తాను ఇవ్వండి.
కొడుకు :
ఇప్పుడు నా కలకి ఆకారం వచ్చింది
నా ఆశకి చూపువచ్చింది.
నా గొంతుకలో గానం విచ్చింది
నా కళ్ళల్లో వసంతం వచ్చింది.
సేవకుడు :
సినబాబుగారో
మూడో అమ్మాయి నాన్న గారొచ్చారు
ఆరితో అమ్మాయిని తీసుకొచ్చారు.
ధనవంతుడు :
క్షమించాలి లేటయింది
అమ్మాయి ఏడువారాల నగలూ పెట్టుకోనడంలో
ఆలస్యమైంది. ఇదుగో అమ్మాయి
నాల్గవ. అ :
వందనం. మీకు అభివందనం.
ధనవంతుడు :
ఏరీ మీ నాన్న గారు.
కొడుకు :
నేలమాన్యంలో ఉన్నారు వారు
ఏల మీరుకూడా అక్కడికి వెళ్లకూడదు
ధనవంతుడు :
మా అమ్మాయిని కన్నారా చూసుకో నాయనా
నచ్చితే వెంటనే పెళ్లిచేసుకో
భరతనాట్యం నేర్పించాను.
నాల్గవ. అ :
భర్త ఉద్దేశాల తాళాలతో
భరతనాట్యం చెయ్యగలను.
ధనవంతుడు :
సంగీతం నేర్పించాను.
నాల్గవ. అ. :
నాథుడి నిర్దేశాల శ్రుతుల్లో
అభిప్రాయ భేధాల అపశ్రుతులు
రాకుండా లేకుండా పాడగలను.
ధనవంతుడు :
అమ్మాయిని చూడు
అమ్మాయి నగలు చూడు
కొడుకు :
క్షమించాలి. శమించాలి.
నా ఉత్తరంమీద చిరునామా
నేనప్పుడే లిఖించుకొన్నాను
నా భవిష్యత్కాలాన్ని
దుకూలంగా అప్పుడే ధరించుకొన్నాను.
నా చేతిలోని జీవఫలాన్ని
నాభాగ్యదేవతకి సమర్పించుకొన్నాను.
తండ్రి :
ఏమిట్రా అబ్బాయి ఎంచుకొన్నావూ ?
రండి, రండి, నేలమాన్యంలోంచి బయటికి రండి
మాఅబ్బాయి ఎవర్నో ఎంచుకున్నాడు.
ఒకటో. అ :
నేలమాన్యం బాగుంది.
రెండవ. అ :
అందులో చీకటి మరీ బాగుంది
శ్రీమంతుడు :
మా అమ్మాయిని చేసుకొంటావా నాయనా
తండ్రి :
ఎవరమ్మాయిని ఎంచుకొన్నావురా
ఎవరు నీజీవితాన్ని పంచుకొంటున్నారు
కొడుకు :
ఎవరమ్మాయో నాకు తెలియదు,
ఈమె నా పంచప్రాణాల పరసి
ఈమె నా భూతభవిష్యద్వర్తమాన ప్రేయసి.
తండ్రి :
ఎవరీ అమ్మాయి?
ధనవంతుడు :
అలంకారాల్లేవే?
ఒకటో అ :
నాజూకు లేదే.
రెండవ. అ :
అదే ఫేషనేమో.
నాల్గవ. అ :
భరతనాట్యం వచ్చా.
తండ్రి :
అమ్మాయీ ఎవరూ మీ తండ్రి?
మూడవ. అ :
నాగలి నా తండ్రి.
తండ్రి:
ఎవరు మీ తల్లి?
మూడవ. అ :
సృష్టి నాతల్లి.
తండ్రి :
ఏమిటి నీ ఆస్తి.
మూడవ. అ :
ఎవరికైనా ఆస్తి ఏముంటుంది
సంగీతంలో సప్త స్వరాలూ
సాహిత్యంలో ఏభైరెండు అక్షరాలు
తండ్రి :
ఏమిటి నీ వృత్తి.
మూడవ. అ :
గుణింతం నావృత్తి.
తండ్రి :
తప్పుపని చేశావురా అబ్బాయి
పప్పులో కాలువేశావు
నేను చెప్పిన ముగ్గురు అమ్మాయిల్లో
ఈ అమ్మాయి చేరదు.
ఆ అమ్మాయి చేతిలోని పండు లాక్కో
ఈ ముగ్గురిలో ఒకర్ని ఎంచుకో.
కొడుకు :
సముద్రంలో కలిసిపోయిన నదిని
వెనక్కి మళ్ళించడం కష్టం
అర్పించిన హృదయాన్ని
తీసుకోడం అసాధ్యం
ఇచటకొచ్చిన మూడవఅమ్మాయి ఈమె
నా జీవితంలోని మూడవకాలం ఈమె
నా ఒకటవకాలం అనగా గతం మీరు
నా రెండవకాలం అనగా ప్రస్తుతం నేను
మీరు ఇవ్వమన్న ఫలం
నా భావికి అంకితం.
తండ్రి :
నువ్వు స్వీకరించిన లోకం
అంగీకరించవద్దా?
నీ కలలు నీవైనా
నీ కన్నీళ్లుమట్టుకు నావి
నీ వెలుతురు నీదైనా
నీ చీకటిమట్టుకు నాది
మూడవ. అ. :
మానవగడియారానికి ఒక్కసారికీ చాలు
అది మీరు
కలకాలం మెయిన్‌స్ప్రింగ్ కావాలి
అది నేను
మగవాడి జీవితం ఒక సైకిలు
దాని ముందు చక్రానికి బ్రేకు తండ్రి
వెనుక చక్రానికి బ్రేకు భార్య
శ్రీమంతుడు .
రంగుని ప్రేమిస్తా డనుకొన్నాను.
ధనవంతుడు :
బంగారాన్ని వరిస్తా డనుకొన్నాను.
రెండవ. అ. :
వ్యాపార పత్రికను నన్ను
వరించక తప్పదనుకొన్నాను.
ఒకటో. అ. :
సున్నితంగా లేని - ఖరీదు లేని
కళ్ళులేని దాన్ని వరించాడు
సీతాకోక చిలుకలం ముగ్గురం
ప్రీతితో ఒకర్ని వరించమన్నప్పుడు
గొంగళీ పురుగుని ఎన్నుకున్నాడు
గొంగళీ పురుగుని ఎన్నుకున్నాడు.
కొడుకు :
మా నేలమాన్యంలో మరణించినా
మాట్లాడే చచ్చిపోయిన చిలకకన్నా
వింతరకం చిలుకలు మీరు
షాపన్లు చెప్పే పలుకులు
పలుకుతారు మీరు.

సీతాకోక చిలుక

మీరు సీతాకోకచిలుకలు కారు
మీ రంగులు సహజమైనవి కావు
మీ భావాలు నిజమైనవి కావు.
నా గొంగళీ పురుగు నాకు చాలు,
నా జీవితపత్రాన్ని ఆహారంగా
స్వీకరించింది
నామీద తన జీవితం గూడుకట్టుకొని
నన్ను అంటి పెట్టుకొని
నా బ్రతుకులో నిద్రపోయి
నా స్వప్నాలలోకి సీతాకోక చిలుకగా
ఎగిరి ఎగిరి ఆనందాన్నివ్వగలిగే
ఈ గొంగళీ పురుగు నాకు చాలు
ఇందులోంచే రాగలదు నిజమైన నిజం.

సేవకుడు :
బాబుగారూ, బాబుగారూ,
మన నేలమాన్యంలో చచ్చిపోయిన
చిలక మళ్ళా బతికింది.
దాని ముక్కుతో ఈబల్ల చెక్కమీద
రాసింది చూడండి.

ఒకటో. అ :
ఏం రాసింది.

రెండో. అ :
ఏం రాసింది.

శ్రీమం :
మాట్లాడే చిలక రాతకూడా
రాస్తుందా, ఏం రాసింది.

తండ్రి :
మరణించినా మాట్లాడే
మా రామచిలక
మళ్ళా బతికి రాసిన మాటలో
రెండే అక్షరాలున్నాయి

కొడుకు :
మొదటి అక్షరం బ్రే

మూడవ. అ. :
రెండవ అక్షరం ము.

తండ్రి :
కూడబలికి చదివితే
జీవితం అని అర్థం.

—[ఆలిండియా రేడియో ప్రసారితం]

(ఈ ఊహాకి ఊపిరిపోసింది క్రిస్టఫర్ ఫ్రై. అతడి ఋణానికి ఈ నాటిక ప్రోనోటు.)

★

బ్రదుకు విలువ

(11-వ పేజీ తరువాయి)

"కారుమీద ఇంటికి రావమ్మ" అంది ప్రేమకుమారాలు ఆ శ్రామికాంగనతో. శ్రామికాంగన "ఎందుకులెండి! తమ రుండండి! ఇంకా గేటుకాడ బిళ్ళ ఇవ్వాలి." అంది.

"నేనిస్తానులే ఆబిళ్ళ ఇల్లా ఇవ్వు!" అని తీసుకుని కార్మికాంగనను తన కారెక్కాది చుకు గేటు కీపర్ను పిలిచి బిళ్ళయిచ్చింం అవచ్చినఆమె. "తమదా ? ఆమెదా?" అని అడిగేడు గేట్ కీపరు బిళ్ల తీసికొంటూ. వానికి జవాబు చెప్పకుండానే "కారు" గేటావలకువెళ్ళి రోడ్డెక్కి బంయి మంది.

రోడ్డుమీద 'బెగ్గర్' "అమ్మలూ అమ్మలూ" అంటూ అరుస్తూనే వున్నాడు. 'కారు' వాణ్ణి, వాడు నిలుచున్న చెట్టును కూడా దాటిపోయింది. "వీక్ ఎండ్ రౌండ్ ఆఫ్ రోజు నేడు" అని కారులోంచి కార్మికాంగన వేసిన కేక ఎవరికీ వినిపించనే లేదు. క్రొత్తనోట్లు గుది గుది ఆ కార్మికాంగన చేతిలో ఆలా మాయకుండానే వున్నాయి—కారు వెళ్ళి అమాంతంగా ఎదరవస్తూవున్న లారీకి తగిలి, రోడ్డుకొత్తటుగా లారీయున్నూ, మరోతట్టుగా ప్లైజర్ కారున్ను పడి వూరుకున్నాయి. అందులో మనుష్యులు ఇందులో మనుష్యులు కూడా డ్రైవర్ల సమేతంగా అంత దూరంలో పడి ప్రాణాలను గోల్పోయారు.

"ఎంతలో ఎంతపని జరిగిందీ" అని అనడానిక్కూడా అక్కడ రోడ్డుమీదున్న ముష్టివాడొక్కడూ కదలకుండా నోరు మెదపకుండా చెట్టు క్రింద నిశ్చేష్టుడై పోయాడు. కంపెనీ ఆఫీసుయొక్క దిడ్డికంత ఎంతగా ఎటు జరిపిచూచినా ఈ ముష్టివాడే కనబడ్డాడుగాని మరో దృశ్యం కానరాలేదు. ★

గ్రంథస్వీకారము

అనంతం :—గేయసంపుటి; రచయిత రాంషా; ప్రత్యర్థులు (ప్రతులు కలయువారు) విశాలాంధ్రప్రచురణాలయం, విజయవాడ-2 అని గాని, కళాకేళీ ప్రచురణాలయం, శామల్ కోట అని గాని వ్రాయవచ్చును.

అవతారికయందే రచయిత "కావ్య దూరులైన నగరులారా! మీ ఆత్మల్ని క్షాళనం చేసుకొండి. ఈ నవవేదం పఠించండి!" అని హెచ్చరించిరి 'నగరు' లనుటలో వారి అభిప్రాయము 'నగరపుత్రు'లై యుండనోపు. నగరపుత్రులు సాగరు లగుదురుగాని నగరులు కానేరరు. తమ కావ్యావతరణము గంగావతరణము వంటిదనియు, తమ రచన వేదతుల్యమనియు రచయిత భావించుచున్నారు.

ఓపికవహించి కావ్యము చదువువారు రచయిత భావముతో నేకీభావ మొందుట కష్టము. విస్సన్న చెప్పినదే వేదమైననాడు ఈకావ్యము నవవేదము కావచ్చును. 'ప్రతిభావ్యుత్పత్తులలో ప్రతిభగరీయసి' యని విశ్వనాథ సత్యనారాయణ గారొకపరి నుడివి యుండిరి. ఈ యువకవిలో ప్రతిభకంటె సోత్కర్షయు, వ్యుత్పత్తికంటె ఉత్పత్తియు నధికముగ గానవచ్చును

వీరి కావ్యమునుండి రెండు మచ్చుతునకలు:—

గోదావరిని సంబోధించి ఇట్లను చున్నారు :

"నీనీలి నీలాల నినదించు తరగ
చిత్రించు చిత్రాల చిత్రకౌగులకు.
నీ చిరుతరగల నృత్య విన్యాస
మ్మాన శేషునిభంగి నడకించనీవె.
నీ చిరుతరగలన్ నినదించురవళి
నాలోన లోలోన నడయాడనీవె."

సీతాకోక చిలుకతో ఇట్లనుచున్నారు :

ఓ సీతకోక చిలుకా !
నా మూగలోని పలుకా !
పరుగిడుచు పారిపోకే
నా జీవలోక విదితా !"

ఈ యువకవి కావ్యరచనోద్రేకములో "నిత్య కౌగిలి" "కవి హృదయము" "ధృవనక్షత్రము" "గరుడవర్ధనగములు" వంటి ప్రయోగములు చేయుటకు వెనుదీయరు.

ప్రారంభములోనే రచయిత "సుకవులు కావ్యప్రయోజనాల విస్మరించి" అనంతమైన కావ్యప్రవాహమును "కలుషితం చేశా"రని సుకవినింద యొనర్చియుండిరి. కావ్యప్రయోజనము మాట దేవు డెరుగును, అసలీ కావ్యభాగములందు ప్రతిపాద్య విషయ మేమో బోధపడుట లేదు.

మొత్తముమీద ఈ గ్రంథమునందు రచనకంటె ముద్రణ, అంతకంటెను చివరి పుటపై ముద్రింపబడిన కవి ఛాయాచిత్రముద్రణ ఆకర్షణీయముగ నున్నదని చెప్పవచ్చును ★

"...In India's Life And Part of it"

అనేక సంవత్సరాలుగా భారతదేశంలో పెలకొని, మారుమూల గ్రామాలకు సైతం కిరసనాయిల్, పెట్రోలు వగైరా నిత్య జీవితావసరాలను అందచేస్తున్న బర్మాషెల్ కంపెనీవారు భారతదేశంలోని వివిధజాతుల వారి ముఖలక్షణాలు వివరిస్తూ కొన్ని చిత్రాలు వేయించి, లోగడ వాటిని పత్రికా ప్రకటనల్లో వినియోగించారు. ఆ చిత్రాలన్నిటినీ చేర్చి యిప్పుడు చిన్న పుస్తకంగా ప్రకటించారు. ఆంధ్ర మరాఠీ, మోప్లా, భూటియా, కాశ్మీరు, లంబాడీ వగైరా జాతుల సుందరుల చిత్రాలు, ఆ జాతుల వారి ప్రత్యేక లక్షణాల వివరణలు ముచ్చటగా ముద్రించారు. ★

విజ్ఞానవీధులు

185. పరమాణుశక్తి ఎట్లు ఉత్పన్నమౌతుంది!

పరమాణుకేంద్రకంలో న్యూట్రానులు, ప్రోటానులు ఉన్నాయికదా! న్యూట్రానులు వైద్యుతీయంగా తటస్థస్థితిలో ఉంటాయి; ప్రోటానులు ధన విద్యుత్తుతో కూడుకొన్నవి. ఒకేమోస్తరు విద్యుత్తును కలిగియున్న కణాలు కొన్ని ఒకచోట నున్నపుడు అవి పరస్పరము తిరస్కరించుకొంటాయి. కాని పరమాణుకేంద్రకాలలో నున్న ప్రోటానులు అన్నీ ఒకేరకపు విద్యుత్తుతో కూడుకొన్నవైనప్పటికీ ఎందుచేత తిరస్కరించుకొనడంలేదు ? అవి దూరదూరంగా పోకుండా ఒకేచోట, చాల తక్కువ ప్రదేశంలో, ఏవిధంగా గట్టిగా బంధింపబడి యున్నాయి? పరమాణుకేంద్రకంలో ఏదో మహత్తరమైనశక్తి దాగియుండి పరమాణుకేంద్రకంలోని ప్రోటానులను న్యూట్రానులను గట్టిగా బంధించియుండాలి. ఆ శక్తినే పరమాణు కేంద్రకశక్తియనీ (*Nuclear energy*), పరమాణుశక్తి (*Atomic energy*) యనీ పేర్కొంటారు. ఈశక్తి మనకు స్వాధీనమైనట్లయితే దానిచేత ఎంత చాకిరీ అయినా చేయించుకోవచ్చును. ఆ శక్తిని స్వాధీనం చేసికోవడం ఎట్లాగ అనేదే సమస్య!

పరమాణుశక్తి పరమాణు కేంద్రకంలో బంధింపబడి యుంది. ఆ కేంద్రకాన్ని బ్రద్దలు కొట్టినట్లయితే ఆ శక్తి విడుదలౌతుంది. పరమాణుకేంద్రకంలో ప్రోటానులను న్యూట్రానులను (ఎక్కువ సంఖ్యలో) కలిగియున్న యురేనియం థోరియం వంటి కొన్ని పరమాణుకేంద్రకాలు తమ ఆ స్థితిలో స్థిరంగాఉండలేక తక్కువసంఖ్యలో ప్రోటానులు న్యూట్రానులు గల పరమాణు కేంద్రకాలుగా మార్పు నొందడానికై తమంత తామే విచ్ఛిన్నమౌతుంటాయి. పరమాణుకేంద్రకం బ్రద్దలు కొట్టడానికి అసాధ్యమైనది కాదనే విషయం దీనినిబట్టి మనకు తెలుస్తుంది. అయితే పరమాణు కేంద్రకాలను బ్రద్దలు కొట్టడానికి ఎట్టి గుండ్లను ఉపయోగించాలి? పెద్ద కోటగోడను దేనినైనా బ్రద్దలుకొట్టడానికి చిన్న రాతిముక్కను దానిపైకి విసిరితే సరిపోదు. ఆ విధంగానే చిన్న వల్లపూసను బ్రద్దలు కొట్టడానికి పెద్ద బండరాయిని పెల్లగించుకొని వచ్చినా పనికిరాదు. ఏదైనా ఒకవస్తువును బ్రద్దలు కొట్టడాని కుపయోగించే సాధనం ఆ వస్తువుకు తగిన పరిమాణం గలదియై యుండాలనిబట్టిదీనిని మనం గ్రహించవచ్చు. అందువలన పరమాణు కేంద్రకాన్ని బ్రద్దలు కొట్టడానికుపయోగించే గుండ్లు పరమాణుకేంద్రకం ఏపరిమాణంలోఉంటుందో ఇంచుమించు ఆ పరిమాణంలోనే ఉండాలనీ, ఎక్కువ శక్తిమంతములై కూడా ఉండాలనీ వేరే చెప్పనక్కరలేదు. ఎలక్ట్రానులు పరమాణు కేంద్రకాలకంటే చాలా అల్పమైన కణాలు కావడంవలన పరమాణు కేంద్రకాన్ని బ్రద్దలు కొట్టడానికై వాటిని ఉపయోగించినా ఫలితం ఉండదు. ఇక ప్రోటానులు న్యూట్రానులు పరమాణు కేంద్రకంతో పోల్చదగిన పరిమాణాలను కలిగియుండడం వలన పరమాణు కేంద్రకాన్ని బ్రద్దలు కొట్టడానికై వానిని గుండ్లగా ఉపయోగించవచ్చును.

ప్రోటానులను కొన్ని మూలద్రవ్య పరమాణు కేంద్రకాలపైకి పంపి వానిని బ్రద్దలు కొట్టడంలో శాస్త్రజ్ఞులు కృతకృత్యులైనారు. కాని ప్రోటాను ధనవిద్యుదావేశితం కావడంవలన ధనవిద్యుదావేశితమైన కేంద్రకం దానిని తిరస్కరిస్తుంది. కాబట్టి ప్రోటానును పరమాణు కేంద్రకంపైకి ఎక్కువ శక్తితో ప్రేల్చవలసియుంది. అట్లుగాక వైద్యుతీయంగా తటస్థస్థితిలో నున్న న్యూట్రానులను గుండ్లగా ఉపయోగించినట్లయితే ఏవిధమైన అడ్డూలేకుండా అవి పరమాణు కేంద్రకంలోనికి దూసుకొని పోగలవు. అందుచేత పరమాణు కేంద్రకాలను బ్రద్దలు కొట్టడానికి ప్రోటానులకంటె న్యూట్రానులు అనువైన గుండ్లనడానికి సందేహం లేదు.

తమ కేంద్రకంలో ఎక్కువ సంఖ్యగల ప్రోటానులు న్యూట్రానులు ఉన్న యురేనియంవంటి ఒక మూలద్రవ్యంయొక్క కేంద్రకం పైకి ఒక న్యూట్రానును పంపినట్లయితే ఆ న్యూట్రాను ఆ కేంద్రకంలోకి చొచ్చుకొనిపోయి దానిలో లీనమైపోతుంది. సుంభనంగా కాలక్షేపం చేస్తున్న పెద్ద కుటుంబంగల ఒక సంసారి యింటికి అకస్మాత్తుగా చుట్టాలు వచ్చిపడితే ఆ సంసారంయొక్క ఆర్థికస్థితి తారుమారై చివరకా సంసారమే విచ్ఛిన్నమైపోతుంది. అదేవిధంగా అసలే బరువుగా ఉండి, ఎప్పుడు ముక్కలవడమా అని ఎదురుచూస్తున్న యురేనియం కేంద్రకంలోనికి న్యూట్రాను చేరడంతో ఒక విధమైన సంక్షోభం దానిలో ఏర్పడగా దాని ఆకారం వైకల్యం పొందుతుంది. జిడ్డుగానున్న తలంమీద నీటిచుక్కను వేసినట్లయితే అది చుక్కగా గుండ్రని బిందువుగా ఏర్పడుతుంది. ఆ బిందువు మీదే చిన్నచిన్న నీటిచుక్కలను రాల్చినట్లయితే ఆ బిందువు క్రమంగా పెద్దదై చివరకు ఒక మితిని దాటిన తర్వాత ఇంచుమించుగా సమానమైన రెండు ముక్కలుగా చీలిపోయి రెండు బిందువులుగా తిరిగి ఏర్పడుతుంది. అదే మోస్తరుగా న్యూట్రాను ప్రవేశించడంవలన సంక్షోభాన్ని చెంది వికార రూపాన్ని పొందిన యురేనియం కేంద్రకం చివరకు ఇంచుమించు సమానమైన రెండు ముక్కలుగా బ్రద్దలౌతుంది; రెండు మూడు నలుసులు కూడా అప్పుడు ఏర్పడవచ్చు. హెచ్చు పరిమాణంలో పరమాణుశక్తివిడుదలౌతుంది. ఈ రెండు ముక్కలు రెండు పరమాణు కేంద్రకాలై ఉంటాయి. ఆ నలుసులు న్యూట్రానులు. ఈవిధంగా యురేనియం కేంద్రకం ఇంచుమించుగా సమానంగా ఉండెడి రెండు ముక్కలుగా బ్రద్దలు కావడాన్ని విదళనము (*Fission*) అని వ్యవహరిస్తారు.

యురేనియమ్ కేంద్రకము విదళనము పొందినపు డేర్పడిన రెండు శకలల యొక్కయు, నలుసులయొక్కయు మొత్తము ద్రవ్యము యురేనియమ్ పరమాణు కేంద్రకము యొక్కయు, దానిలో ఇరుక్కొన్న న్యూట్రాను యొక్కయు మొత్తం ద్రవ్యం కంటె సామాన్యంగా కొంచెం తక్కువగా ఉంటుంది. లుప్తమైన యీ ద్రవ్యమే రూపాంతరాన్ని పొంది శక్తిగా ప్రత్యక్షమౌతుంది. అదే మహనీయమైన పరమాణు శక్తి. ఏటంబాంబు ప్రేలడానికి కారణభూతమైన శక్తి యిదే.

—అనంత్

చిట్టిప్రశ్నలకు జవాబులు

పొండి వెంకట వాసుదేవరావుగారు, చెన్నపట్నం.

—మెదడు అన్నది శరీరములోని స్పర్శ నాడులూ, ప్రవర్తక నాడులూ చేరే కేంద్రము అని చెప్పవచ్చును. మానవునిలో ఈ నాడులు కొన్ని వెన్నుపాములో కూడా చేరును గాని ముఖ్యమైనవి మెదడులోకే చేరును. జంతువులకన్నిటికీ వాటి బరువుకి తగిన మెదడు ఉండదు. అందువల్లనే అవి మానవునికంటె మందమతులు. మెదడు బరువునకునూ శరీరపు బరువునకునూ గల నిష్పత్తి తగ్గినకొద్దీ తెలివితేటలు తగ్గిపోవుచుండును. ఈ నిష్పత్తి తగ్గితగ్గి ఎమీబాలలో అసలు మెదడన్నదే లేకుండా పోతుంది

చెట్లకు నాడులున్నాయన్న సంగతి తెలిసింది. ఈ నాడులు ఒకచోట చేరిన సంగతి ఇకముందు కనిపెట్టాలి.

—చెట్లు బాధపడతాయన్న సంగతిని జగదీశచంద్రబోసు నిరూపించినారు బాధను వహించునవి నరాలు లేక నాడులు. అంటే చెట్లకు నాడులున్నాయన్న మాట.

* * *

ఆర్. యస్. యస్. వాసగారు, బరంపురం.

—మన ఇళ్లలోని రేడియో సెట్లులు రేడియో స్టేషనునుండి బయల్వెడలు రేడియో తరంగములనుపట్టే విధముగానే ఓడలూ, మోటారులూ, రైళ్లూ, ఏరోప్లేనులూ వంటి వాహనాలలోని రేడియో సెట్లులు కూడా పట్టుకుంటాయి. రేడియో సెట్టుయొక్క గమనమువల్ల, పట్టుబడే రేడియో తరంగాల వేగము మారనే మారదు. కనుకనే రేడియో ప్రోగ్రాములో మార్పులుండవు. రేడియో తరంగాలకు తరంగాయతి (*Wavelength*) తరచుదనము (*Frequenecy*) అన్నవి ప్రత్యేకగుణములు. తరచుదనము రేడియో స్టేషనులో నిర్ణయమౌతుంది రేడియో తరంగాయతి సెట్టు కదలికవల్ల మారదు. (ఇవే శబ్ద తరంగాలైతే ఈ తరంగాయతి మారుతుంది.)

* * *

పేతగాని డేనియల్ గారు, కొల్లిపర

—సూర్యుని కిరణాలలో ప్రాణికోటికి అపాయము కలిగించే శక్తులు లేవు. అయితే సూర్యుని వెల్తురులో కంటికి వెల్తురుగా కనపడని అతినీలలోహితకిరణాలు కొద్దిగా ఉన్నవి. వీటిని మనభూమిని చుట్టివుండే గాలిలో పై పొరలలో వుండే ఓజోను అనే వాయువు చాలామట్టుకు పీల్చుకుంటుంది. అందువల్ల ఈ కిరణాల అపాయము భూలోకవాసులైన ప్రాణులకు తప్పింది.

* * *

వి. విశ్వనాథశాస్త్రిగారు, వినుకొండ.

—సూర్యుడినుంచి మనకి వేడిమి ఎలాగ వస్తున్నదీ? అంటారా. మనవిచేస్తాను. సరస్సులోని నీటిమీద రాయి వేస్తే రాయివల్ల కలిగే కలత తరంగాలుగా ఒడ్డుకి చేరడము చూచివుంటారు మీరు. నీటిపైనగల పల్చని (రబ్బరు పొరవంటి) పొరవల్ల తరంగాలు ఒడ్డుదాకా వస్తాయి. మనము మాట్లాడేటప్పుడు గాలిలో తరంగాలు పుట్టి వినేవారి కర్ణభేరికీ లోచెవికీ అందుతాయి. అదే శబ్దము అంటాము.

వెల్తురు కూడా తరంగాలవల్లనే వ్యాపిస్తుందనీ ఈ తరంగాలు ఈథరు అనే సర్వవ్యాపక పదార్థముద్వారా సాగిపోవునని క్రీ. శ. 1900 వరకూ శాస్త్రజ్ఞులు నమ్మినారు. అయిన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతము వచ్చి ఈథరును విధ్య అంది 'అవకాశము'ద్వారా వెల్తురు అందుతోంది అంటున్నారు నేడు. అవకాశమంటే వట్టి బయలు. వెల్తురు అందుతున్నమాట మాత్రం నిజం. అది గాలివల్ల కాదు. ఈథరువల్ల అని అనుకున్నారు. అదీ కాదు. అయితే దేనివల్ల? సూర్యుడికీ మనకీ మధ్య వట్టి అవకాశము ఉంది. దానిద్వారా అందుతున్నాయని అనడముకంటె వేరు గతి లేదు.

—అయస్కాంతపు రెండు ధ్రువముల నడుమనూ, విద్యుత్తు ప్రసరించే తీగను ఉంచితే అయస్కాంత శక్తి ఆ తీగను తోసేస్తుంది ఒక గోలరులాంటి సాధనము మీద తీగను చాలా మారులు పొడ్డాగువా చుట్టి, ఈ 'గోలరు'ను (దీన్ని ఆర్మేచరు అంటారు) అయస్కాంతపు ధ్రువముల నడుమ నమర్చి, తీగలద్వారా విద్యుత్తు పంపుతారు. ఒక తీగ తొలగిపోవడముతో రోలరు తిరిగి రెండో తీగ దాని స్థానానికి వస్తుంది. అదీ తొలిగి ఇంకొకటి, ఇలాగ తీగల్ని అయస్కాంతము నెట్టుతున్నకొద్దీ రోలరు తిరుగుతుందీ, రోలరు తిరుగుతున్నకొద్దీ తీగలు అయస్కాంతపు క్షేత్రములోకి వస్తూఉంటాయి. తీగలలోనుంచి విద్యుత్తు ఆపేస్తే, రోలరూ, దానితో కలిపిన ట్రాము చక్రమో, ఫేక్టరీ చక్రాలో, ఫాను ఆకులో ఆగిపోతాయి.

—నీటి కణములకు పరస్పరాకర్షణ కలదు. ఉపరితలముమీది నీటి కణములు లోపలి కణములవల్ల లాగబడి కిక్కిరిసి ఉంటాయి. గాలికి ఈ ఆకర్షణ తక్కువ. కనక గాలికి ఉపరితలమంటూ ఉండదు.

> "అమ్మగారూ! నేను హార్మోనియం రిపేరు చేస్తానండి!"
>
> "హార్మోనియం రిపేరు చేస్తావా? నిన్ను రమ్మని నేనేమీ కబురు పెట్టలేదే!"
>
> "మీరు కాదు లెండి. మీ పక్కయింటివాళ్లు కబురు పెట్టారు,-మీ హార్మోనియం రిపేరు చెయ్యమని!"


—మానవులు నిప్పునూ ఉప్పునూ మొదట కనుక్కున్న కాలములో పేరులు గాని, రాతలు గాని నేర్చిఉండరు. ఇప్పుడు వారెవరో చెప్పడము ఎవరితరమూ? నిప్పును అడవులలో బయలుదేరే దావాగ్నినిబట్టి కనుక్కొని వుంటారు. చెట్టూ చెట్టూ రాపాడి, నిప్పు పుట్టుతున్నదని చూచినతర్వాతనే 'అరణి' మథించడము నేర్చిఉంటారు.

—యుద్ధకాలములో రంగములో పనిచేసే సోల్జరులకు మామూలు ఆహారము తీసుకోడానికి అవకాశము చాలదని ఏవో మాత్రల రూపంలో విటమినులూ, ఇత్యాది ఇచ్చారని వింటాము. ఇది "ఆకలి లేకుండా" చేసే సాధనమే కాదూ. మనము బతికి ఉండాలంటే, ఊపిరితిత్తులూ, గుండె, మెదడూ వంటి అవయవాలు పనిచెయ్యాలి. వాటికి మద్దత్తు ఆహారము. మద్దత్తు లేనిదే మెషీనే పని చెయ్యదు. మనిషి ఎలాగు చెయ్యగలడూ?

—మెఱుపు మెఱిసినప్పుడు రేడియో స్టేషనులో ప్రసారము చేసే తరంగాలవంటివే అవకాశములో పుట్తాయి రేడియో సెట్టు వాటిని గ్రహించుకుని గరగరమనే శబ్దముగా వినిపిస్తుంది.

—'ఆకాశము అనే నీలికప్పు' నడినెత్తిన దగ్గరగానూ దూర భూరేఖ కడ దూరముగానూ కనపడుతుంది నిజమే దూర భూరేఖకీ మన కంటికీ నడుమ చాలా వస్తువులు అక్కడక్కడ భిన్నదూరాలలో వుంటాయి కనక దూరప్రమాణము మనకి తెలుస్తుంది. ఈ వస్తువుల కన్నిటికీ అవతల వుంటుంది ఆకాశము. అయితే తలఎత్తి నడునెత్తి ఆకాశాన్ని చూస్తే మధ్యన ఏదీ లేదుగదా? అందువల్ల ఈ దూరము తక్కువలాగ కనపడుతుంది. ★

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu ChettySt, Madraas



రాష్ట్రపతి భవనోద్యానం

ఫొటోలు : జి. సత్యారావు, విజయవాడ)

